# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల మాస పత్రిక

సంపుటి : 57 | సంచిక : 3 | మార్చి, 2024 | పేజీలు : 28 | వెల : రు. 10/-


## బిజెపి ప్రభుత్వం అమలుచేస్తున్న మత, కులతత్వాలపై పోరాడి ఓడించండి

**అనాదిగా** మనదేశంలోని పాలకవర్గాలు- శ్రామిక ప్రజానీకంపై తమ ఆధిపత్యాన్ని, దోపిడీని సమర్థించుకునేందుకు,చాలా ద్వేషపూరితమైన మనుశాస్త్రాన్ని శాశ్వతీకరించారు. మతం ముసుగులో హిందూ - బ్రాహ్మణీయ వర్ణ వ్యవస్థ ద్వారా సమాజంలోని కుల, ఉపకులాల, కుల బహిష్కృతుల జనబాహుళ్యాన్ని, అందులోని ప్రతి ఒక్క సమూహాన్ని వేరు పరిచేవిధంగా, సజాతి వివాహాలకు కట్టుబడే విధంగా దానిని చట్టబద్ధం చేయడానికి ప్రయత్నించారు. అదే సమయంలో జాతివాదంతో, జాతి వివక్షతతో మాత్రమే సరిపోలే దుర్మార్గమైన సామాజిక వివక్ష రూపాలతో దానిని అమలు చేస్తున్నారు. ఈ వ్యవస్థ సహజ అణచివేతల స్వభావపు గర్భం నుండే, ఒక సమానత్వ సమాజం కోసం వెతుకులాడుతూ తిరుగుబాటు బావుటా ఎగురవేసిన మహావీరుడు, గౌతమ బుద్ధుడు, కబీర్, గురునానక్... ఇంకా భక్తి ఉద్యమానికి చెందిన అనేకమంది ముందుకు వచ్చారు. అయితే జైన మతం, బౌద్ధమతం, సిక్కు మతాలు-హిందూ కుల వ్యవస్థలో వ్యాపించి ఉన్న అన్ని ప్రభావాలకు లోనయ్యాయి. క్రిస్టియన్, ఇస్లాం మతాలకు సాంఘిక వివక్ష భావన పరాయిదే అయినప్పటికీ వారు కూడా దానికి బాధితులుగా మిగిలారు. తదనంతర కాలంలో సమానత్వానికి సంబంధించిన బూర్జువా భావాన్ని మనసులో లగ్నం చేసుకున్న ఫూలే, అంబేద్కర్, పెరియార్ వంటి సంఘసంస్కర్తలు... అప్పటికే బాగా వ్యాపించి ఉన్న దుర్మార్గ భావనలైన కర్మ, అమానవీయ కులవివక్ష, అంటరానితనాల సంకెళ్ళను బ్రద్దలు కొట్టేటందుకు, ఆత్మగౌరవం,సమానత్వం సాధించేందుకు, పీడిత ప్రజలను కదిలించారు. అయితే మానవ జాతి చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రేనని, కుల వ్యవస్థ అనేది కుల అణచివేతకు చెందిన నీచమైన, అత్యంత మొరటు రూపమని, ఈ దోపిడీ అణచివేతల కుల వ్యవస్థకు వ్యతిరేకంగా సాగించే అవిశ్రాంత వర్గ పోరాటం ద్వారా మాత్రమే దానిని ధ్వంసం చేయడం, నిర్మూలించడం సాధ్యమవుతుందనే అంశాన్ని గుర్తించడంలో వారు విఫలమయ్యారు.

ఈనాడు ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ బహుళ వైరుధ్యాల సాలెగూడులో చిక్కుకొని అల్లాడుతూ, తాను సృష్టించుకున్న శిఖర స్థాయి సమస్యల కింద పడి నలుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా తిరుగుబాట్ల అలలు ఎగస్తూ ఉండగా, పీడిత జాతులపై,ప్రజానీకంపై దోపిడీని అది ఇంకెంత మాత్రమూ కొనసాగించలేదు. మన దేశం వంటి అర్ధవలస, అర్ధఫ్యూడల్ దేశాలలో తీవ్రమవుతున్న ఆర్థిక సంక్షోభంలో తాము కూడా రోజులు లెక్కించుకోవలసి వస్తుందనే అంశాన్ని మన దేశీయ దళారులు గుర్తించారు.

బహుళ ప్రచారంతో ముందుకు తేబడిన ఆర్థిక సంస్కరణలు - సామ్రాజ్యవాదుల దోపిడీకి మన దేశ ద్వారాలను విశాలంగా తెరచి, సంపన్నులు మరింత సంపన్నులు అయ్యేందుకు అవకాశం కల్పించింది. అయితే అదే సమయంలో మన ప్రియతమ దేశంలోని అత్యధిక ప్రజానీకాన్ని పేదరికం, కరవు, నిరుద్యోగాల అగాధాల్లోకి లోతుగా పడదోశారు. ప్రజలను మోసగించేందుకు పాలకవర్గాలు గుడ్డి విశ్వాసాలను మత భావోద్వేగాలను ప్రేరేపించి, తద్వారా ప్రజలు మతతత్వ, కులతత్వ, సంకుచిత ఉన్మాదాలలో చిక్కుకుపోయేలా ప్రేరేపించాలని నిర్ణయించుకున్నారు. వారి నేరపూరిత పథకాలను నెరవేర్చుకోవడానికి, ప్రజల నడుమ విద్వేషాగ్నిని రగిలించి, విషాన్ని చిమ్మటంలో వారి రాజకీయ మార్గదర్శకులతో కలగలిసిన మతాంధులను, ఛాందసవాదులందరినీ తమ చుట్టూతా సమీకరించుకున్నారు. తద్వారా ప్రజలను విభజనకు గురిచేసి ఒకరితో ఒకరు కొట్లాడుకుంటూ తాము ఎదుర్కొనే వాస్తవిక సమస్యలపై స్పందించలేనివారుగా మలచుకున్నారు.

1980ల నుండి పాలకవర్గాలు అధికారంకోసం తమ తమ ఓటు బ్యాంకులను నిర్మించుకునే అత్యాశలో పోటీలు పడుతూ అభివృద్ధి నిరోధకుల, ఉన్మాదుల, మతతత్వ శక్తుల మార్గాన్ని నగ్నంగా చేపట్టారు. దీనిలో 'లౌకికవాద' కాంగ్రెస్, 'స్వయం ప్రకటిత హిందూ మత రక్షకులైన' బిజెపిలు-తమ అధికార క్రీడలో ఎవరికి ఎవరూ తీసిపోరు. 1984లో తన 'బ్లూ స్టార్ ఆపరేషన్' ఫలితంగా ఇందిరాగాంధీ హత్యకు గురైంది. దీనికి ప్రతీకారంగా హిందూ ఉన్మాదులు కాంగ్రెస్ వెనుక సమీకృతులై అమాయక సిక్కులను ఊచకోత చేస్తూ, జాతి హనన హింసకాండ సాగించారు. 1989లో దీర్ఘకాలంగా వేచి చూస్తున్న రిజర్వేషన్లపై మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలన్నప్పుడు, హిందువులందరినీ అయోధ్యలో ఊహాజనిత రామజన్మభూమిని విముక్తం చేసేందుకు తన వెనుక సమీకృతం కావలసిందిగా బిజెపి పిలుపునిచ్చింది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా జరిగిన రథయాత్రలో కుల వ్యవస్థ బాధితులు సైతం మతతత్వ ఉన్మాదంతో,ఈ మతతత్వ ఉన్మాదుల వెనుక కొట్టుకుపోయారు.

**మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళల దీక్షాదినం వర్ధిల్లాలి**

జనశక్తి
విప్లవ కమ్యూనిస్టుల మాస పత్రిక

వెబ్‌సైట్ :
www.janasakthionline.com
ఈ-మెయిల్ :
janasakthi1963@gmail.com

సంపుటి : 57
సంచిక : 2

లోపలిపేజీల్లో....

రాజకీయార్థికం :

| | |
|---|---|
| బిజెపి ప్రభుత్వం-కుల మతతత్వాలు | 1 |
| కేంద్ర బడ్జెట్-2024-25 - ప్రొ॥తోట జ్యోతీరాణి | 10 |
| వ్యవసాయ రంగం- లొంగుబాటు ఒప్పందాలు | 13 |
| కార్మికుల హక్కులను కబళించే 4 లేబర్ కోడ్‌లు | 15 |
| ప్రసార మాధ్యమాలపై ఫాశిస్టు దాడులు | 19 |
| భారతీయ న్యాయసంహిత - మోటారు వాహన డ్రైవర్లు | 21 |
| సహజవాయువుపై సామ్రాజ్యవాద కంపెనీల ఆధిపత్యం | 24 |

లెనిన్ శతవర్థంతి- :

| | |
|---|---|
| లెనిన్ స్మారకోపన్యాసం - స్టాలిన్ | 3 |
| 'లెనినిజం చిరస్థాయి అగుగాక' | 6 |

వర్థంతి/నివాళి :

| | |
|---|---|
| కా॥ కానూసన్యాల్ | 9 |
| కా॥ సింగారవేలు | 22 |
| కా॥మానం రామారావు | 25 |

రిపోర్టు :

| | |
|---|---|
| కా॥ లెనిన్ శతవర్థంతి సిసి ఆధ్వర్యంలో సభ | 26 |

ప్రకటన :

| | |
|---|---|
| రైతాంగంపై బిజెపి దమనకాండ | 27 |
| ఎన్నికలపై సిసి ప్రకటన | 28 |

**వెల :** విడిప్రతి...................రూ.10/–
సంవత్సర చందా....రూ. 100/–

చిరునామా :
**ఎస్.శేషమ్మ, ఎడిటర్**
**32–13–26/1, బి.ఎం.ఆర్. రోడ్,**
**ఎం.ఆర్.పురం, విజయవాడ–10.**

1992 డిసెంబర్ 6న బిజెపి శివసేనలకూటమి మరియు ఆర్ఎస్ఎస్/ విహెచ్‌పి/ భజరంగ్ దళ్‌ల కాషాయ సైన్యం, కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ మౌన ప్రోత్సాహ ఎత్తుగడతో, అక్కడ ఉనికిలో ఉన్న నాలుగు శతాబ్దాల పురాతనమైన బాబ్రీ మసీదు గోపురాల పైకి ఎక్కి దాడులు సాగించి, వాటిని ఒకటొకటిగా నేలమట్టం చేశారు. దాడులు అన్నిచోట్లా బ్రద్దలయ్యాయి. హిందూ మతోన్మాదులు కోపోద్రేకాలతో రెచ్చిపోయారు. ప్రభుత్వ పోలీసుల తోడ్పాటుతో శివ సైనికులు బొంబాయి, సూరత్ లలో ఘోరంగా వందలాదిమంది మైనారిటీలను హత్యగావించి, వేలాది మందిని నిర్వాసితులను చేశారు.

తదనంతరం ఈ హత్యలకు ప్రతీకారంగా 1992 డిసెంబర్,1993 జనవరిలలో జరిగిన బొంబాయి మత కల్లోలాలలో ముస్లిం ఉన్మాదులు బొంబాయి ప్రేలుళ్లకు పాల్పడి అమాయక పౌరుల హత్యలకు కారణమయ్యారు. ఈ బాంబు పేలుళ్ల కేసులో నిందితులుగా జైల్లో ఖైదీలుగా ఉన్న వందలాదిమంది ముస్లిం యువకులపై టాడా కేసులు బనాయించి తక్షణం అరెస్ట్ చేయగలిగిన ప్రభుత్వం, బాబ్రీ మసీదు కూల్చివేత నిందితులను, బొంబాయి,సూరత్ దాడులలో హంతకులను మాత్రం నిష్పూచిగా విడిచిపెట్టింది.

దాదాపు ఆ ఘటనలు జరిగిన 20 సంవత్సరాల తర్వాత బిజెపి 2014లో అధికారంలోకి వచ్చింది.అది 2019 సంవత్సరంలో భారీ ఆధిక్యతతో మరోసారి తిరిగి ఎన్నికయింది. అది హిందూ రాజ్యాన్ని, సనాతన ధర్మ రక్ష అనే మంత్రాలను వల్లె వేస్తోంది.దానిని ప్రశ్నించిన లేదా ఖండించిన వారిని ఫాసిస్టు శక్తులు లక్ష్యంగా చేసుకుంటున్నాయి. అనేక సంవత్సరాలుగా సుప్రీంకోర్టులో నిలిపి ఉంచబడిన కేసులో తీర్పును వెలువరించే విధంగా బిజెపి ప్రభుత్వం చేసుకోగలిగింది.

వందలాది సంవత్సరాలుగా కొనసాగుతున్న బాబ్రీ మసీదు అంశంలో 2019 సంవత్సరంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు, వివాదంలో కీలకమైనదిగా ఉంది. తీర్పు ఇచ్చిన నాటినుండి నేటి వరకు హిందూ మతతత్వం వైపు ప్రజలను మళ్ళించటానికి బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు బరితెగించి చేసిన ప్రయత్నాలతో పాటు దేవాలయ నిర్మాణ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. బిజెపి, కాంగ్రెస్ ఇతర పాలక పార్టీలన్నీ మతతత్వరేఖలపై ప్రజలను విభజించేందుకు ఈ వివాదాన్ని ఉపయోగించుకున్నాయి. అదే సమయంలో దేవాలయ నిర్మాణ కాలమంతా మత కల్లోలాలు, కుల వివక్ష, అయోధ్యలో మందిర పరిసరాల్లోని ప్రజల షాపుల, ఇళ్ల కూల్చివేతలు ఎడతెగకుండా కొనసాగాయి. 40 కిలో గ్రాముల వెండి ఇటుకతో మందిర నిర్మాణానికి మోడీ పునాదిరాయి వేశాడు.

జనవరి 22న బాల రాముని 'ప్రాణ ప్రతిష్ట' క్రతువును అయోధ్యలో అట్టహాసంగా నిర్వహించారు. "రాముడొచ్చాడు..... మన రాముడొచ్చాడు.... ఐదు శతాబ్దాల భారతీయుల కల సాకారమైంది..." అంటూ వార్తాపత్రికలు పతాక శీర్షికలతో, టీవీ ఛానళ్లు నిరంతరాయ ప్రసారాలతో, హంగు ఆర్భాటాలతో సాగే బాల రాముని 'ప్రాణప్రతిష్ట'అంశంపై దేశ ప్రజల దృష్టి నిలిపేలా చేశారు. ప్రజా సంక్షేమంపై, వారి అభివృద్ధిపై కనీస వ్యయం వెచ్చించలేని ప్రభుత్వం, వేలాది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని రామమందిర నిర్మాణం పైన, అయోధ్య పట్టణ అభివృద్ధి కార్యక్రమాల పైన వెచ్చించింది. 'ప్రాణ ప్రతిష్ట' క్రతువు అనంతరం అక్కడ సమీకృతులైన వారిని ఉద్దేశించి ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, "భవ్య మందిర నిర్మాణం పూర్తయింది. ఇక ఇప్పుడు జాతి నిర్మాణంపై దృష్టి సారించాలి. దృఢమైన, సమర్థవంతమైన, దైవత్వం కలిగిన, సుసంపన్న భారతదేశాన్ని నిర్మించేందుకు ఈ క్షణం నుండి ప్రతినిబూనాలని" పిలుపునిచ్చాడు. దీనికి తోడుగా వారణాసిలోని జ్ఞానవాపి, శ్రీకృష్ణుని జన్మస్థానం మధుర వంటి అంశాలను లేవనెత్తుతూ మతపరమైన వివాదాలను ప్రేరేపిస్తున్నారు. వేల సంవత్సరాలనాటి వివాదాలలో ఏది సత్యమో, ఏది వాస్తవమో ప్రజలపై తోస్తూ వారు వెనక కూర్చొని, ప్రజల దుస్థితిని చూసి ఆనంద పడుతున్నారు.

గత కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రస్తుతం మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం చేపట్టిన సామ్రాజ్యవాద దళారీ ఆర్థిక విధానాల అమలు ఫలితంగా ప్రజలు తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడ్డారు. పాలకవర్గాలు మతాన్ని మత్తుమందుగాను, ఆయుధంగాను ఉపయోగిస్తూ, తమ జీవితాలను విఛ్ఛిన్నం చేస్తున్న సవాలక్ష సమస్యల గురించి ప్రజలను ఆలోచింపనీయకుండా నిలువరిస్తున్నాయి. అదేవిధంగా ఒక ప్రజాస్వామిక లౌకిక రాజ్యంగా ప్రకటించుకుంటూ, ఫ్యూడల్ మత సాంప్రదాయాలను, మత ఆధిపత్యాన్ని, కుల వ్యవస్థను దృఢపరచడాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఈ రామ మందిర నిర్మాణంలో గొప్ప పాత్రను తాము చేపట్టి నిర్వహించామని ప్రకటించుకుంటూ, ప్రజలు ఈ సంఘటనను మరువక మునుపే ఎన్నికలను ముందస్తుగా జరిపేందుకు, ఎన్నికలలో విజయం సాధించేందుకు బిజెపి ప్రయత్నిస్తోంది. కనుక ప్రజలు ఈ భ్రమలకు గురికారాదు. పాలకవర్గాల ఫాసిస్టు మతోన్మాదానికి వ్యతిరేకంగా, సామ్రాజ్యవాద ఆర్థిక విధానాలకు దాసోహమైన పాలకుల దళారీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటానికి ప్రజలు సంసిద్ధం కావాలి.

**(2024 ఫిబ్రవరి 'క్లాస్‌స్ట్రగుల్' సంపాదక వ్యాఖ్యకు అనువాదం)** ✱

# క్రెమ్లిన్ మిలిటరీ స్కూల్ స్మారక సభలో జె.వి. స్టాలిన్ ఉపన్యాసం

**(కామ్రేడ్ లెనిన్ మరణించిన వారం రోజులకు–1924 జనవరి 28న జరిగిన స్మారక సభ)**



**ఈ** సాయంత్రం ఇక్కడ లెనిన్ స్మారక సభ ఏర్పాటు చేశారని, నన్ను ఒక ఉపన్యాసకునిగా పిలిచారని చెప్పారు. లెనిన్ పనివిధానం గురించి మాట్లాడటానికి ముందుగానే ఒక ప్రసంగ పాఠాన్ని తయారు చేసుకోవాల్సిన అవసరం నాకు లేదు. ఒక మనిషిగా, ఒక నాయకునిగా లెనిన్ సహజ గుణాలకు పరిమితమై, కొన్ని వాస్తవాలను మీ ముందుంచటం మంచిదని భావిస్తున్నాను. వాటి మధ్య అంతర్గత సంబంధం ఉండకపోవచ్చు. కాని లెనిన్ గురించి ఒక సాధారణ అభిప్రాయానికి రావటానికి అది అంత ముఖ్యం కాదు. ఏది ఏమైనప్పటికి ఈ సందర్భంగా ఇంతకంటే ఎక్కువ చేయలేకపోతున్నాను.

లెనిన్ నాకు మొదట పరిచయమైంది 1903లో. నిజమే, ఉత్తర ప్రత్యుత్తరాలద్వారానే పరిచయం అయిందిగాని, వ్యక్తిగతంగా కాదు. కానీ పార్టీ పనిలో ఎన్నడూ నన్ను విడిచి పెట్టనంతగా అది నాపై చెరగని ముద్ర వేసింది. అప్పుడు నేను సైబీరియాలో ప్రవాసంలో వున్నాను. లెనిన్ విప్లవ కార్యక్రమాల గురించి నేను తెలుసుకున్నది తొంభై చివరలో, ప్రత్యేకంగా 1901 తర్వాత, ఇస్క్రా వెలువడి నాక. అసాధారణ ప్రతిభగల మనిషిగా విశ్వసించాను. అప్పుడాయనను నేను కేవలం పార్టీ నాయకునిగా మాత్రమే కాదు, పార్టీ అంతర్గత తత్వాన్ని, తక్షణ అవసరాలను అర్థం చేసుకోగల నిజమైన పార్టీ నిర్మాతగా భావించాను. మన పార్టీ ఇతర నాయకులైన ప్లెఖనోవ్, మార్టోవ్, ఆక్సిల్రాడ్ లాంటి వారితో పోల్చితే లెనిన్ తన సహచరుల దృష్టిలో శిఖరాగ్రాన నిలబడతాడని చెప్పవచ్చు. ఆయన పార్టీలో ఒక నాయకుడు మాత్రమే కాదు, అత్యంత అగ్రశ్రేణి నాయకుడు. పోరాటంలో భయం యెరుగనివాడు, మౌంటెన్ ఈగెల్ లాంటివాడు. రష్యన్ విప్లవోద్యమానికి ఇంతవరకు ఎవ్వరూ కనుగొనని బాటను వేసి ధైర్యంగా పార్టీని ముందుకు నడిపినవాడు. ఇది నన్నెంతగా ప్రభావితం చేసిందంటే, విదేశంలో రాజకీయ ప్రవాసంవున్న నాదగ్గరి స్నేహితునికి అతని అభిప్రాయం చెప్పమంటూ ఉత్తరం రాశాను. కొంతకాలం తరువాత, 1903 చివర, నేను సైబీరియాలో ప్రవాస జీవితం గడుపుతున్నప్పుడు నా స్నేహితుని నుండి ఉత్సాహభరితమైన జవాబు వచ్చింది. నా స్నేహితుడు నా ఉత్తరాన్ని ఎవరికైతే పంపాడో వారి నుండి వచ్చింది. అది లెనిన్ రాసిన ఉత్తరం. సరళంగా, లోతైన వ్యక్తీకరణ కలిగి వుంది. లెనిన్ పెట్టిన నోట్ చిన్నదే కాని అందులో పార్టీ పనిని నిస్సంకోచంగా, నిర్భయంగా విమర్శించాడు. సమీప భవిష్యత్తులో పార్టీ పనిపై స్పష్టంగా, సంక్షిప్తంగా, ఆ ఉత్తరంలో రాసిన ప్రణాళిక గురించి ప్రత్యక్షంగా చెప్పాలి. జటిలమైన విషయాలను సులభంగా, స్పష్టంగా, సంక్షిప్తంగా లెనిన్ ఒక్కడే చెప్పగలడు. ఆయన ప్రతి వాక్యం దూసుకొచ్చిన తుపాకి గుండులా ఎక్కువ మాట్లాడదు. సాహసోపేతమైన ఆ చిన్న ఉత్తరంతో, మన పార్టీకి లెనిన్ మౌంటెన్ ఈగిల్ లాంటివాడు అనే నా అభిప్రాయం మరింత బలపడింది. మిగతా ఉత్తరాలలాగే లెనిన్ రాసిన ఉత్తరాన్ని అగ్నికి ఆహుతి చేశాను. అది అజ్ఞాతంలో వున్న ప్రతి పార్టీ కార్యకర్త చేసే పనే. అలా చేసినందుకు నన్ను నేను క్షమించు కోలేకపోయాను. అలా అప్పటి నుండి లెనిన్‌తో నా పరిచయం ఏర్పడింది.

## నిరాడంబరత

1905 డిసెంబర్‌లో టామెర్ ఫెర్స్ (ఫిన్లాండ్)లో జరిగిన బోల్షివిక్ మహాసభలో లెనిన్‌ని మొదటిసారిగా కలిశాను. మన పార్టీ మౌంటెన్ ఈగెల్‌ను ఒక గొప్ప మనిషిగా, గొప్ప అంటే రాజకీయంగానేగాదు, శారీరకంగా కూడా భారీ మనిషిగా ఊహించుకున్నాను. ఎందుకంటే లెనిన్‌ను ఒక దిగ్గజంగా, గంభీరమైనవాడుగా, శాసించేవాడుగా నా మనస్సులో చిత్రీకరించు కున్నాను. అప్పుడు ఏమి, నా నిరాశ! సగటు ఎత్తుకంటే తక్కువ వున్న ఒక సాధారణ వ్యక్తిని చూశాను. అక్షరాలా ఏవిధంగానూ మామూలు మనుష్యుల కంటే భిన్నంగా లేదు.

ఒక "గొప్ప మనిషి" మీటింగులకు ఆలస్యంగా రావటం, ఆయనకోసం ఊపిరి బిగబెట్టి సభ వేచిచూడటం, ఆ గొప్పమనిషి రావటానికి ముందు హెచ్చరికగా "హుష్, నిశ్శబ్దం....ఆయన వస్తున్నారు"లాంటి గుసగుసలు వినపడటం మామూలు విషయం. ఈ తంతు నాకు ఉత్తిత్తుగా అనిపించలేదు. అది మనస్సును ప్రభావితం చేస్తుంది. గౌరవాన్ని పెంచుతుంది అనుకున్నాను. కాని నాకు నిరాశే మిగిలింది. ఎందుకంటే ప్రతినిధులకంటే ముందుగానే సభకి లెనిన్ వచ్చాడని, తనకు తాను ఒకమూల కూర్చొని మామూలు ప్రతినిధులతో మమూలుగా మాట్లాడాడని తెలిసింది. ఇది కొన్ని ముఖ్యమైన నియమాలను ఉల్లంఘించటమేనని నేనప్పుడు అనుకున్నానని మీనుండి నేను దాచటం లేదు.

ఈ నిరాడంబరత, వినయం, అందరి దృష్టిలోను పడాలనుకోకపోవడం, కనీసం తనకు తాను ప్రస్ఫుటంగా కనిపించడం కోసం ప్రయత్నించకపోవడం, తన ఉన్నత స్థానాన్ని ఇతరులకు ఎత్తి చూపకపోవడం–ఈ లక్షణం మానవజాతి సాధారణ సైనిక శ్రేణికి చెందిన నూతన ప్రజల నూతన నాయకుడిగా లెనిన్‌లోని బలమైన అంశాలలో ఒకటని తర్వాత నేను తెలుసుకున్నాను.

## తార్కిక బలం

సభలో లెనిన్ చేసిన రెండు ప్రసంగాలు విశిష్టమైనవి. ఒకటి: వర్తమాన పరిస్థితి. రెండవది: వ్యవసాయ సమస్య. దురదృష్టవశాత్తు వాటిని భద్రపరచలేదు; అవి స్ఫూర్తినిచ్చాయి. యావత్తు సభ ఉత్సాహంతో ఉవ్వెత్తున లేచింది. సందేహాలను నివృత్తి చేయడంలో ఆయనకు అసాధారణ ప్రతిభవుంది. వాదనలో సరళత, స్పష్టతవుంది. క్లుప్తంగా, సులభంగా అర్థమయ్యే వాక్యాలు వుంటాయి. అతిగా మాట్లాడటం, హావభావాలు ప్రదర్శించటం, నాటకీయ డైలాగులు వుండవు – మామూలు పార్లమెంటరీ వక్తల ప్రసంగాలకు భిన్నంగా ఉండే లెనిన్ ఉపన్యాసాలు అందర్నీ ఆకట్టుకొంటాయి.

**మార్చి 5 – స్టాలిన్ 71వ వర్ధంతి**

# మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కా॥స్టాలిన్‌కు జోహార్లు

అయితే అప్పుడు నన్నుకట్టిపడేసింది లెనిన్ ఉపన్యాసాలలోని ఈ అంశం కాదు. అది ఆ ఉపన్యాసాలలోని ఎదురులేని తార్కిక బలం. సంక్షిప్తంగానే వుంటుంది ,కాని సభికులపై పట్టు సాధిస్తుంది. ఉత్సాహపరుస్తుంది. ఒకరు అన్నట్టు అప్పుడు మనం ఆ తర్కానికి పూర్తి అధీనుల మవుతాం.చాలామంది ప్రతినిధులు చెప్పుకోవడం నాకు జ్ఞాపకముంది. "లెనిన్ ఉపన్యాసాలలోని తర్కం శక్తివంతమైన టెంటకిల్స్‌లా మనల్ని చుట్టేసి పట్టుకుంటుంది. దాని పట్టు నుండి తప్పించుకొని పారిపోలేరు. నీవు లొంగిపోవాలి లేదా ఓటమిని అంగీకరించాలి."

## విలపించవద్దు

రెండవసారి 1906లో స్టాక్ హోమ్‌లో జరిగిన పార్టి కాంగ్రెస్‌లో నేను లెనిన్‌ని కలుసుకున్నాను. మీకు తెలుసు, ఈ మహాసభలో బోల్షివిక్కులు మైనారిటీలో వున్నారని, ఓడిపోయారని. ఓడిన పాత్రలో లెనిన్‌ను నేను మొదటిసారిగా చూశాను. ఓడిన తర్వాత విలపించి గుండెజారిన నాయకుల్లా లెనిన్ లేదు.అందుకు విరుద్ధంగా ఓటమి లెనిన్‌లో దాగివున్న శక్తిని బయటకు తెచ్చింది. అది మద్దతుదార్లని కొత్త పోరాటాలకి, కొత్త విజయాలకు పురికొల్పింది. లెనిన్ ఓటమి పొందామని నాతో అన్నారు. ఎలాటి ఓటమి అది? అతని ప్రత్యర్థులైన స్టాక్ హోమ్ కాంగ్రెస్ విజేతలు ప్లెఖనోవ్, అలెక్సి రాడ్, మార్టోవ్ తదితరులను చూడండి. నిజమైన విజేతలుగా వారు కనపడటంలేదు.మెన్షివిజాన్ని లెనిన్ ఎలాంటి కనికరం లేకుండా విమర్శించటంతో మాట్లాడటానికి వారి శరీరంలో ఒక్క ఎముక లేకపోయింది. నాకు జ్ఞాపకముంది. మేం, బోల్షివిక్కు ప్రతినిధులం ఒక గ్రూపుగా గుమిగూడి లెనిన్ వంక చూస్తూ ఆయన సలహా అడిగాం. కొందరు ప్రతినిధుల ప్రసంగాలలో నిరుత్సాహం, నిస్పృహ కనిపించింది. ఈ ప్రసంగాలకు లెనిన్ పళ్ళు బిగించి పదునుగా జవాబివ్వటం నాకు జ్ఞాపకముంది "ఏడవకండి, కామ్రేడ్స్, మనం చెప్పేది వాస్తవం, మనం గెలిచితీరుతాం". బుజ్జగించే మేధావులను అసహ్యించుకోవడం, స్వశక్తిపై, విజయంపై ధీమా, నమ్మకం – లెనిన్ మనల్ని ప్రభావితం చేసింది ఇదే. బోల్షివిక్కుల ఓటమి తాత్కాలికం, సమీప భవిష్యత్తులో ఖాయంగా విజయం మనదేనని భావించాం.

"ఓటమిపై విలపించవద్దు"–లెనిన్ కార్య కలాపాలల్లోని ఈ లక్షణమే కడదాకా, స్వశక్తిపై నమ్మకమున్న విశ్వసనీయ సైన్యం ఆయన చుట్టూ జేరేట్టు చేసింది.

## గొప్పలు చెప్పుకోవద్దు

1907లో లండన్‌లో జరిగిన పార్టి కాంగ్రెస్‌లో బోల్షివిక్కులు విజయం సాధించారు. విజేత పాత్రలో నేను లెనిన్‌ను చూడటం అదే మొదటిసారి. విజయంతో కొందరు నాయకులు ప్రగల్భాలు పలుకుతారు. గర్వం తలకెక్కి మారిపోతారు. చాల విషయాల్ని విజయంతో ప్రారంభిస్తారు; పురస్కారాలతో విశ్రమిస్తారు. అలాంటి నాయకులతో లెనిన్‌కి కొంచెం కూడా పోలిక లేదు. విజయం తర్వాతే ఆయన మరింత అప్రమత్తంగా, జాగరూకతగా ఉంటాడు. లెనిన్ ప్రతినిధులతో మరీమరీ చెప్పటం నాకు జ్ఞాపకముంది: "మొదటి విషయం: గెలుపు మత్తు తలకెక్కగూడదు. ప్రగల్భాలు పలకొద్దు. రెండవది: విజయాన్ని సంఘటితం చేసుకోండి. మూడవది: శత్రువుపై చివరి దెబ్బ పడాలి.మనం దెబ్బ కొట్టాం. కాని పూర్తిగా విజయం సాధించలేదు."ఇపుడు మెన్షివిక్కుల పని అయి పోయింది" అనే కొందరు ప్రతినిధుల పనికి మాలిన మాటల్ని ఆయన ఎండగట్టాడు. కార్మికోద్యమంలో మెన్షివిక్కులకు ఇంకా మూలాలు వున్నాయని చెప్పటానికి ఆయన వెనుకాడలేదు. వారితో చాకచక్యంగా పోరాడాలి. మన బలాన్ని ఎక్కువగా, ముఖ్యంగా శత్రువు బలాన్ని తక్కువగా అంచనా వేయగూడదు.

"విజయంపై ప్రగల్భాలు వద్దు"లెనిన్ ఈ లక్షణం శత్రువు శక్తిని అంచనా వేయటంలో తోడ్పడింది. ఎలాంటి ఆశ్చర్యకర సంఘటనలైనా ఎదుర్కోవటానికి పార్టీని సిద్ధం చేసింది.

## సూత్ర బద్ధంగా వుండటం

పార్టీ మెజారిటీ లైనును ప్రశంసించని పార్టీ నాయకులు వుండరు. మెజారిటీదే అధికారమనే దానిని పరిగణనలోకి తీసుకోని నాయకుడు వుండడు. పార్టీలోని ఏ ఇతర నాయకుడి కంటే కూడా లెనిన్‌కి ఇది తెలియనిది కాదు. కానీ లెనిన్ ఎన్నడూ మెజారిటీకి బందీ కాలేదు, ముఖ్యంగా ఆ మెజారిటీకి ఒక సూత్ర బద్ధత లేనప్పుడు. మెజారిటీ అభిప్రాయం లేదా పార్టీ తక్షణ ప్రయోజనాలు, శ్రామిక వర్గ ప్రాథమిక ప్రయోజనాలతో ఘర్షణలు పడిన సందర్భాలు పార్టీ చరిత్రలో వున్నాయి. అలాంటి సందర్భాలలో లెనిన్ పార్టీలోని మెజారిటీకి వ్యతిరేకంగా సూత్రబద్ధవైఖరితో దృఢంగా నిలబడటానికి వెనుదీయలేదు. అంతేకాదు, అందరికీ వ్యతిరేకంగా ఒక్కడంటే ఒక్కడుగానే పోరాడటానికి ఏమాత్రం భయపడలేదు.ఆయన తరచుగా అంటుంటాడు "సూత్రబద్ధ విధానమే సరైనది" అని.

ఈ ప్రత్యేక లక్షణాన్ని వివరించే రెండు వాస్తవాలను మీ ముందుంచుతాను. మొదటిది : అది 19-09-1911. విప్లవ ప్రతీఘాతం దెబ్బకు పార్టీ పూర్తిగా విచ్ఛిన్నమయ్యే పరిస్థితి ఏర్పడిన కాలం. పార్టీపై విశ్వాసం సడలింది. మేధావులే కాదు, కొంతవరకు కార్మికులు కూడా పార్టీని పూర్తిగా వదిలిపెడుతున్నారు. పార్టీ రహస్య నిర్మాణ అవసరాన్ని తిరస్కరించారు. ఆవిధంగా పార్టీని చాప చుట్టేసి అంతం చేయాలను కున్నారు. మెన్షివిక్కులే కాదు, బోల్షివిక్కులలోని అనేక గ్రూపులు, ధోరణులుగల వారిలో కూడా ఎక్కువభాగం కార్మికోద్యమంతో తెగతెంపులు జేసుకున్నారు. మీకు తెలుసు. ఆ కాలంలోనే పార్టీ రహస్య నిర్మాణాన్ని పూర్తిగా ఎత్తివేయాలని, స్టోలిపియన్ లాంటి లిబరల్ పార్టీగా కార్మిక నిర్మాణం ఉండాలనే భావం తలెత్తింది. అప్పుడు అంతటా వ్యాపించిన ఆ అంటువ్యాధికి లొంగని వాడు లెనిన్ ఒక్కడే. ఆశ్చర్యకరమైన సహనంతో, అద్వితీయ పట్టుదలతో పార్టీ సైద్ధాంతిక జెండాను ఎత్తి పట్టుకున్నాడు. చెల్లాచెదరై, చెక్క ముక్కలైన పార్టీ శ్రేణులను చేరదీశాడు.కార్మికోద్యమంలోని ప్రతి పార్టీ వ్యతిరేక ధోరణిని ఎదిరించి పోరాడాడు. పార్టీ మూలసూత్రాల్ని అసాధారణ ధైర్యంతో, అసమాన దీక్షతో పరిరక్షించాడు.

పార్టీ మూల సూత్రాలకోసం జరేగే పోరాటంలో చివరకు గెలిచింది లెనిన్ అని మనకు తెలుసు.

రెండవది: 1914-17, సామ్రాజ్యవాద యుద్ధం ముమ్మరంగా సాగుతున్న కాలం. సోషల్ డెమోక్రటిక్, సోషలిస్ట్ పార్టీలన్నీ దేశభక్తి ఉన్మాదానికి లొంగిపోయాయి.తమతమ దేశాల సామ్రాజ్యవాద సేవలో మునిగిపోయాయి. రెండవ ఇంటర్నేషనల్ పెట్టుబడిదారీ విధానం ముందు చతికిలబడింది. ప్లెఖనోవ్, కాట్స్కి, గ్యూస్‌డే తదితరులు జాతీయోన్మాదం అలలతాకిడి ముందు నిలబడలేకపోయారు. లెనిన్ ఒక్కడే, బహుశ ఒక్కడంటే ఒక్కడే, జాతీయోన్మాదానికి, నిరాశావాదానికి వ్యతిరేకంగా పోరాడాడు. గ్యూస్‌డే, కాట్స్కిల దివాళాకోరుతనాన్ని, "విప్లవ కారుల" మధ్య ఊగిసలాటను కళంకంగా భావించి ఖండించాడు. అల్ప సంఖ్యాకులే తనకు మద్దతుగా వున్నారని లెనిన్‌కు తెలుసు. కానీ తనకిది నిర్ణయం తీసుకొనే సమయంకాదని కూడా తెలుసు. ఖచ్చితమైన అంతర్జాతీయ వాదమే భవిష్యత్తులో సరియైన విధానంగా వుంటుంది. ఆ సరైన విధానం సరైన సూత్రంపై ఆధారపడివుంటుంది. కొత్త అంతర్జాతీయ విధానంకోసం జరిగిన ఈ పోరాటంలో కూడా లెనిన్ విజయవంతమైనాడని మనకు తెలుసు.

"సూత్రబద్ధమైన విధానమే సరైంది" ఈ సూత్రంతోనే లెనిన్ పోరాడి అభేద్యమైన స్థానానికి చేరాడు. శ్రామిక వర్గాన్ని విప్లవ మార్క్సిజం వైపు నడిపాడు.

## ప్రజలపై విశ్వాసం

దేశ చరిత్రలు తెలిసినవాళ్ళు, విప్లవ చరిత్రలను తొలి నుండి తుదివరకు చదివిన

సిద్ధాంతవేత్తలకు, పార్టీ నాయకులకు కొన్ని సమయాలలో సిగ్గుపడాల్సిన జబ్బు ఒకటి పట్టుకుంటుంది. ఆ జబ్బు పేరు ప్రజాభయం. ప్రజల సృజనాత్మకశక్తిలో విశ్వాసం లేకపోవడం. ఇది కొన్ని సమయాలలో ప్రజలపట్ల పెత్తందారీ తనానికి దారితీస్తుంది. విప్లవ చరిత్రలలో అంతగా ప్రావీణ్యం లేనప్పటికీ, పాతవ్యవస్థను నాశనం చేసి కొత్తది నిర్మించుతామంటారు . ఇలాంటి పెత్తందారీతనానికి కారణం వాళ్ళకో భయం వుంటుంది. ప్రజలు ఇష్టానుసారం వ్యవహరించవచ్చు. మరీ ఎక్కువగా విధ్వంసం చేయవచ్చు అని...జనం నుండి నేర్చుకోవాలని లేకపోవడం, పుస్తకాలలో చదివిన దానిని ఒక గురువుగా ప్రజలకు నేర్పాలనే తపన ఇందుకు కారణం.

అలాంటి నాయకులకు లెనిన్ చాలా వ్యతిరేకం. శ్రామిక వర్గ సృజనాత్మక శక్తిలో, ఆ వర్గానికి సహజంగా ఉండే విప్లవ సామర్థ్యంలో అపార విశ్వాసంగల నాయకుడు లెనిన్ కంటే మరొకరు లేరు. "విప్లవ అల్లకల్లోలాన్ని", "ప్రజల అనధికార దాడుల"ను శాపనార్థాలు పెట్టే కువిమర్శకులపట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరించే లెనిన్ లాంటినాయకుడు మరొకరు లేరు. ఒక కామ్రేడ్ ఒక సంభాషణలో పాలుపంచుకొంటూ ఇలా అనటం నాకు జ్ఞాపకముంది: "విప్లవం సాధారణ క్రమంలో సాగాలి". లెనిన్ వ్యంగ్యంగా జవాబిచ్చాడు: "చరిత్రలో సాధారణ క్రమం అంటే విప్లవ క్రమమేనన్న సంగతి విప్లవకారులు అనుకొనేవాళ్ళు మర్చిపోవడం జాలిపడాల్సిన విషయం".

అహంకారంతో ప్రజల్ని తక్కువగా అంచనావేసి, పుస్తకాలనుండి బోధించాలను కొనేవాళ్ళని లెనిన్ అసహ్యించుకుంటాడు. లెనిన్ నిరంతరం చెప్పే సూత్రం - ప్రజల నుండి నేర్చుకో, వాళ్ళ కార్యకలాపాల్ని అవగాహన చేసుకో. ప్రజాపోరాటాల ఆచరణ, అనుభవాల్ని జాగ్రత్తగా అధ్యయనం చేయి.

ప్రజల సృజనాత్మక శక్తిలో విశ్వాసం-ఇది లెనిన్ కార్యకలాపాలలోని లక్షణం. దీనివల్లనే లెనిన్ ఆకస్మికంగా వచ్చే సంఘటనలను అర్థంచేసుకొని శ్రామిక విప్లవ మార్గంలోకి మళ్లించగలిగాడు.

## విప్లవ మేధావి

లెనిన్ విప్లవం కోసం పుట్టాడు. నిజం చెప్పాలంటే లెనిన్ ఆకస్మిక విప్లవాల మేధావి. విప్లవ నాయకత్వ కళలో ఆరితేరిన ఉపాధ్యాయుడు. లెనిన్ విప్లవ వెల్లువ కాలంలో ఉన్నంత స్వేచ్ఛగా, సంతోషంగా మరొకప్పుడు వుండడు. దీని అర్థం లెనిన్ అన్ని విప్లవ తిరుగుబాట్లను ఒకేరకమైనవిగా ఒప్పు కుంటాడని కాదు. అన్నికాలాల్లో, అన్ని పరిస్థితుల లోను ఆకస్మిక విప్లవాలకు అనుకూలుడనికాదు. నాఉద్దేశ్యం ఏమిటంటే విప్లవం వెల్లువెత్తినపుడు లెనిన్ మేధస్సులోని అంతరదృష్టి సంపూర్ణంగా, స్పష్టంగా బహిర్గతమౌతుంది. విప్లవ కాలంలో ఆయన వికసిస్తాడు. ప్రవక్తలా మారతాడు. వర్గాల కదలికలను,విప్లవంలోని మెలికలను తన అరచేత చూచినట్లు తెలుసుకుంటాడు. ఆ కారణంగానే మన పార్టీ వర్గాలు మంచిగా చెప్పుకుంటాయి: "నీటిలో చేపలాగ విప్లవ ప్రవాహంలో లెనిన్ ఈదుతాడు."

అందువల్లే లెనిన్ ఎత్తుగడల నినాదాలలో ఆశ్చర్యకరమైన స్పష్టతవుంటుంది. విప్లవ ప్రణాళిక ధైర్యంతో కూడి వుంటుంది.

లెనిన్ ప్రత్యేక లక్షణాన్ని తెలిపే రెండు విషయాలను జ్ఞాపకం చేసుకుంటాను.

మొదటిది: అక్టోబర్ విప్లవ కాలానికి కాస్త ముందు. ఆ కాలంలోనే లక్షలాది కార్మికులు, రైతులు, సైనికులు ముందు,వెనుక సంక్షోభంలో కూరుకుపోవడంతో శాంతి, స్వేచ్ఛ కావాలని డిమాండ్ చేయసాగారు. అదేకాలంలో జనరల్స్, పెట్టుబడిదారులు సైనిక నియంతృత్వం కోసం "యుద్ధం అంతం"కావాలన్నారు. "ప్రజాభిప్రాయం", "సోషలిస్టు పార్టీ"లుగా పిలువబడేవి బోల్షివిక్కు లకు వ్యతిరేకమయ్యారు. వారిని "జర్మన్ గూఢచారులు"గా ముద్రవేశాయి. కెరన్స్కీ బోల్షివిక్కులను అజ్ఞాతవాసంలోకి పంపటానికి చేసిన ప్రయత్నాలు కొంతవరకు ఫలించాయి. అత్యంత శక్తివంతమైన, క్రమశిక్షణ గల ఆస్ట్రో, జర్మన్ సైన్యాలు అలసిపోయి, చిన్నాభిన్నమై పోతున్న మన సైన్యాలతో పోరాడుతున్నాయి. "సంపూర్ణ విజయం కోసం యుద్ధం" అంటూ పశ్చిమ యూరప్ "సోషలిస్టులు" వాళ్ళ ప్రభుత్వాలతో ఆనందదాయకమైన మైత్రితో ఉన్నారు.

అలాంటి కాలంలో తిరుగబడండి అంటే ఎలావుంటుంది? అలాంటి పరిస్థితిలో తిరుగుబాటు అంటే ప్రతిదానిని పణంగా పెట్టడమే. ప్రమాదాన్ని ఎదుర్కోవటానికి లెనిన్ భయపడ లేదు. ఆయన కళ్ళ ముందు భవిష్యత్తు కదలాడుతోంది. తిరుగుబాటు అనివార్యం. విజయం తథ్యం. రష్యాలో తిరుగుబాటు సామ్రాజ్యవాద యుద్ధం అంతమవటానికి మార్గాన్ని తెరుస్తుంది. యుద్ధంపట్ల ఆసక్తిలేని పశ్చిమ దేశాల ప్రజలు ఉద్యమిస్తారు. అప్పుడు సామ్రాజ్యవాద యుద్ధం అంతర్యుద్ధంగా మారుతుంది; సోవియట్ రిపబ్లిక్ తిరుగుబాటుకి దారి చూపుతుంది. సోవియట్ రిపబ్లిక్ ప్రపంచ విప్లవోద్యమానికి దుర్గంలా పనిచేస్తుంది.

లెనిన్ విప్లవ దూరదృష్టి అసమానమైనది, ఖచ్చితమైనదని తర్వాతకాలంలో రుజువయిందని మనకు తెలుసు.

రెండవది: అవి అక్టోబర్ విప్లవం తొలి రోజులు. శత్రుత్వాన్ని అంతంచేసి, జర్మన్లతో యుద్ధవిరమణకి సంప్రదింపులు జరపాలని పీపుల్స్ కమిస్సార్ సమితి తిరుగుబాటు సైనిక కమాండర్ ధకోనిన్‌ను ఒప్పించటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. నాకు జ్ఞాపకముంది. నేను, లెనిన్, క్రిలింకో (కాబోయే చీఫ్ కమాండర్) పెట్రోగార్డ్‌లోని జనరల్ స్టాఫ్ హెడ్ క్వార్టర్స్‌కి ధకొనిన్‌తో టెలిఫోన్ ద్వారా మాట్లాడదామని వెళ్లాం. ఘోరం! ధకొనిన్, ఫీల్డ్ హెడ్ క్వార్టర్స్, పీపుల్స్ కౌన్సిల్ ఆజ్ఞలను పాటించటానికి ఖచ్చితంగా నిరాకరించారు. సైనిక ఆఫీసర్లు పూర్తిగా ఫీల్డ్ ఆఫీసర్ల మధ్య ఊగిసలాటలో ఉన్నారు. పద్నాలుగు లక్షల సైన్యం ఏం చెబుతుందో సైనికులలో ఏఒక్కరు చెప్పలేరు. సైనిక సంస్థలన్నీ ఒకదానికొకటి లోబడి వుంటాయి. సోవియట్ అధికారాన్ని వ్యతిరేకిస్తాయి. పెట్రోగార్డ్‌లోనే ఒక మిలిటరీ తిరుగుబాటు రూపుదిద్దుకుంటోందని మనకు తెలుసు. కెరన్స్కీ పెట్రోగార్డ్ వైపుగా వస్తున్నాడు. నేను టెలిఫోన్ లైన్‌లో మాట్లాడిన కొంచెం సేపు తర్వాత లెనిన్ ముఖంలో అద్వితీయమైన వెలుగును చూశాను. ఆయనో స్పష్టమైన నిర్ణయానికొచ్చేశాడు. "మనం వైర్‌లెస్ స్టేషన్‌కి పోదాం. అదే సరైన స్థలం. జనరల్ ధకొనిన్‌ని డిస్మిస్ చేస్తూ ప్రత్యేక ఆజ్ఞను జారీ చేద్దాం. అతని స్థానంలో క్రేలింకోని చీఫ్‌గా నియమిద్దాం. జనరల్స్‌ని చుట్టుముట్టమని సైనికులకు పిలుపునిద్దాం. శత్రుత్వానికి స్వస్తి చెప్పి, ఆస్ట్రో జర్మన్ సైనికులతో సంబంధాలు ఏర్పరుచుకోవాలని, శాంతి స్వయానా పరిరక్షించాలని ఆదేశిద్దాం.

ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. కాని లెనిన్ ముందడుగు వేయటంలో జంకలేదు. పైగా త్వరితంగా నిర్ణయాన్ని తీసుకున్నాడు. ఆయనకు తెలుసు. సైన్యానికి శాంతికావాలి. తనమార్గంలోని ప్రతి అడ్డును తొలగించి అది శాంతిని సాధిస్తుంది. ఈ రకంగా శాంతిని సాధించడం వలన అది ఆస్ట్రో జర్మన్ సైనికులపై ప్రభావం చూపుతుంది. ఎలాంటి మినహాయింపు లేకుండా ప్రతి రంగంలో శాంతి ప్రయత్నం విజయవంత మవుతుంది.

ఇక్కడకూడా లెనిన్ దూరదృష్టి అత్యంత ఖచ్చితత్వంతో రుజువయిందని తర్వాత మనం తెలుసుకున్నాం.

ముందు ముందు జరగబోయే ఘటనల అంతరార్థాన్ని గ్రహించే శక్తి, అంతర్దృష్టి గల మేధస్సు లెనిన్‌లోని గొప్ప లక్షణం. ఈ లక్షణమే విప్లవోద్యమం మలుపుల్లో సరైన వ్యూహాన్ని స్పష్టమైన విధానాన్ని అనుసరించడానికి తోడ్పడింది. ★

కామ్రేడ్ లెనిన్ శతవర్ధంతి సందర్భంగా...

# లెనినిజం చిరస్థాయి అగుగాక!



**("లెనినిజం చిరస్థాయి అగుగాక" అనేది, కామ్రేడ్ లెనిన్ 90వ జయంతి సందర్భంగా, నాటి ప్రపంచ కమ్యునిస్ట్ ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్ళ నేపథ్యంలో 'పెకింగ్ రివ్యూ' సంపాదక వర్గం1960లో ప్రచురించిన పత్రం.**

**ఒకవైపున లెనినిజం యొక్క విశిష్టతను ఎత్తి పడుతూ, దాని విప్లవ చేవని పల్చన చేసి, వర్గ పోరాట పంథాను దిగజార్చి, కార్మికవర్గ చైతన్యాన్ని పక్కదారి పట్టించే అవకాశవాద రివిజనిస్టు అవగాహనలను ఎత్తిచూపే పత్రం "పెకింగ్ రివ్యూ" పత్రికలో (1960 ఏప్రిల్ 26న) వెలువడింది. దీని రూపకర్తలు చైనా కమ్యూనిస్టు పార్టీ పత్రిక 'రెడ్ ఫ్లాగ్' సంపాదకవర్గం. ఇది 1960లోనే, అంటే 63 సంవత్సరాల క్రితమే, తెలుగు భాషలోకి అనువాదమై కమ్యూనిస్టు శ్రేణులలో మౌలికమైన సైద్ధాంతిక ఆలోచనలను రేకెత్తించింది.**

**కామ్రేడ్ లెనిన్ శతవర్ధంతి (21 జనవరి 2024) సందర్భంగా 6 భాగాలుగా ఉన్న ఈ చారిత్రక పత్రాన్ని, కమ్యూనిస్టు ఉద్యమ శ్రేణులు అర్థం చేసుకుని నేటి పరిస్థితులకు అన్వయించుకుంటారని ఆశిస్తూ 'లెనినిజం చిరస్థాయి అగుగాక!' పత్రంలోని మూడవ భాగాన్ని ఇపుడు అందిస్తున్నాం. మిగిలిన భాగాలు వచ్చే సంచికలలో ప్రచురితమౌతాయి.**

**– సంపాదకులు)**

**3**

**ఆధునిక** రివిజనిస్టులు నేటి ప్రపంచ పరిస్థితిని గురించి చేసే అర్ధరహితవాదనల నుంచీ, మార్క్సిజం–లెనినిజం బోధించే వర్గ పోరాట సిద్ధాంతం ప్రస్తుత పరిస్థితులకు వర్తించదనే వాదననుంచీ, బలప్రయోగం, యుద్ధం, శాంతియుత సహజీవనం మొదలైన సమస్యలపై మార్క్సిజం–లెనినిజం బోధించే కీలక సిద్ధాంతాలనుకూడా తలక్రిందులు చేస్తున్నారు.

రివిజనిస్టులు కాని మరికొందరు సదుద్దేశాలు గలవారు ఉన్నారు. వారు హృదయ పూర్వకంగా మార్క్సిస్టులుగా ఉండగోరుతారు. అయితే, కొన్ని నూతన చారిత్రక పరిణామాలు చూచి గందరగోళంలో పడతారు. ఆ విధంగా కొన్ని అపసవ్యమైన అభిప్రాయాల నేర్పరచు కుంటారు. ఉదాహరణకు ఆటంబాంబులతో ప్రపంచాన్ని హడలుకొట్టదలచుకొన్న అమెరికన్ సామ్రాజ్యవాదుల ప్లానులు తలక్రిందులవడం వల్ల, ప్రపంచంలో బలప్రయోగం ఆగిపోయినట్లు వీరిలో కొందరు అభిప్రాయపడుతున్నారు.

ఒకవైపు మనం ఆధునిక రివిజనిస్టుల అర్ధరహిత వాదనలను ఖండిస్తూనే, యీ సదుద్దేశాలు గలవారు తమ పొరబాటు అభిప్రాయాలను సరిదిద్దుకొనేటట్లు సహాయ పడవలసియుంది, బలప్రయోగమంటే అర్థమేమిటి? లెనిన్ యీ సమస్యపై "రాజ్యాంగ యంత్రం – విప్లవం" అను గ్రంథంలో చాలా విషయాలు చెప్పారు. అసలు రాజ్యాంగయంత్రం తలఎత్తడ మంటేనే, ఏర్పడ్డమంటేనే ఒక విధమైన బలప్రయోగం. ఎంగెల్స్ వ్రాసిన యీ క్రింది వాక్యాలను లెనిన్ తన గ్రంథంలో ఉదహరించారు.

"…. దీని (ప్రభుత్వాధికారం) క్రిందికి సాయుధబలాలేగాక, భౌతికవ్యవస్థలు. జైళ్ళు, రకరకాలైన నిర్బంధాలను ప్రయోగించే సంస్థలు కూడా వస్తాయి." (సెలక్టెడ్ వర్క్సు" – ఇంటర్నేషనల్ పబ్లిషర్స్: న్యూయార్క్. 7 వ సంపుటి, 10 వ పేజీ.)

లెనిన్ రెండు రకాలైన రాజ్యాంగ యంత్రాల మధ్య తేడా గుర్తించాలన్నారు. ఒకటి బూర్జునా నియంతృత్వం, మరొకటి శ్రామిక నియంతృత్వమూను. అలాగే రెండు విధాలైన బలప్రయోగం ఉంది. ఒకటి విప్లవ వ్యతిరేక బలప్రయోగం, మరొకటి విప్లవకర బల ప్రయోగమూను. విప్లవ వ్యతిరేక బలప్రయోగ మున్నంతకాలం దాన్ని వ్యతిరేకించే విప్లవకర బలప్రయోగం కూడా ఉంటుంది. విప్లవకర బల ప్రయోగం లేకుండా విప్లవ వ్యతిరేక బల ప్రయోగాన్ని నిర్మూలించలేం. పీడించేవర్గాల అధికారంలో ఉండే రాజ్యాంగయంత్రం, విప్లవ వ్యతిరేకమైన బలప్రయోగమే. పీడించే వర్గాల ప్రయోజనాలను కాపాడేందుకు పీడింపబడే ప్రజల్ని అణచియుంచే ప్రత్యేకసాధనం అది. సామ్రాజ్యవాదులు ఆటంబాంబులను. రాకెట్ ఆయుధాలను కలిగియుండక ముందు, కలిగి యున్న తర్వాతకూడా సామ్రాజ్యవాద ప్రభుత్వం తన దేశంలోని శ్రామికులను, వలస – అర్ధవలస దేశాల్లోని ప్రజలను అణచియుంచే ప్రత్యేక సాధనంగా ఉంటూ వచ్చింది, అదెల్లప్పుడూ బలప్రయోగం చేసే సంస్థే. అది యీ కొత్త ఆయుధాలను ఉపయోగించగల స్థితిలో లేనప్పటికీ, సామ్రాజ్యవాద ప్రభుత్వం ఎల్లప్పుడూ బలప్రయోగం చేసే సంస్థగానే ఉంటుంది. దాన్ని కూలద్రోసి ప్రజల ప్రభుత్వాన్ని స్థాపించే వరకు, శ్రామిక నియంతృత్వ ప్రభుత్వాన్ని ఏర్పరచేవరకు ఆ స్వభావం దానికి వుండి తీరుతుంది.

ఆధునిక సామ్రాజ్యవాదులు ప్రయోగి స్తున్నంత బ్రహ్మాండమైన, అమానుషమైన బలప్రయోగం ప్రపంచ చరిత్రలో కనీవినీ వుండము. గత పది పన్నెండు సంవత్సరాల్లో అమెరికన్ సామ్రాజ్యవాదులు యిది వరకుకంటే వందరెట్లు అమానుషమైన హింసాకాండను ఉపయోగిస్తూ వచ్చారు; అమెరికన్ కార్మికవర్గం యొక్క ఉత్తమ పుత్రులందరినీ, అభ్యుదయ కాముకులందరినీ నీగ్రో ప్రజల్లో అనేకమందిని దారుణమైన హింసాకాండకు గురిచేశారు. పైగా మొత్తం ప్రపంచాన్నే తమ యినుప పాదాల క్రింద నలిపి వేస్తామని వారు బెదరిస్తున్నారు. నిరంతరం వారు తమ దౌర్జన్య సాధనాలను విస్తృత పరచుకొంటున్నారు. ఇలాగే యితర సామ్రాజ్యవాదులు కూడ యీ పోటీలో పాల్గొంటూ, తమ దౌర్జన్య సాధనాలను పెంచుకొంటున్నారు.

అమెరికా నాయకత్వం క్రిందనున్న సామ్రాజ్యవాద దేశాల సైన్య వ్యవస్థ అత్యంత తీవ్రమైన పెట్టుబడిదారీ సాధారణ సంక్షోభ దశలో ఉధృతరూపం దాల్చింది. సామ్రాజ్యవాదు లెంత ఉన్మాదంతో తమ సైనిక శక్తుల్ని పెంచుకొంటూపోతే అంత త్వరగా వారు నాశనమవుతారు. ఈ రోజున కొందరు అమెరికన్ సామ్రాజ్యవాద ప్రతినిధులు సైతం పెట్టుబడిదారీ విధానం పతనమై తీరుతుందని భావిస్తున్నారు. అయితే, సామ్రాజ్యవాదులు తమంతట తాము బలప్రయోగానికి స్వస్తి చెబుతారా ? సామ్రాజ్యవాదం అంతకంతకు వినాశకాలాన్ని సమీపిస్తుందికదా అని ఆయా సామ్రాజ్యవాద దేశాల్లో అధికారం చెలాయిస్తున్న వారు యిష్ట పూర్వకంగా బలప్రయోగం మానుకుంటారా? గతంతో పోలిస్తే

సామ్రాజ్యవాదులు బలప్రయోగాన్ని మాను కొన్నారనిగాని, తగ్గించుకొన్నారనిగాని చెప్పగలమా?

లెనిన్ యిట్టి ప్రశ్నలకు అనేక సందర్భాల్లో సమాధానాలు చెప్పారు. "సామ్రాజ్యవాదం: పెట్టుబడిదారీ విధానం యొక్క అత్యున్నత దశ" అను గ్రంథంలో ఆయనిలా వ్రాశారు :

"...రాజకీయంగా ఆలోచిస్తే సామ్రాజ్య వాదం మొత్తం మీద బలప్రయోగం వైపు, అభివృద్ధి నిరోధకత్వంవైపు నడుస్తుంది." (సెలక్టెడ్ వర్క్స్ ఇంటర్నేషనల్ పబ్లిషర్స్, న్యూయార్కు, 5వ సంపుటి, 83వ పేజీ)

అక్టోబరు విప్లవం తర్వాత ఆయన "శ్రామిక విప్లవం, ద్రోహి కాట్ స్కీ" అను గ్రంథంలో గుత్త పెట్టుబడిదారీ విధానానికీ, అంటే సామ్రాజ్యవాదానికీ అంతకుముందున్న పెట్టుబడిదారీ విధానానికీ గల తేడాను వివరించారు. ఆయనిలా వ్రాశారు :

"గుత్త పెట్టుబడిదారీ విధానానికి ముందున్న పెట్టుబడిదారీ వ్యవస్థ 1870 ప్రాంతంలో ఉచ్ఛస్థితికి చేరుకొంది. దాని ప్రధాన ఆర్థిక లక్షణాల దృష్ట్యా (ఇవి ఇంగ్లండ్ లోను, అమెరికాలోను ప్రముఖంగా కనిపించాయి) శాంతిపట్ల, స్వాతంత్ర్యంపట్ల అది అనుకూల వైఖరిని అవలంబించింది. 20వ శతాబ్దంలో మాత్రమే పరిపక్వ దశకు వచ్చిన సామ్రాజ్యవాదం, అంటే గుత్త పెట్టుబడిదారీ విధానం యొక్క ప్రధాన ఆర్థిక లక్షణాల దృష్ట్యా శాంతిపట్ల, స్వాతంత్ర్యంపట్ల కొంచెంకూడా సుముఖత చూపలేదు; అత్యధిక స్థాయిలో సైన్య వ్యవస్థను సర్వత్రా అభివృద్ధి చేసింది." (సెలక్టెడ్ వర్క్స్ – ఇంటర్నేషనల్ పబ్లిషర్స్, 7 వ సంపుటి, 125 వ పేజీ) ఈ వాక్యాలు అక్టోబరు విప్లవం తొలిదశలో వ్రాయబడినవి. శ్రామిక ప్రభుత్వం అప్పుడే ఆవిర్భవించింది. దాని ఆర్థిక వనరులు స్వల్పమైనవిగాను, బలహీనంగాను ఉన్నాయి. అప్పటికీ యిప్పటికీ చాల వ్యత్యాసం ఉంది. సుమారు 40 సంవత్సరాల తర్వాత సోవియట్ ప్రభుత్వం యొక్క, మొత్తం ప్రపంచం యొక్క రూపురేఖలే మారిపోయాయి. సోవియట్ యూనియన్ యొక్క, సోషలిస్టు శక్తులయొక్క, శాంతి శక్తులయొక్క బలంవల్ల సామ్రాజ్యవాద స్వభావం మారిందనీ, అందుచేత లెనిన్ నిర్ధారణలు పాతబడిపోయాయనీ చెప్పగలమా? లేక సామ్రాజ్యవాద స్వభావం అలాగే ఉన్నప్పటికీ అది బలప్రయోగానికి దిగదని చెప్పవలసి యుంటుందా? ఈ అభిప్రాయాలు వాస్తవ పరిస్థితికనుగుణంగా ఉన్నాయా?

సోషలిస్టు వ్యవస్థ పెట్టుబడిదారీ వ్యవస్థపై పోరాటం జరుపుతూ పైచేయి సంపాదించింది. ఇదొక చారిత్రక సత్యం. ఇది ప్రపంచంలో సామ్రాజ్యవాదుల స్థానాన్ని బలహీనపరచింది. అయితే, దీన్ని బట్టి సామ్రాజ్యవాదులు తమ దేశంలోని ప్రజల్ని యిక పీడించరనిగాని, యితర దేశాలపై దురాక్రమణ జరపరనిగాని చెప్పగలమా? సామ్రాజ్యవాద దుండగులు "కసాయివాని కత్తిని దూరంగా పారవేస్తార"ని, "కత్తులను అమ్మి ఎడ్లను కొంటార"నీ భావించగలమా? సామ్రాజ్యవాద దేశాల్లో ఆయుధాల వ్యాపారం చేసేవారు ఒక్కసారి శాంతికార్యాలకు దిగుతారనుకోగలమా?

తీవ్రంగా ఆలోచించే మార్క్సిస్టు లెనినిస్టుల్ని ఈ ప్రశ్నలన్నీ ఎదుర్కొంటున్నాయి. ఇవి లోతుగా ఆలోచించవలసిన సమస్యలు. వీటిని సక్రమంగా పరిశీలించినట్లయితే శ్రామికవర్గ ఆశయం, మానవ జాతి లక్ష్యం సిద్ధిస్తుంది. తద్భిన్నంగా పరిశీలిస్తే దెబ్బతింటుంది.

యుద్ధమనేది బలప్రయోగం యొక్క తీవ్రమైన రూపం. యుద్ధాలు రెండువిధాలు: ఒకటి అంతర్యుద్ధం: రెండు బాహ్యయుద్ధం. బలప్రయోగం ఎల్లప్పుడూ యుద్ధం ద్వారానే వ్యక్తంకాదు. పెట్టుబడిదారీ దేశాల్లో బూర్జువా యుద్ధం మామూలు రోజుల్లో అమలుజరిగే బూర్జువా విధానాల కొనసాగింపు; అలాగే బూర్జువా శాంతి యుద్ధకాలంలో అమలు జరిగే బూర్జువా విధానాల కొనసాగింపు; బూర్జువా వర్గం తన ప్రజలమీద పెత్తనం చెలాయించడానికి, యితర దేశాలపై ఆధిపత్యం సంపాదించడానికి యుద్ధం, శాంతి అనే రెండు మార్గాలనూ అవలంబిస్తుంది. శాంతి కాలం అని పిలువబడే దశలో సామ్రాజ్యవాదులు పీడిత ప్రజల్ని, పీడిత జాతుల్నీ అణచి వుంచేందుకు సాయుధ బలంమీద ఆధారపడతారు; అరెస్టులు, జైలుశిక్షలు, చిత్రహింసలు మొదలైన రూపాల్లో బలప్రయోగం జరుపుతారు. అదేసమయంలో వారు స్వదేశంలో ప్రజావిప్లవాన్ని అణచేందుకు, విదేశాల్లో దోపిడీని కొనసాగించేందుకు, విదేశీ పోటీదార్లను అణచేందుకు, యితర దేశాల్లో జరిగే విప్లవాలను కూడ అణచేందుకు అతి తీవ్రరూపమైన బలప్రయోగానికి – అంటే యుద్ధానికి – సన్నాహాలు చేస్తారు. లేదా స్వదేశంలో శాంతి, విదేశాల్లో యుద్ధం కొనసాగవచ్చు.

అక్టోబరు విప్లవంయొక్క ప్రారంభదశలో సామ్రాజ్యవాద ప్రభుత్వాలన్నీ సోవియట్ యూనియన్‌కి వ్యతిరేకంగా యుద్ధ రూపంలో బలప్రయోగానికి దిగాయి. అది సామ్రాజ్యవాద విధానాల కొనసాగింపే. రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మన్ సామ్రాజ్యవాదులు సోవియట్ యూనియన్‌ని కబళించడానికి చాలా పెద్ద యుద్ధానికి–బల ప్రయోగానికి–దిగారు. అది వారి సామ్రాజ్యవాద విధానపు కొనసాగింపు. రెండోవైపు సామ్రాజ్యవాదులు వివిధ దశల్లో సోవియట్ యూనియన్‌తో శాంతియుత సహజీవన సంబంధాలు, రాజకీయ సంబంధాలు ఉంచుకొన్నారు. ఇది కూడా ఆయా పరిస్థితుల్లో సామ్రాజ్యవాద విధానం యొక్క కొనసాగింపే (యింకొక రూపంలో).

ప్రస్తుతం శాంతియుత సహజీవనానికి సంబంధించిన కొన్ని కొత్త సమస్యలు ఉత్పన్నమైన మాట వాస్తవమే. సామ్రాజ్యవాదులు ఈరోజున బలీయమైన సోవియట్ యూనియన్ని, సోషలిస్టు శిబిరాన్ని ఎదుర్కోవలసి వస్తోంది. వాటిమీద దాడిచేసినట్లయితే హిట్లరుచెప్పినట్లు తమ వినాశనాన్ని తాము కొనితెచ్చుకోముగదా అనీ, పెట్టుబడిదారీ విధానమే ప్రమాదస్థితిలో పడవచ్చునని ఒకటికి పదిసార్లు వారు లోతుగా ఆలోచించుకోవలసివస్తుంది.

"శాంతియుత సహజీవనం" అనేది అక్టోబరు విప్లవం అనంతరం సోషలిస్టు దేశాలు అవతరించిన తర్వాత ఉత్పన్నమైన నూతన భావం. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో యిది ఉత్పన్నమవుతుందని లెనిన్ అక్టోబరు విప్లవానికి ముందే తెలియజేశారు. ఆయనిలా వ్రాశారు :

"సోషలిజం అన్ని దేశాల్లో ఒకేసారి విజయం సాధించదు. మొదట అది ఒక దేశంలో, లేదా అనేక దేశాల్లో జయిస్తుంది. మిగతావి కొంతవరకు బూర్జువా దేశాలుగానో, అంతకన్న పూర్వ దశలకు చెందిన దేశాలుగానో ఉంటాయి" ("సెలక్టెడ్ వర్క్స్" మాస్కో కూర్పు. 1952 మొదటి సంపుటి, రెండవ భాగం 571వ పేజీ).

సోవియట్ ప్రజలు, సామ్రాజ్యవాదుల సాయుధజోక్యాన్ని తిప్పి కొట్టిన తర్వాత లెనిన్ యీ నూతన భావాన్ని రూపొందించారు. పైన చెప్పినట్లు మొదట్లో సామ్రాజ్యవాదులు సోవియట్ యూనియన్‌తో శాంతి యుతంగా సహజీవనం నెరపడానికి ఇష్టపడలేదు. సోవియట్ యూనియన్‌కి వ్యతిరేకంగా జరిగిన సాయుధ జోక్యం విఫలమైన తర్వాతనే, ఒండొరుల (ఒక్కొక్కరి)బలాబలాలను పరీక్షించుకోవడంలో చాల సంవత్సరాలు గడచిన తర్వాతనే, సోవియట్ ప్రభుత్వం తన కాళ్ళమీద తాను గట్టిగా నిలబడగలిగిన తర్వాతనే, సోవియట్ యూనియన్‌కు, సామ్రాజ్యనాద దేశాలకూ మధ్య కొంతవరకు సమతూకం ఏర్పడ్డ తర్వాతనే, సామ్రాజ్యవాదులు "సహజీవనాని"కి అంగీక రించవలసి వచ్చింది. లెనిన్ 1920లో యిలా అన్నారు:

"మనం పెట్టుబడిదారీ దేశాల సరసన జీవించగల పరిస్థితుల్ని కల్పించుకోగలిగాం. ఆ దేశాలు మనతో వర్తక సంబంధా లేర్పరచు కోవలసివస్తోంది." (కలెక్టెడ్ వర్క్స్ 4వ రష్యన్ కూర్పు, 31వ సంపుటి, 384వ పేజీ).

కాబట్టి, – ప్రపంచంలోని మొట్టమొదటి సోషలిస్టు రాజ్యానికీ, సామ్రాజ్యవాదానికీ మధ్య కొంతకాలం వరకు కొనసాగిన శాంతియుత సహజీవనం పూర్తిగా పోరాటం ద్వారానే సాధ్యమైందని తెలుసుకోవచ్చు. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు 1920 నుండి 1940 వరకు, అనగా జర్మనీ సోవియట్ యూనియన్ మీద దాడి చేసేవరకు, సామ్రాజ్యవాదానికీ, సోవియట్ యూనియన్‌కీ మధ్య శాంతియుత సహజీవనం కొనసాగింది. ఆ 20 సంవత్సరాల్లో సోవియట్ యూనియన్ శాంతియుత సహ జీవనంపట్ల పూర్తి విశ్వాసంతో వ్యవహరించింది. కాని 1941లో హిట్లరు, సోవియట్ యూనియన్‌తో శాంతియుతంగా సహజీవనం నెరపడానికి ఇష్టపడలేదు. జర్మన్ సామ్రాజ్యవాదులు సోవియట్ యూనియన్ మీద పైశాచిక బుద్ధితో దాడిచేశారు. ఫాసిస్టు వ్యతిరేక యుద్ధంలో సోవియట్' యూనియన్ ప్రధానశక్తిగా పోరాడడంవల్ల విజయం లభించింది. తత్ఫలితంగా ప్రపంచంలో తిరిగి సోషలిస్టు, పెట్టుబడిదారీ దేశాల మధ్య శాంతియుత సహజీవనం కొనసాగింది. అయినప్పటికీ సామ్రాజ్యవాదులు తమ ప్లానులను వదులుకోలేదు. అమెరికన్ సామ్రాజ్యవాదులు సోవియట్ యూనియన్ చుట్టూ, మొత్తం సోషలిస్టు శిబిరం చుట్టూ సైనిక స్థావరాలను, రాకెట్ స్థావరాలను నిర్మించారు. చైనాలో భాగమైన తైవాన్‌ను వారిప్పటికీ ఆక్రమించుకొనేయున్నారు. తైవాన్ జలసంధిలో వారు మనమీద సైనికచర్యలు జరుపుతున్నారు. కొరియాలో సాయుధ జోక్యం చేసుకొని కొరియన్ ప్రజలమీద, చైనా ప్రజలమీద వారు పెద్ద యెత్తున యుద్ధం సాగించారు; కానీ పరాజయం పొందిన తర్వాతనే యుద్ధ విరమణకు అంగీకరించారు. ఇప్పటికీ వారు కొరియా ప్రజల ఐక్యతను ఆటంకపరుస్తున్నారు. ఫ్రెంచి సామ్రాజ్యవాదులు వియత్నాం ప్రజలపై యుద్ధం సాగిస్తున్నప్పుడు వారికి ఆయుధాలు సప్లయి చేశారు. ఇప్పటికీ వారు వియత్నాం ప్రజల ఐక్యతకు ఆటంకం కలిగిస్తూనేఉన్నారు. హంగరీలో విప్లవ విద్రోహ తిరుగుబాటుకు వారు ప్రోత్సాహమిచ్చారు. తూర్పు యూరపు, తదితర సోషలిస్టు దేశాల్లో అనేకవిధాలైన విచ్ఛిన్న చర్యలను ఎడతెగకుండా ప్రోత్సహిస్తున్నారు. లెనిన్ 1920లో ఒక అమెరికా విలేకరితో మాట్లాడుతూ వర్ణించిన పరిస్థితులవంటివే యీనాడు కూడా ఉన్నాయి. శాంతి సమస్యను గురించి ఆయనిలా అన్నారు:

"మా పక్షాన ఆటంకమేమీ ఉండదు. ఆటంకమల్లా అమెరికన్, తదితర పెట్టుబడిదారుల సామ్రాజ్యవాదం తప్ప మరొకటి కాదు." (కలెక్టెడ్ వర్క్స్–4వ రష్యన్ కూర్పు:33వ సంపుటి, 340వ పేజీ). సోషలిస్టు దేశాల విదేశాంగ విధానం శాంతి విధానంగా మాత్రమే ఉండగలదు. మనకు యుద్ధమవసరంలేదనీ, యుద్ధాన్ని మన మెన్నటికీ ప్రారంభించమనీ, సోషలిస్టు వ్యవస్థ నిర్ధారణ చేసివేసింది. పొరుగుదేశం యొక్క భూభాగంలో ఒక్క అంగుళం మేరకూడా మనం ఆక్రమించుకో కూడదనీ, ఆక్రమించుకోజాలమనీ సోషలిస్టు వ్యవస్థ నిర్ణయం చేసింది. చైనా ప్రజారిపబ్లిక్ స్థాపింపబడినప్పటి నుంచీ మనం శాంతి విధానానికే కట్టుబడియున్నాం. మన దేశం తన పొరుగునున్న ఇండియా, బర్మా దేశాలతో కలిసి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పంచశీలను రూపొందించింది. 1955లో జరిగిన బాండుంగ్ సమావేశంలో అనేక ఆసియా, ఆఫ్రికా దేశాలతో కలిసి శాంతియుత సహజీవనానికి సంబంధించిన పదిసూత్రాలను ఆమోదించింది. గత కొద్ది సంవత్సరాలో కమ్యూనిస్టు పార్టీ, మనదేశ ప్రభుత్వం, సోవియట్ కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీ కృశ్చేవ్ నాయకత్వాన సోవియట్ ప్రభుత్వం శాంతిని రక్షించడానికి తీసుకొన్న చర్యలన్నిటినీ బలపరుస్తూ వచ్చాయి. సోవియట్ కమ్యూనిస్టు పార్టీ, సోవియట్ ప్రభుత్వం తీసుకున్న యీ చర్యలు, సోషలిస్టు దేశాల శాంతి విధానాన్ని మరింత చక్కగా ప్రపంచానికి రుజువుచేశాయి, అంతేగాక, సామ్రాజ్యవాదులు మరో ప్రపంచ యుద్ధాన్ని ప్రారంభించకుండా నిరోధించవలసిన అవసరాన్ని, శాంతిని కాపాడేందుకు ప్రయత్నించవలసిన అవసరాన్ని ఆ చర్యలు నిరూపించాయి.

1957లో జరిగిన మాస్కో సమావేశం యిలా ప్రకటించింది : "ఆధునిక యుగంలో బలీయమైన శక్తులు శాంతికోసం కృషి చేస్తున్నాయి. అవి : సోవియట్ యూనియన్ నాయకత్వాన సోషలిస్టు దేశాలు; శాంతిని కోరుతూ సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరి నవలంబిస్తూ, సోషలిస్టు దేశాలతో కలిసి విస్తృతమైన శాంతిమండలాన్ని ఏర్పరచిన ఆసియా, ఆఫ్రికా దేశాలు; ప్రపంచ కార్మికవర్గం, ఆ వర్గం యొక్క అగ్రగామిదళమైన కమ్యూనిస్టు పార్టీలు; వలస – అర్ధవలస దేశాల్లోని జాతీయ విముక్తి ఉద్యమాలు; ప్రపంచ ప్రజల శాంతి ఉద్యమం; తటస్థ విధానాన్ని చేబట్టిన యూరోపియన్ దేశాలు; లాటిన్ అమెరికా దేశాలు; సామ్రాజ్యవాద దేశాల్లో జరిగే యుద్ధసన్నాహాలను దృఢంగా వ్యతిరేకిస్తున్న ప్రజాసామాన్యం. ఈ బ్రహ్మాండమైన శక్తులు గట్టిగా పనిచేసినట్లయితే యుద్ధాన్ని తప్పక నివారించవచ్చు." ఈ బలీయమైన శక్తులు ఎడతెగకుండా అభివృద్ధి చెందేటంత కాలం శాంతియుత సహజీవనం కొనసాగడం సాధ్యమే. అంతేకాదు. శాంతియుత సహజీవనంపై ఒక విధమైన ఒప్పందంకూడ అధికారయుతంగా కుదిరితే కుదరవచ్చు. లేదా అణ్వాయుధాల నిషేధంపై ఒడంబడిక జరిగినా జరగవచ్చు. అట్టి పరిస్థితి ఎంతో మంచిది; ప్రపంచ ప్రజల అభీష్టాలకది పూర్తిగా అనుగుణ్య మైనది. అయినప్పటికీ, అలాంటి పరిస్థితి ఏర్పడినప్పటికీ, సామ్రాజ్యవాద వ్యవస్థ ఉన్నంత కాలం బల ప్రయోగం యొక్క అతి తీవ్ర రూపమైన యుద్ధం యిక రాదని చెప్పలేం. "యుద్ధం రాజకీయవిధానాల కొనసాగింపు" అని లెనిన్ నిర్వచించారు. ఆ నిర్వచనాన్ని ఆయన పదేపదే వివరించారు. అవకాశవాదాన్ని ఎదుర్కొనేందుకు దాన్ని గట్టిగా సమర్థించారు. కానీ ఆ నిర్వచనం యీనాడు వర్తించదని చెబుతున్న యుగోస్లావ్ రివిజనిస్టుల వాదనలు వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ఉన్నాయి.

లెనిన్ అవగాహన పూర్తిగా సరియైనదే. యుద్ధమనేది దోపిడీ విధానాల ఫలితం. ఆధునిక యుద్ధాలకు మూలం సామ్రాజ్యవాదం, సామ్రాజ్యవాద వ్యవస్థ, దోపిడీ వర్గాలు అంతంకానంత కాలం ఏదో ఒక విధమైన యుద్ధం వస్తూనే ఉంటుంది. కొన్ని యుద్ధాలు సామ్రాజ్యవాదుల మధ్య ప్రపంచాన్ని తిరిగి పంచుకొనేందుకు జరుగుతాయి. మరికొన్ని సామ్రాజ్యవాదులకూ పీడిత జాతులకూ మధ్య దురాక్రమణ యుద్ధాలుగానో, దురాక్రమణను ప్రతిఘటించే యుద్ధాలుగానో ఉంటాయి. ఇంకా కొన్ని యుద్ధాలు సామ్రాజ్యవాద దేశాల్లో పీడింప బడేవర్గాలకూ పీడించే వర్గాలకూ మధ్య విప్లవ అంతర్యుద్ధాలుగానో, విప్లవ విద్రోహ అంతర్యుద్ధాలుగానో ఉంటాయి. సోషలిస్టు దేశాలపై సామ్రాజ్యవాదులు దాడి చేసేటప్పుడు జరిగే యుద్ధాలూ, సోషలిస్టు దేశాలు ఆత్మరక్షణకై జరిపే యుద్ధాలూ కూడ ఉంటాయి. ఈ అన్ని తరహాల యుద్ధాలూ కొన్ని వర్గాల పాలసీలను ద్యోతకం చేస్తాయి. మార్క్సిస్టులు – లెనినిస్టులు శుష్క శాంతివాదపు ఊబిలో దిగబడక, నిర్దిష్టమైన వర్గ పరిశీలన ద్వారానే ఒక్కొక్క యుద్ధం యొక్క స్వభావాన్ని అంచనా కట్టి, తద్వారా శ్రామికవర్గ పాలసీకి అనుగుణమైన నిర్ధారణలు చేయగల్గుతారు. లెనిన్ యీవిధంగా చెప్పారు:

"యుద్ధమనేది యితర మార్గాల్లో కొనసాగే రాజకీయ విధానమేనను సిద్ధాంతాన్ని మనమెన్నటికీ మరచిపోకూడదు." (సెలక్టెడ్ వర్క్స్ : మాస్కో 1952: మొదటి సంపుటి, 2వ భాగం, 572వ పేజీ).

## సంస్మరించుకుందాం

**2024 మార్చి 23**
**కా॥ కానూసన్యాల్**
**14వ వర్ధంతి**

# నగ్జల్బరీ రైతాంగ ఉద్యమ నిర్మాత కామ్రేడ్ కానూసన్యాల్‌కు అరుణారుణ జోహార్లు



**2010** మార్చి 23న మరణించిన భారత విప్లవోద్యమ విశిష్ట నాయకుడూ, నగ్జల్బరీ ఉద్యమనిర్మాత, సిపిఐ(ఎం-ఎల్) మాజీ ప్రధాన కార్యదర్శి, కామ్రేడ్ కానూసన్యాల్ 81 సం॥ల తన జీవితంలో ఆరు దశాబ్దాలపైగా కాలాన్ని క్రియాశీల ప్రజాఉద్యమ రాజకీయాలకే అంకితం చేశారు. 1948లో తొలిసారి అరెస్టు అయిన మొదలు, ఉద్యమ జీవితంలో ఆయన 14 సం॥ల కాలం జైలుజీవితం, మరెన్నో సం॥ల కాలం రహస్యజీవితం గడిపారు. 1967 నాటి నగ్జల్బరీ రైతాంగ తిరుగుబాటుకు తన సహచరులతోకూడి నిబద్ధతతో, నిలకడగా కా॥కానూసన్యాల్ నిర్మాణకృషి సాగించారు. కమ్యూనిస్టు ఉద్యమంలో తలెత్తిన మిత, అతివాదాలను తిరస్కరిస్తూ ఆ ప్రాంతంలోని భూస్వాములకు వ్యతిరేకంగా భూమిహీనులను, పేద రైతాంగాన్ని సంఘటితపరచి మెట్టుమెట్టుగా అభివృద్ధిచేస్తూ నిర్మించిన పోరాటమే నగ్జల్బరీ రైతాంగపోరాటం.

1970ల నాటికి నగ్జల్బరీ, శ్రీకాకుళ గిరిజనోద్యమాలు ప్రభుత్వాల క్రూరనిర్బంధాలకు గురయ్యాయి. ఎందరో విప్లవ నాయకులను, రైతాంగ, గిరిజనోద్యమ ముద్దుబిడ్డలను పోలీసులు కాల్చిచంపారు. ఈ ఉద్యమాల నాయకత్వంలో తలెత్తి పైచేయి సాధించిన అతివాదం రెండు గొప్ప ప్రజాఉద్యమాలను నిలదొక్కుకోనీయలేదు. ఉద్యమాలు వెనకపట్టుపట్టినా, సుదీర్ఘకాలం జైలుజీవితం గడపవలసి వచ్చినా కామ్రేడ్ కానూసన్యాల్‌లో విప్లవచేవ ఇసుమంతైనా సడలలేదు. జైలుజీవిత కాలంలోనే మితవాద, అతివాదాలకు వ్యతిరేకంగా ఆయన ప్రారంభించిన సిద్ధాంత, రాజకీయ పోరాటాన్ని, జైలు నుండి విడుదలైన పిదప మరింత పట్టుదలగా కొనసాగించారు. విప్లవకారుల ఐక్యతకోసం తపించారు; సూత్రబద్ధ కృషి సాగించారు. 2005లో వివిధ విప్లవసంస్థలు ఐక్యమై సిపిఐ(ఎం-ఎల్)గా ఏర్పడటం ఆయనకు నూతనోత్సాహాన్ని ఇచ్చింది. కామ్రేడ్ కానూసన్యాల్ నాయకత్వంలో రూపొందించబడిన ఐక్యతా విధానాన్ని చేబూని సిద్ధాంత, రాజకీయ, ఉద్యమ నిర్మాణరంగాల్లో సిపిఐ(ఎం-ఎల్) కృషిసాగిస్తోంది. కామ్రేడ్ కానూసన్యాల్ అందించిన విశిష్ట విప్లవ వారసత్వాన్ని కొనసాగించటానికి పార్టీ, ఉద్యమ కార్యకర్తలంతా పూనిక వహించటమే ఆయనకు అర్పించే అసలైన నివాళి. ✸

---

➡ సామ్రాజ్యవాదులు ఎల్లప్పుడూ దోపిడీ, పీడన అనే తమ ఆశయాన్ని సాధించుకొనేందుకు రెండు ఎత్తుగడలు అవలంబిస్తారు: ఒకటి యుద్ధం; రెండు "శాంతి." అందుచేత శ్రామిక వర్గం, అన్ని దేశాల ప్రజలు సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొనేందుకు రెండు ఎత్తుగడలు అవలంబించాల్సి యుంటుంది: ఒకటి, సామ్రాజ్యవాదుల బూటకపు శాంతిని పూర్తిగా బహిర్గతం చేస్తూ నిజమైన ప్రపంచశాంతికై శక్తివంతంగా కృషి చేయడం - రెండు, సామ్రాజ్యవాదులు అధర్మ యుద్ధాన్ని తీసుకొచ్చినప్పుడు దాన్ని అంత మొనర్చేటందుకై ధర్మయుద్ధానికి తయారు కావడం.

క్లుప్తంగా చెప్పాలంటే, ప్రపంచ ప్రజల శ్రేయస్సుకై మనం ఆధునిక రివిజనిస్టుల అసత్యాలను పూర్తిగా తుత్తునియలు చేసి, యుద్ధం, బల ప్రయోగం, శాంతియుత సహజీవనమనే సమస్యలపై మార్క్సిస్టు- లెనినిస్టు దృక్పథాన్ని బలపరచవలసి యుంటుంది.

యుగోస్లావ్ రివిజనిస్టులు బలప్రయోగం యొక్క వర్గస్వభావాన్ని నిరాకరిస్తారు. ఆ విధంగా విప్లవశీల బలప్రయోగానికీ, విప్లవ వ్యతిరేక బలప్రయోగానికీ గల మౌలికభేదాన్ని విస్మరిస్తారు. యుద్ధం యొక్క వర్గస్వభావాన్ని వారు తిరస్కరిస్తారు. ఆ విధంగా ధర్మయుద్ధానికి అధర్మయుద్ధానికీగల మౌలికభేదాన్ని గుర్తించరు. సామ్రాజ్యవాద యుద్ధం సామ్రాజ్యవాద విధానాల కొనసాగింపు అనే విషయాన్ని వారంగీకరించరు. సామ్రాజ్యవాదులు మరో పెద్ద యుద్ధాన్ని తీసుకు వచ్చే ప్రమాదమున్నదని గ్రహించరు; దోపిడీ వర్గాలు నిర్మూలింపబడిన తర్వాతనే యుద్ధాలను నివారించడం సాధ్యమని భావించరు; పైగా సామ్రాజ్యవాద నాయకుడు ఐసెన్ హోవర్ "ప్రచ్ఛన్న యుద్ధాన్ని నిర్మూలించి విభిన్న రాజకీయ వ్యవస్థల మధ్య శాంతియుత సహకారంద్వారా సుస్థిరశాంతిని స్థాపించడంలో పునాదిరాయి వేసిన వ్యక్తి" అని కొనియాడతారు. (1959 డిసెంబరు 1వ తేదీ 'బోర్బా' పత్రికలో 'రోమ్‌కు ఐసెన్ హోవర్ రాక' అను శీర్షికతో ప్రచురించబడిన వ్యాసం). శాంతియుత సహ జీవనములో సైతం రాజకీయ, ఆర్థిక, సిద్ధాంత తదితర పోరాటాలు సంక్లిష్టమైనవీ, తీవ్రమైనవీ జరుగుతూనే ఉంటాయను విషయాన్ని వారంగీకరించరు. యుగోస్లావ్ రివిజనిస్టులు చేసే యీ వాదనలన్నిటి ఉద్దేశం అన్ని దేశాల్లోని శ్రామికుల, ప్రజల మనస్సుల్ని విషపూరితం చేయడం. అందుచేత అవి సామ్రాజ్యవాదుల యుద్ధవిధానానికి చక్కగా తోడ్పడతాయి.

**(తరువాయి భాగాలు వచ్చే సంచికలలో)** ✸





**మతోన్మాదం - సామ్రాజ్యవాదం - భారత పాలకులు**

(వ్యాస సంకలనం)

**పేజీలు : 80** **వెల : రు. 30/-**

కాపీలకు :

**మైత్రీబుక్‌హౌస్**
**జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్,**
**విజయవాడ-2**

# మెజారిటీ ప్రజల జీవన సంక్షోభాన్ని తీవ్రతరం చేసే దిశగా మధ్యంతర కేంద్ర బడ్జెటు 2024-25

ప్రొ॥ తోట జ్యోతీరాణి

**పార్లమెంటు** ఎన్నికలు త్వరలో వుండటం వల్ల 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మధ్యంతర కేంద్ర బడ్జెటును ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1, 2024న పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం దేశంలో వున్న ఆర్థిక నేపథ్యం ఏమిటి? 2019 నాటికే బలపడిన ఆర్థిక మాంద్యం కొనసాగుతూనే వున్నది. నిరుద్యోగ సమస్య తీవ్రమవుతూనే వున్నది. నిత్యావసర వస్తువుల ధరలు, అందులో భాగంగా డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అమ్ముడుపోని వస్తువుల నిల్వలు గోడౌన్లలో పెరుగుతూనే వున్నాయి. ప్రభుత్వ విద్య, ప్రజారోగ్యం పతనమవుతున్నాయి. వీటితోపాటు ప్రజారవాణా కూడా ప్రజలకు అందుబాటులోకి రావడం లేదు. కోవిడ్ విపత్తు బయటపెట్టిన మెజారిటీ ప్రజల దుర్భర జీవితాలు మరింత హీనమవుతున్నాయి. మరొకవైపు ఆర్థిక అసమానతలు అనూహ్యమైన స్థాయికి పెరుగుతున్నాయి. సంక్షుభిత జీవితాలే మెజారిటీ ప్రజలకు సాధారణమైనాయి. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్' మంత్రంతో సమ్మిళిత వృద్ధిని సాధించగలిగామని బడ్జెటు ప్రసంగం చెప్పటం అసంబద్ధం. తీవ్రమవుతున్న వ్యవసాయ సంక్షోభం, కొనసాగుతున్న రైతుల ఆత్మహత్యలు, పెరుగుతున్న గ్రామీణ దుర్భరత్వం, పెరుగుతున్న వలసలు, అనియత రంగంలో క్యాజువల్ లేబర్‌గా, స్వతంత్ర భాగస్వాముల పేరిట గిగ్ వ్యవస్థలో తీవ్రమైన శ్రమ దోపిడీకి గురవుతున్న శ్రామిక వర్గం, వీటితోపాటు లైంగిక దోపిడీకి గురవుతున్న మహిళలు వున్న సందర్భంలో ఈ అంశాలను ప్రస్తావించకుండా ఆర్థిక సంస్కరణలతో పాటు ప్రజానుకూల విధానాలతో కొత్త ఉద్యోగ, వ్యవస్థాపక అవకాశాలను ఆకాశమే హద్దుగా కల్పించామని బడ్జెటు ప్రసంగం చెబుతున్నది. ఆకాశమే హద్దుగా, ప్రభుత్వం సృష్టించిన అవకాశాలు ఎవరికి లభించాయి అన్నది ప్రశ్న. ప్రజల వాస్తవ జీవన సంక్షోభాన్ని బడ్జెట్ అసలే గుర్తించటం లేదు. ఇది దేశ ప్రజలను మభ్యపెట్టాలని చూడటమే. 'సబ్ కా ప్రయాస్'తో కోవిడ్ విపత్తు సంక్షోభాన్ని అధిగమించి, శీఘ్రంగా కోలుకున్నామని బడ్జెట్ ప్రసంగం అంటున్నది. కానీ మెజారిటీ ప్రజల జీవన సంక్షోభాన్ని అవకాశాలుగా మలుచుకున్న బలమైన కార్పొరేట్ శక్తుల, సంపన్నుల సంపద ఇబ్బడి ముబ్బడిగా పెరిగిందని గణాంకాలు రుజువు చేస్తున్నాయి. ఈ వర్గం, అతి స్వల్పకాలంలోనే కోలుకున్నది. కాగా, కోవిడ్ పూర్వ సంక్షోభ పరిస్థితికి కూడా మెజారిటీ ప్రజలు చేరుకోలేదు. ఇంకా 'సబ్ కా ప్రయాస్' లోనే బతుకుతున్నారు. శీఘ్రంగా వృద్ధి చెందుతున్నట్లు అనిపిస్తున్న మన ఆర్థిక వ్యవస్థలో గుత్త పెట్టుబడుల సంపద మాత్రమే అపారంగా వృద్ధి చెందుతున్నది. కాగా మెజారిటీ ప్రజల బ్రతుకు దుర్భరమే. ఈ పరిస్థితులనే బలంగా కొనసాగించడం వల్ల 2027 నాటికి మన స్థూల దేశీయోత్పత్తి 5 ట్రిలియన్ డాలర్ల (షుమారు 400లక్షల కోట్ల రూపాయలు) విలువలకు చేరుకుంటుంది. ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపొందుతుంది. 2047 నాటికి 'వికసిత భారత్'గా అభివృద్ధి చెందిన దేశం అవుతుంది. అందుకే 'ఫస్ట్ డెవలప్ ఇండియా'ను బలమైన నినాదంగా బడ్జెట్ ముందుకు తెస్తున్నదని పాలకులు ప్రకటిస్తున్నారు. ఇది దుర్మార్గమైన, క్రూరమైన వైరుధ్యమే.

ఒకవైపు, గత పది సంవత్సరాల కాలంలో ఆర్థిక సంస్కరణలు, ప్రజానుకూల విధానాల వల్ల సమ్మిళితవృద్ధిని సాధించామని బడ్జెట్ చెబుతున్నది. మరొకవైపు ప్రస్తుత మధ్యంతర బడ్జెటులో పేదవాళ్లు, మహిళలు, యువత, రైతుల సాధికారతను సాధించటమే లక్ష్యం అని చెబుతోంది. సాధించిన సమ్మిళిత వృద్ధిలో ఈ మెజారిటీ ప్రజలు భాగం కాలేదని ప్రభుత్వమే చెబుతున్నది. అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నది. వాస్తవానికి ప్రస్తుతం మనదేశంలో ఆర్థిక మాంద్యం బలపడి కొనసాగుతున్నది. ఉపాధి కల్పన ఋణాత్మకం అయింది. నిరుద్యోగ సంక్షోభం తీవ్రమైంది. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. అమ్ముడుపోని నిల్వలు గోడౌన్లలో పెరిగిపోతున్నాయి. సార్థక డిమాండ్ (Effective Demand)లో సంక్షోభం స్పష్టంగా కనిపిస్తున్నది. ఇటువంటి స్థితిలో సరఫరా గొలుసును ప్రోత్సహించే చర్యలు అదేవిధంగా కొనసాగించినట్లయితే ఆర్థిక అసమానతల పెరుగుదల ఇంకా తీవ్రం అవుతుందని వర్తమాన చరిత్ర రుజువు చేస్తూనే వున్నది. సార్థక డిమాండుని పెంచడానికి చర్యలు తీసుకోవాలి. అందుకు ప్రజలకు సంపాదన పెరగాలి. గౌరవప్రదమైన ఉపాధుల కల్పన ముమ్మరం కావాలి. ఈ దిశగా మధ్యంతర బడ్జెట్ ప్రతిపాదనలు ఏమిటి? చర్చించాలి.

**మధ్యంతర కేంద్ర బడ్జెటు 2024-25:**

2023-24 కేంద్ర బడ్జెటు సవరించిన అంచనాల ప్రకారం మొత్తం ప్రభుత్వ రాబడి 27.56 లక్షల కోట్ల రూ.లు. ఇందులో పన్ను రాబడి 23.24 లక్షల కోట్ల రూ.లు. కాగా, మొత్తం ప్రభుత్వ వ్యయం 44.90 లక్షల కోట్ల రూ.లు. సవరించిన అంచనాల ప్రకారం స్థూల దేశీయోత్పత్తిలో కోశ లోటు 5.8 శాతం. 2024-25 బడ్జెటు అంచనాల ప్రకారం రుణాలు మినహా ప్రభుత్వ రాబడి 30.80 లక్షల కోట్ల రూ.లు. ఇందులో పన్ను రాబడి 26.02 లక్షల కోట్ల రూ.లు. ప్రభుత్వ వ్యయం 47.66 లక్షల కోట్ల రూపాయలు. స్థూల దేశీయోత్పత్తిలో కోశ లోటు 5.1 శాతం. 2021-22లో ప్రకటించినట్లుగా, 2025-26 ఆర్థిక సంవత్సరం నాటికి స్థూల దేశీయోత్పత్తిలో కోశ లోటు 4.5 శాతాని కంటే తక్కువగా వుంటుందని చెబుతున్నారు.

బడ్జెట్ ఫోకస్ అంతా కోశ లోటును తగ్గించటం మీదనే. ఉద్యోగితను పెంచడం, ధరలను తగ్గించడం, ప్రపంచ ఆర్థిక సంస్థల నిర్దేశిత నయా ఉదారవాద బడ్జెట్ విధాన చట్రంలో లేనే లేవు. నిజానికి ఆర్థిక మాంద్యం నుండి బయటపడటానికి కోశ విధానం ఒక బలమైన సాధనం. లాభాపేక్ష లేని ప్రభుత్వ వ్యయాన్ని పెంచటం ద్వారా సమిష్టి డిమాండ్‌ను పెంచడానికి వీలుంటుంది. ఆర్థిక వాస్తవాలతో పూర్తిగా సంబంధం లేకుండా రాజకీయ ఫలితాలు వుంటున్నాయి. అయోధ్య రాముని మీద భరోసాతో ఉద్యోగ కల్పన, ధరల పెరుగుదలను అరికట్టడం అవసరం లేని విషయాలైనాయి. దానితో కోశ విధానం ప్రాధాన్యత లేని అంశం అయింది అని సంజయ్ బారు తన ఖచ్చితమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మెజారిటీ ప్రజల జీవితాలను దుర్భరం చేస్తున్న నిరుద్యోగ సంక్షోభం, ధరల పెరుగుదల తీవ్రత వల్ల నష్టపోయేది ఎవరు? జనాభాలో

అత్యధిక శాతం వున్న హిందువులే కదా! బిజెపి పాలిత రాష్ట్రాలైన హర్యానా, ఉత్తర ప్రదేశ్ నుండి హిందూ యువత ఇజ్రాయిల్‌లో భవన నిర్మాణ కార్మికులుగా వెళ్ళటానికి క్యూ కడుతున్నారు.

ఇజ్రాయిల్‌లోని భవన నిర్మాణ రంగంలో పనిచేయటానికి పాలస్తీనా ముస్లింలను, మొత్తంగా ముస్లిం కార్మికులను ఇజ్రాయిల్ ప్రభుత్వం నిషేధించింది. అయితే యుద్ధం, దాడుల మధ్య పని చేయటానికి హిందూ యువకులు ఎందుకు వెళ్తున్నారు? వారి సమాధానం ఏమిటంటే మన దేశంలోనే వుంటే ఆకలితో చావాలి, ఇజ్రాయిల్‌కు వెళ్తే యుద్ధం వల్ల చావాలి. యువకులు బతకటానికి ఏ ప్రత్యామ్నాయం లేదు. ఇది సమ్మిళిత వృద్ధికి చిహ్నమా?

## పన్ను విధానం – వస్తు సేవల పన్ను :

మనదేశంలో వస్తు సేవల పన్ను (GST) ప్రధానమైన పరోక్ష పన్ను. తమపైన పన్నుల భారం పడుతుందని ప్రజలు గమనించలేని పన్నుల రూపం. అల్పాదాయ వర్గాల మీద ఈ పన్ను భారం అధికంగా వుంటుంది. సంపన్న వర్గాల మీద స్వల్ప భారం వుంటుంది. కాబట్టి దీనిని తిరోగామి పన్ను అంటారు. సామాన్య ప్రజలు ఉపయోగించే వస్తువుల మీద ఈ వస్తు సేవల పన్ను రేటు తక్కువగా వుండాలి. అంతమేరకు ఈ వర్గాల కొనుగోలు శక్తి పెరుగుతుంది. లేదా ధరల భారం తగ్గుతుంది. సంపన్న వర్గాలు ఉపయోగించే వస్తువుల మీద ఈ పన్ను రేటు అధికంగా వుండాలి. కానీ ఇందుకు విరుద్ధంగా పేద ప్రజలు, మధ్యతరగతి వర్గం తప్పనిసరిగా ఉపయోగించే 480 వస్తువుల మీద 18 శాతం పన్ను రేటును విధిస్తున్నారు. వస్తు సేవల పన్ను వసూళ్లలో దీని వాటా 70 శాతం. ఈ పన్ను అత్యధిక భారం పేద, మధ్యతరగతి వర్గాల మీదనే పడుతున్నది. కాగా, కేవలం సంపన్న వర్గాలు మాత్రమే వినియోగించే బంగారు, వజ్రాల ఆభరణాల మీద 3 శాతం, మేకింగ్ ఛార్జీల మీద 5 శాతం వస్తుసేవల పన్నును విధిస్తున్నారు. ఇంకా సామాన్య జనం కొనుక్కునే పచ్చళ్ళు, విద్యార్థులకు కావలసిన నోటు పుస్తకాలు మొదలగు వాటి మీద 12 శాతం విధిస్తున్నారు. వస్తు సేవల పన్ను వసూళ్లు పెరుగుతున్నాయంటున్నారు. సగటున నెలవారీ వస్తు సేవల పన్ను వసూళ్లు రెండు రెట్లు పెరిగి, ప్రస్తుత సంవత్సరం 1.66 లక్షల కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. దీనివల్ల ధరలు తగ్గాయని, వినియోగదారులకు ప్రయోజనం చేకూరిందని బడ్జెట్ ప్రసంగం చెప్పటం విడ్డూరమే.

ఇటీవల ఆక్స్ ఫాం విడుదల చేసిన 'Survival of the Richest : The India Story' ప్రకారం పరోక్ష పన్నులు లేదా వినియోగానికి సంబంధించిన పన్నులలో 64.3 శాతం, అట్టడుగు 50 శాతం పేద ప్రజల నుండి వసూలవుతున్నది. మధ్య 40 శాతం మంది ప్రజల నుండి మూడవ వంతు వస్తు సేవల పన్ను వసూలవుతున్నది. 10 శాతం సంపన్న వర్గం ఈ పన్ను వసూళ్లలో చెల్లించేది కేవలం 3–4 శాతం మాత్రమే. ఈ భారమంతా పేద, మధ్యతరగతి ప్రజల మీదనే అన్నది స్పష్టం. అంతేకాకుండా, ఈ పన్ను భారంలో పరిశ్రమలకు, వాణిజ్య సంస్థలకు ఏ వాటా వుండదు. పన్ను భారం మొత్తం వినియోగదారుని మీదనే.

ప్రస్తుత బడ్జెటు 2024–25లో వస్తు సేవల పన్నులో ఎటువంటి మార్పులు లేవు. పేదలకు, మధ్యతరగతి వర్గానికి ఏ రాయితీలు లేవు. మెజారిటీ ప్రజల జీవన సంక్షోభం ఇంకా బలంగా కొనసాగుతుందన్నమాట. పెద్ద నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (GST), ఆ తర్వాత కోవిడ్ విపత్తు సంక్షోభం వల్ల చిన్న వ్యాపారాలు, అనియత రంగంలో తయారీ సంస్థలు, MSME సంస్థలు సమస్యలతో మూతపడ్డాయి. ఎంతో మంది ఉపాధులను కోల్పోయారు. ప్రస్తుత బడ్జెట్లో వస్తుసేవల పన్నులో ఎటువంటి మార్పు లేదనటం, పేద వర్గపు జీవితాలలో సంక్షోభం కొనసాగుతుందన్నమాట. ఈ బడ్జెట్లో ప్రకటించిన పేద వర్గ సాధికారత లక్ష్యం మాటేమిటి?

## ప్రత్యక్ష పన్నులు:

### 1. ఆదాయ పన్ను:

ఇందులో మధ్యతరగతి వర్గమే ప్రధానంగా ఆదాయపన్నును చెల్లిస్తుంది. 10 సంవత్సరాలలో ఆదాయ పన్ను రిటర్న్ దాఖలు చేసే వారి సంఖ్య 2.4 రెట్లు, పన్ను వసూళ్లు 3 రెట్లు పెరిగాయని చెబుతున్నారు. అత్యధిక వస్తు సేవల పన్నులు ఒకవైపు, ఆదాయ పన్ను మరొకవైపు మధ్య తరగతి వర్గ కొనుగోలు శక్తిని సీరియస్‌గా తగ్గిస్తుంది. ప్రభుత్వ పన్ను రాబడిలో అధిక భాగం పేద, మధ్యతరగతి వర్గాల నుండి సమకూరుతున్నది.

### 2. ఊహాత్మక పన్ను (Presumptive tax) :

సూక్ష్మ సంస్థలకు, చిన్న వ్యాపారాలకు ఈ పన్ను నుండి మినహాయింపు పరిమితిని, వార్షిక ఆదాయం 2 కోట్ల రూపాయల నుండి 3 కోట్ల రూపాయలకు, ప్రొఫెషనల్స్‌కి ఆదాయం 50 లక్షల రూ.ల నుండి 75 లక్షల రూ.లకు గత సంవత్సరం పెంచారు. ఇది ప్రస్తుతం కొనసాగుతుంది. దీనివల్ల అధిక ఆదాయాలు వస్తున్న సంస్థలకు, ప్రొఫెషనల్స్‌కి పన్ను మినహాయింపు లభిస్తుంది.

### 3. కార్పొరేటు పన్ను :

వాణిజ్య సౌలభ్యం కోసం, ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడం కోసం, సరఫరా గొలుసును ప్రోత్సహించడం కోసం అనే పేరుతో కార్పొరేటు పన్నును సెప్టెంబర్ 2019లో 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించారు. కొత్త తయారీ కంపెనీలకు ఈ పన్ను 15 శాతమే. 2024–25 ఆర్థిక సంవత్సరంలో కూడా ఈ తగ్గుదల కొనసాగుతుంది. అందువల్ల 2020–21 ఆర్థిక సంవత్సరంలోనే లక్ష కోట్ల రూపాయలకు పైగా పన్ను రాబడిని ప్రభుత్వం కోల్పోయింది. ఇది ఇదే విధంగా కొనసాగుతుంది.

IFSC సంస్థలకు, అంకుర పరిశ్రమలకు ఇస్తున్న ఆదాయపన్ను రాయితీలు మార్చి 31, 2024తో ముగుస్తాయి. కాబట్టి వాటిని ఈ బడ్జెట్లో మార్చి 31, 2025 వరకు పొడిగించారు. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విధానం ద్వారా ఆర్థిక మాంద్యాన్ని నియంత్రణ చేసే ప్రతిపాదనలు ఏవీ లేవు. పన్ను రాయితీలు, మేక్ ఇన్ ఇండియా పథకం, ప్రొడక్షన్ లింక్డ్ ఇన్వెస్టిమెంట్ పథకం మొదలగునవన్నీ ప్రైవేటు దేశీయ పెట్టుబడులను పెంచడంలో, తయారీ రంగానికి మళ్ళించడంలో, ఉద్యోగాల కల్పనలో విఫలమైనాయి. ప్రస్తుత ఆర్థిక సమస్యకు, సమిష్టి డిమాండ్‌ను పెంచడానికి చర్యలు అవసరం. ఆ దిశగా ఈ పన్ను విధానంలో చర్యలు లేవు. బ్యాంకుల నుండి ప్రభుత్వం తీసుకునే రుణాలను తగ్గించుకుంటున్నది. ఆ నిధులు ప్రైవేటు పెట్టుబడులకు సమకూరాలని భావిస్తున్నది. కానీ బ్యాంకులలో ద్రవ్యత్వ సమస్య లేనేలేదు. ప్రభుత్వ పెట్టుబడులు ఉండవు, ప్రైవేటు పెట్టుబడులు పెరగవు. ఉద్యోగ కల్పన జరగదు. అంటే రిస్క్ తీసుకోకుండా ఉన్నందుకు గుత్త పెట్టుబడులకు పన్ను రాయితీలను ఇస్తున్నారు.

ప్రత్యక్ష పన్నుల చెల్లింపులలో చిన్నచిన్న వివాదాలలో చిక్కుకున్న 1 కోటి మంది నిజాయితీ గల పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం కలిగించాలన్న లక్ష్యంతో ప్రస్తుత బడ్జెట్ లో 2009 –10 వరకు 25,000 రూ.ల పన్ను చెల్లింపు బాకీ, 2010–11 నుండి 2014–15 వరకు 10,000 రూ.ల వరకు బాకీ వున్నవాళ్ల మీద కేసులను ఉపసంహరించుకుంటున్నారు. నయా ఉదార విధానాలు బలంగా అమలవుతున్న గత పది సంవత్సరాల నుండి సంపన్న వర్గానికి వెతికి వెతికి రాయితీలు ఇవ్వడం గమనించవచ్చు.

## పెట్టుబడుల ఉపసంహరణ:

ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడులను ఉపసంహరించుకోవటం, ప్రైవేటు సంస్థలకు అమ్మటంద్వారా రాబడిని సమకూర్చుకుంటున్నారు. దీని ద్వారా కారుచౌకగా దేశ సంపదను గుత్త పెట్టుబడులకు అప్ప చెబుతున్నారు. ఈ క్రమం గత పదేళ్లుగా ముమ్మరమైంది. ప్రస్తుత బడ్జెట్లో స్పష్టంగా లేనప్పటికీ పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా 30 వేల కోట్ల రూపాయల రాబడిని

సమకూర్చుకోవాలని అంచనా. పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండు రోజులకి ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, చమురు, సహజవాయుల ఉత్పత్తి దిగ్గజం ONGC ల వాటాలను విక్రయిస్తామని ప్రస్తుతం ప్రభుత్వ వాటాలు, ఈ సంస్థలలో 50 శాతం కన్నా తక్కువగా ఉండటానికి సిద్ధమేనని, రాబోయే సంవత్సరాలలో వీటిని ప్రైవేటీకరిస్తామని ఆర్థికమంత్రి ప్రకటించారు. మౌలిక సదుపాయాల కోసం 11.12 లక్షల కోట్ల రూ.లు కేటాయించినట్లు గొప్పగా ప్రకటించినప్పటికీ, కొత్తగా నిర్మించిన మౌలిక సదుపాయాలను ప్రైవేటు సంస్థలకు అద్దెకివ్వటం కోసమే. ఆస్తుల నగదీకరణ ద్వారా 1.75 లక్షల కోట్లను సమీకరించుకొనే అవకాశం ఉంటుందని అంచనా.

ఈ ప్రక్రియల వల్ల ప్రభుత్వ/ప్రజల సంపద గుత్త పెట్టుబడులకు స్వాధీనమవుతుంది. నిరుద్యోగ సమస్య మరింత తీవ్రమవుతుంది. ఆర్థిక అసమానతలు పరాకాష్ట దశకు చేరుకుంటాయి. ఇవన్నీ ప్రస్తుత ఆర్థిక సంక్షోభాన్ని తీవ్రంగా జటిలం చేస్తాయి.

## ఆర్థిక అసమానతలు:

వాస్తవ వృద్ధిరేటు తగ్గటంతో పాటు ఆర్థిక అసమానతలు తీవ్రమవుతున్నాయి. ప్రపంచ స్థాయి నివేదికలు, మన దేశ నివేదికలు కూడా ఈ అంశాన్ని ధృఢపరుస్తున్నాయి. భారతదేశంలో ఆదాయంలో అట్టడుగు 50 శాతం మంది వాటా 1991-2000లలో 19.08 శాతం ఉండగా, 2011- 2020 నాటికి 13.25 శాతానికి తగ్గింది. ఇదే కాలంలో సంపదలో వాటా 8.36 శాతం నుండి 6.12 శాతానికి తగ్గింది. ఇదే కాలంలో శిఖర స్థాయి 1 శాతం సంపన్న వర్గానికి ఆదాయంలో వాటా 13.26 శాతం నుండి 21.74 శాతానికి పెరిగింది. సంపదలో వాటా 23.31 శాతం నుండి 30.55 శాతానికి పెరిగింది. స్థూల దేశీయోత్పత్తిలో వృద్ధిరేటు కంటే టాప్ 10 శాతం యొక్క సంపద, ఆదాయాల వృద్ధిరేటు అధికంగా వున్నది. అందువల్ల పేదరికం పెరిగిపోతున్నది. ఇది సంపన్న వర్గాల వృద్ధి మాత్రమే. సమ్మిళిత వృద్ధి కానే కాదు. ఈ పరిస్థితులలో 80 కోట్ల మందికి ఉచిత రేషన్ సరఫరా చేసామని, 25 కోట్ల మంది బహువిధ-పేదరికం నుండి బయట పడ్డారని ప్రభుత్వం చెప్పటం పేదరికం పేరుతో తిరిగి తిరిగి పేదలను అపహాస్యం చేయడమే.

## విద్య, వైద్యం:

జాతీయ విద్యావిధానం, 2020 మెజారిటీ ప్రజలను విద్యకు దూరం చేస్తుందన్న విషయం అందరికీ తెలిసిందే. విద్యా హక్కు వాస్తవం కావాలంటే ప్రభుత్వ విద్య బలోపేతం కావాలి. ఈ దిశగా ప్రస్తుత బడ్జెట్‌లో ఎటువంటి ప్రతిపాదనలు లేవు. 9 -14 సం.ల ఆడపిల్లలకు సర్వైకల్ క్యాన్సర్ టీకాను ఉచితంగా ఇస్తామని, ఆయుష్మాన్ భారత్ బీమా పథకాన్ని ఆశా వర్కర్లకు, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు కూడా అందజేస్తామని బడ్జెట్ చెబుతున్నది. ప్రజారోగ్యం పతనమైంది. వైద్యరంగం బలంగా కార్పొరేటీకరించబడింది. మెజారిటీ ప్రజలు ఆరోగ్య సేవలకు దూరమైనారు. మెజారిటీ ప్రజలకు విద్య, వైద్యం అందుబాటులోకి రాకపోవటం మరింత బలంగా 'అమృతకాల్'లో కొనసాగుతున్నది. దానితో, 2047లో 'వికసిత భారత్' అవుతుంది.

## గ్లోబల్ ఆర్థిక మాంద్యం :

ప్రపంచంలో ఆర్థిక మాంద్యం ముంచుకొస్తున్నది. నిరుద్యోగిత, ధరలు పెరుగుతున్నాయి. గ్లోబల్ వాణిజ్యం తగ్గిపోతున్నది. గ్లోబల్ ఆర్థిక వ్యవస్థతో, గ్లోబల్ విలువ గొలుసుతో బలంగా మన వ్యవస్థ అనుసంధానమై ఉన్నది. ఆ ప్రభావం మనమీద ఉండదు అంటున్నారు. అందుకోసం ఏ చర్యలు తీసుకోలేదు. అమెరికాలో ఇటీవలి ఫెడరల్ రిజర్వ్ సమావేశంలో వడ్డీ రేట్లను తగ్గించేది లేదన్నారు. ఇటువంటప్పుడు విదేశీ పెట్టుబడులు మన దేశం నుంచి అమెరికాకు తరలి వెళ్లకుండా ఏ పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు ఆపలేవన్న వాస్తవం అందరికీ తెలిసిందే. డాలర్ విలువ కూడా పెరుగుతున్నది. రూపాయి విలువ ఇంకా క్షీణిస్తున్నది మనదేశంలో ధరలు పెరుగుతాయి. నిరుద్యోగిత పెరుగుతుంది. శ్రమ దోపిడీ తీవ్రమవుతుంది. వీటిని విస్మరించి, గ్లోబల్ ఆర్థిక పరిస్థితులు, అమెరికాలోని ఆర్థికమాంద్యం ప్రభావం భారతదేశం మీద ఉండదని చెప్పటం వైరుధ్యమే.

ఈ పరిస్థితులలో యూపీఏ ప్రభుత్వం చేసిన ఆర్థిక తప్పుల మీద త్వరలో పార్లమెంటులో శ్వేత పత్రాన్ని ప్రవేశపెట్టటానికి సన్నాహాలు జరుగుతున్నాయి. మెజారిటీ ప్రజల జీవన సంక్షోభాన్ని తగ్గించటానికి బడ్జెట్లో ఏ ప్రతిపాదన లేదు. సరికదా, సమస్యలను గుర్తించడానికే నిరాకరిస్తున్నారు. 'దేశాభివృద్ధి ఫస్ట్' అని బలంగా మన దేశ ప్రజలు భావించాలి అంటున్నారు. రాష్ట్రాలకు పన్నుల ఆదాయపు వాటాలలో కోత పెడుతూ ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం విదేశీ మదుపరులను ఆకర్షించుకోమని గాలికొదిలేస్తున్నారు. ప్రజల ఆస్తుల్ని, భూముల్ని కార్పొరేట్లకు తాకట్టుపెట్టి, 99 సంవత్సరాల లీజులకు అప్పగించి నెట్టుకు రమ్మని సెలవిస్తున్నారు. ఆనాటి సోషలిస్ట్ సోవియట్ యూనియన్‌లో మొదటి ప్రపంచ యుద్ధాన్ని ఎదుర్కోవడానికి, సోషలిస్టు వ్యవస్థను నిలబెట్టుకోవడానికి ప్రజలందరూ సమానంగా కష్టపడ్డారు, త్యాగాలు చేశారు. కానీ, ఇప్పుడు మనదేశంలో సంపన్న వర్గపు సంపద, విలాసవంతమైన జీవితాలు, గుత్త పెట్టుబడుల ఆధిక్యత కోసం మెజారిటీ ప్రజలు త్యాగాలు చేయాలనటం తమ పెట్టుబడుల లాభాల గ్యారెంటీ కోసమే. మెజారిటీ ప్రజల జీవన సంక్షోభం తీవ్రమవుతున్న ఆర్థిక వాస్తవాలతో, ఈ వ్యవస్థకు మనుగడ ఇలాగే ఉంటుందా? ఉండదు. అంతకంతకూ పెరుగుతున్న ఆర్థిక సంక్షోభంలో వార్షిక బడ్జెట్ మోసాలు, మాయమాటలు కూడా ఒక వార్షిక ఎత్తుగడలో భాగమే అవుతున్నాయి. ఇది ఈనాటి అత్యంత విషాదకర పరిస్థితి. ✱


## జనశక్తి యాజమాన్య వివరాలు

(ఫారం 4 రూల్ 8 ప్రకారం)

| | | |
|---|---|---|
| 1. ప్రచురణ స్థలం | : | విజయవాడ, 520 010 |
| 2. ప్రచురణ కాలం | : | నెలకొకసారి (మాస పత్రిక) |
| 3. ముద్రాపకుని పేరు | : | ఎస్. శేషమ్మ |
| జాతీయత, చిరునామా | : | భారతీయురాలు<br>32-13-26/1, బోయపాటి మాధవరావు రోడ్,<br>మొగల్రాజపురం, విజయవాడ-520 010 |
| 4. ప్రచురణ కర్త పేరు,<br>జాతీయత, చిరునామా | : | పై విధంగానే |
| 5. సంపాదకుని పేరు | : | ఎస్. శేషమ్మ |
| 6. భాగస్వాములు | : | - |

పైన పేర్కొన్న విషయములన్నియు యదార్థములు

5.3.2024 సం॥ ఎస్. శేషమ్మ

# వ్యవసాయరంగాన్ని సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు, కార్పొరేట్ సంస్థలకు లోబరుస్తున్న ఒప్పందాలు

ప్రశాంత్

**వ్యవసాయరంగాన్ని,** రైతాంగాన్ని నాశనం చేసే మూడు నల్లచట్టాలను నరేంద్రమోడీ ప్రభుత్వం కుట్రపూరితంగా, చట్టవిరుద్ధంగా ముందుకు తెచ్చింది. దేశవ్యాపిత రైతాంగ ఆందోళనతోపాటు, నాడు జరుగబోయే వివిధ రాష్ట్రాల శాసనసభల ఎన్నికల నేపథ్యంలో, రైతుల ఆగ్రహాన్ని చల్లబరిచేందుకు, ఆ నల్ల చట్టాలను ఉపసంహరించుకుంటున్నట్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఈ చట్టాలలోని విధానాలన్నింటినీ బాహాటంగా అమలు చేస్తున్నారు. దేశవ్యవసాయరంగాన్ని, రైతాంగాన్ని సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల, కార్పొరేటు సంస్థల దోపిడీకి వీలుగా, రైతాంగ రక్తమాంసాలను పీల్చి పిప్పిజేసే విధంగా అన్ని అవకాశాలనూ కల్పించటానికి కేంద్రప్రభుత్వం ఎంతగానో "కృషి" చేస్తోంది. ఈ ఒప్పందాలు కూడా అందులో భాగమే.

2023 సెప్టెంబర్ 1న, భారత వ్యవసాయ పరిశోధనా మండలి, బేయర్(మోన్‌శాంటో)లు వనరులను అధికం చేసుకునే, వాతావరణ మార్పులకు తట్టుకునే పంటల రకాలను; పంట రక్షణకు, చీడపీడలను తట్టుకునే యంత్రాంగాన్ని గురించిన ఒక అవగాహనా ఒప్పంద పత్రంపై (ఎంఓయు) సంతకాలు చేశాయి. నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాలను, సలహా సేవలను ఒక క్రమపద్ధతిలో అందించేందుకు ఈ ఒప్పందం దృష్టిసారిస్తుందని దానిలో పేర్కొన్నారు.

సమృద్ధ వనరుల వ్యవసాయ ఆర్థిక విధానాలను పంటలలో ప్రోత్సహించేందుకు, వ్యవసాయార్థిక సలహాలతో చిన్న కమతాల వ్యవసాయదారులకు సాధికారిత కల్పించేందుకు, కార్బన్ క్రెడిట్ (వెలువడే కర్బన ఉద్గారాలకు ద్రవ్య విలువ చెల్లించే మార్కెట్లు...అను) మార్కెట్ల అభివృద్ధికి, సంయుక్త పరిశోధన ద్వారా సాంద్రీకరించిన వ్యవసాయ విధానాలను అభివృద్ధి చేసేందుకు - ఈ భాగస్వామ్య ఒప్పందం ఉద్దేశించబడిందని చెప్పారు. ఇంకా, వ్యవసాయ విజ్ఞాన కేంద్రాల(కెవికె)ద్వారా సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని విస్తృత రైతాంగ పునాదివద్దకు చేర్చటాన్నీ, సాంకేతికత బదిలీ, సామర్థ్య నిర్మాణ కార్యక్రమాల ద్వారా నైపుణ్యీకరించటాన్ని బలీయం చేస్తుందని చెప్పారు. "వాతావరణ స్థితిస్థాపకతను, నిర్వహించదగిన పంటల వ్యవస్థలను అభివృద్ధిచేసేందుకు ఐసిఏఆర్‌తో కలిసి పనిచేయాలని బేయర్ సంస్థ ప్రకటిస్తున్నప్పటికీ, అందుకు భిన్నంగా భారతదేశ వ్యాపితంగా ఏర్పాటు చేయబడివున్న కెవికెల వంటి పంటనిరూపణ సంస్థలను ఉపయోగించేందుకు ఉద్దేశించబడి, పర్యావరణపరంగా హానికరమైన తన కలుపునివారణ మందులు లేదా జన్యుమార్పిడి(జిఎమ్)పంటలకు మార్కెట్లకు అభివృద్ధి చేసుకోవటమే జరుగుతుంది" అని ఐసిఏఆర్‌లో క్రాప్ జెనొమిక్స్‌లో ప్రధాన శాస్త్రవేత్త డా॥సోమ మర్ల పేర్కొన్నారు.

దీనర్థమేమంటే, దేశవ్యాపితంగా వున్న ఐసిఏఆర్‌కు చెందిన 113 సంస్థలను, 74 వ్యవసాయ విశ్వవిద్యాలయాలను బేయర్ కంపెనీ తన చేతుల్లోకి తీసుకొని, జి.ఎమ్. విత్తనాలను వ్యవసాయంలో మరింతగా విస్తరించేందుకు వ్యవసాయ ఆవిష్కరణలను, సాంకేతికతను, పరిశోధనను, విత్తనాలను, పురుగుమందులను నియంత్రిస్తుంది. తాము పండించబోయే పంటపైన, తమకు అవసరమైన జి.ఎమ్ విత్తనాల, ఎరువుల, పురుగుమందుల వినియోగంపైన రైతులకు బోధనలు చేసే పరిస్థితి రానుంది. జి.ఎమ్.విత్తన వినియోగం, కలుపుమొక్కలు విస్తారంగా పెరిగిపోయేందుకు దోహదపడుతుంది. కలుపు నివారణ రసాయన క్రిమిసంహారిణిలో భాగమైన బేయర్ కంపెనీ తయారుచేసిన 'రౌండప్' పేరుతోనున్న గ్లైఫోసేట్ రసాయనం, ఈ కలుపుమొక్కల నిరోధానికి వాడిటీరాలి. ఒకసారి ఈ రసాయనాన్ని వాడినందు వలన ఎలాంటి ప్రయోజనం వుండదు; అందువలన పలు పర్యాయాలు దీనిని పంటపై చల్లాల్సి వుంటుంది. అయినప్పటికీ ఫలిత ముంటుందని చెప్పలేం. సాధారణ వంగడాలు ఈ రసాయనాన్ని తట్టుకోలేవు. బేయర్ కంపెనీ ఉత్పత్తులన్నీ ప్రమాదకరమైనవని నిరూపితమైన ఘటనలు ప్రపంచవ్యాపితంగా అనేకం వున్నాయి.

గ్లైఫోసేట్‌ను ప్రపంచంలోనే అత్యధిక ప్రాచుర్యం పొందిన కలుపు సంహారిణిగా అభివర్ణిస్తారు. అమెరికాలో 750కి పైగా ఉత్పత్తులను ఇది కలిగి వుంది. పంటలపై ఈ రసాయనాన్ని వెదజల్లితే, అది భూమిని, పుప్పొడిని, నీటి ప్రవాహాలను, పర్యావరణాన్నీ, మానవుని ఆరోగ్యాన్ని అన్నివిధాలా కాలుష్య భరితం చేసి దెబ్బతీస్తుంది. గ్లైఫోసేట్ ఆధారంగా తయారుచేసిన రౌండప్, ఇంకా ఇతర కలుపు సంహారక రసాయనాల కారణంగా ఏర్పడనున్న క్యాన్సర్‌కారక ప్రమాదాలపై కేంద్రీకరించిన అనేక న్యాయపరమైన వ్యాజ్యాలను బేయర్ ఎదుర్కొంటోంది.

"గ్లైఫోసేట్ మానవులలో క్యాన్సర్ కారకంగా వుందని" 2015 సం॥లో ప్రపంచ ఆరోగ్యసంస్థ నిర్ధారించింది. అమెరికాలో ఓ భూయజమాని తన పంటపై చల్లిన కలుపు సంహారకంలో వాడిన రసాయనాలు తన క్యాన్సర్ వ్యాధికి కారణమని ఆరోపిస్తూ న్యాయస్థానంలో వ్యాజ్యం నడపగా, కాలిఫోర్నియా న్యాయమూర్తి 2018లో తీర్పునిస్తూ బాధితునికి బేయర్-మాన్‌శాంటో కంపెనీ 28.90 కోట్ల డాలర్లను పరిహారంగా చెల్లించాలని ఆదేశించారు.

ఇటీవలి దశాబ్దాలలో, అర్జెంటీనాలో సోయాబీన్ ఉత్పత్తి వేగంగా పెరిగింది. జన్యుమార్పిడి పంటలలో కలుపు నివారణ మందులు తక్కువగా వినియోగిస్తే సరిపోతుందని చెబుతూంటారు. అయితే, కలుపు మొక్కలలో నిరోధకత పెరుగుతోంది. కనుక అధిక మోతాదు కలుపు నివారణ రసాయనాన్ని ఉపయోగించాల్సి వస్తోంది. 1994-2010 సం॥ల మధ్య సాగుభూమి విస్తీర్ణం 45 శాతం పెరగగా, ఐక్యరాజ్యసమితి ఆహార వ్యవసాయ సంస్థ అందించిన వివరాల ప్రకారం, అర్జెంటీనాలో వినియోగించిన కలుపు నివారణ రసాయన వినియోగం 19,376 టన్నుల క్రియాశీల రసాయనాల నుండి 2,27,185 టన్నులకు అంటే వెయ్యిశాతం పైగా వినియోగం పెరగటాన్ని గమనించవచ్చు.

పోర్చుగల్, ఇటలీ, వంటి కొన్ని దేశాలు; వాంకోవర్ వంటి కెనడా నగరాలలో బహిరంగ పార్కులు, ఉద్యానవనాలలో గ్లైఫోసేట్ వినియోగాన్ని నిషేధించారు. 2015 సం॥లో తేయాకు పరిశ్రమదారులు వ్యతిరేకిస్తున్నప్పటికీ గ్లైఫోసేట్ వినియోగాన్ని శ్రీలంక నిషేధించింది. మనదేశంలో కూడా, మోన్‌శాంటో పత్తి, మొక్కజొన్న, వంగ మరియు ఇతర జి.ఎమ్. విత్తనాల కారణంగా రైతులు ఎన్నో నష్టాలను ఎదుర్కొన్నారు. పంటలు, భూమి, పర్యావరణం, ఆరోగ్యం మొదలైనవి తీవ్రంగా దెబ్బతిన్న పరిస్థితులను మనం చూశాం. 2020 డిసెంబర్

నాటికి, బేయర్ కంపెనీ విభాగమైన మోన్‌శాంటో యొక్క రౌండప్, క్యాన్సర్ ప్రమాదాలకు సంబంధించిన లక్షదాకా న్యాయపరమైన వ్యాజ్యాలను ముగించుకోవాలని తీర్మానించింది. ఈ మాన్‌శాంటో పరిహార చెల్లింపుల సెటిల్‌మెంట్స్ మొత్తం దాదాపు 1100 కోట్ల డాలర్లుగా వున్నాయి. 2023 డిసెంబర్‌లో, కాలిఫోర్నియా రౌండప్ ఎండిఎల్‌లో 4,174 క్యాన్సర్ వ్యాజ్యాలు ఇంకా నిలిపి వుంచబడ్డాయి. ప్రపంచవ్యాపితంగా లక్షలాదిగా కేసులు ఇంకా వెలుగుజూస్తూనే వున్నాయి.

ఈ కేసుల కారణంగా బేయర్ కంపెనీ వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు పడిపోయాయి. జర్మనీ బేయర్ ఎ.జి.కంపెనీ, వివాదాస్పద కలుపునాశని రౌండప్‌తోసహా తన గ్లైఫోసేట్ ఆధారిత ఉత్పత్తుల గిరాకీ మందగింపును ఎదుర్కొనేందుకు 280 కోట్ల డాలర్లను వెచ్చించవలసి వచ్చిందని చెప్పింది.

బేయర్ కంపెనీ భారత వ్యవసాయ రంగంపై కన్నేసి, ఈ ఒప్పందాల ద్వారా తన నష్టాలన్నింటినీ పూడ్చుకోవానుకుంటోంది. బేయర్ తమ కంపెనీ ఉత్పత్తిచేసిన జి.ఎమ్. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులనే రైతులు తమ పంటలకు ఉపయోగించాలని బలవంత పెడుతోంది. కేంద్ర ప్రభుత్వం-విత్తనాలు, ఎరువులు, పురుగుమందులపై సబ్సిడీలను ఎత్తివేసింది. ఇది రైతులపై పెనుభారాన్ని మోపుతోంది. కేంద్రప్రభుత్వమే స్వయంగా రైతుల వెన్నువిరిచేలా కంపెనీ ఉత్పత్తుల ధరలను పెంచుతోంది. అయితే, మరోవైపున రైతుల కనీస మద్దతు ధరలను మాత్రం పెంచటంలేదు. ఉదాహరణకు 2020-21లో ఒక సంచీ పత్తి విత్తనాల ధర 730 రూ॥కాగా, 2023-24లో కేంద్రప్రభుత్వం దానిని 853 రూ॥కు పెంచి వేసింది. 2020-21 సం॥లో ప్రత్తి మద్దతు ధర క్వింటా 5825 రూ॥ కాగా, 2023-24లో అది కేవలం 7020 రూ॥కు మాత్రమే పెరిగింది. ఇక ఇప్పుడు, జిఎమ్ పంటల ద్వారా ఈ ఒప్పందం రైతులపై కోలుకోలేని భారాన్ని మోపటంతోపాటు పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన హాని కలిగిస్తుంది.

2023 జూన్ 8న న్యూఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధనామండలి (ఐసిఏఆర్) అమెజాన్ కిసాన్ కంపెనీలు ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయు)పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందంతో అమెజాన్ యంత్రాంగం, రైతాంగానికి సాంకేతిక మద్దతునందించటం ద్వారా రైతులను వివిధ పంటలలో అధిక దిగుబడి సాధించేందుకు శాస్త్రీయంగా సాగుచేయటం, అధిక ఆదాయాన్ని ఆర్జించటం వంటి వాటిని నేర్పి, ఈ రెండు సంస్థల నడుమ మంచి అవగాహన నెలకొల్పి మార్గదర్శకత్వం వహిస్తుందని చెప్పాయి. రైతులతో ఈ భాగస్వామ్య అవగాహనా ఒప్పందం (ఎంఓయు), అమెజాన్ ఫ్రెష్‌ద్వారా కూడా కలుపుకొని నాణ్యమైన తాజా ఉత్పత్తులను దేశవ్యాపితంగా వినియోగదారులకు అందిస్తుందని చెపుతోంది. కానీ వాస్తవం భిన్నంగా వుంది.

ఐసిఏఆర్ మరియు అమెజాన్‌లు సంయుక్తంగా, సమగ్ర వ్యవసాయంలో సాంకేతిక విజ్ఞాన కొరవలను పూరించేవిధంగా ఐసిఏఆర్ యొక్క విస్తృత పరిశోధన ద్వారా అభివృద్ధిచేసిన అధునాతన, అత్యంత సాంద్ర వ్యవసాయ విధానాలను, ఐసిఏఆర్ యొక్క కృషి విజ్ఞాన్ కేంద్ర(కెవికె)యంత్రాంగంద్వారా అందించనుంది. సాంకేతికత బదిలీ, సామర్థ్య నిర్మాణ కార్య కలాపాల ద్వారా సాంకేతిక పునాది ఆధారంగా విస్తృతంగా రైతాంగ సమూహాలను కెవికెలు బలీయం చేయనున్నాయి. దీనికి తోడుగా, ఐసిఏఆర్ అమెజాన్‌లు కృషివిజ్ఞాన కేంద్రాలలో రైతాంగ సంపర్కంతో ప్రదర్శనలు చేపట్టటం, ప్రయోగాలు, వ్యవసాయ విధానాలను ముందుకు తీసుకువెళ్ళే సామర్థ్య నిర్మాణ చొరవలు మరియు రైతాంగానికి లాభాలు సమకూర్చటం వంటి కార్యక్రమాలను చేపట్టనున్నాయి. ఇంకా, అమెజాన్ సంస్థ తన ఆన్‌లైన్ వేదిక ద్వారా తర్ఫీదుకు సహాయాన్ని, వినియోగదారులతో నేరుగా సంబంధాలు ఏర్పరుచుకునే అవకాశం కల్పించటంద్వారా రైతాంగం తమ ఉత్పత్తులను అమ్ముకోవటంలో సహకారాన్ని అందజేస్తుంది.

సిస్కో, ఐటిసి, మేజర్ ఐటి సంస్థ ఎన్‌సిడిఇఎక్స్ యొక్క ఈ-మార్కెట్ లిమిటెడ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఐటి సంస్థ జియో వేదికలు, మనదేశపు అతిపెద్ద తాజా ఉత్పత్తుల సరఫరా గొలుసు కంపెనీ నింజా కార్ట్‌లు-విడివిడిగా కేంద్ర వ్యవసాయశాఖా మంత్రి నరేంద్రసింగ్ తోమర్‌తో 2021 సెప్టెంబర్ 15న ముందస్తు ప్రాజెక్టుల కొరకు, దేశంలో రైతాంగానికి సమాచార ఆధారాన్ని నిర్మించేందుకు కేంద్రానికి సహకరించేందుకు, ఈ అవగాహనా ఒప్పందాలు చేసుకున్నాయి.

ఈ వాదనలద్వారా, వ్యవసాయరంగంలో సాంకేతికత వినియోగం పేరున, యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటూ, రైతుల ద్వారా శాస్త్రీయ వ్యవసాయం, ఆధునికత్వాన్ని వినియోగింప జేయటం పేరున, ఈ కంపెనీలన్నీ వారి ఉత్పత్తులన్నింటినీ ఆన్‌లైన్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యంత్రాలను రైతాంగానికి కట్టబెట్టటమే జరుగుతుంది. ఒక అధ్యయనం ప్రకారం, 2025 నాటికి వ్యవసాయ ఉత్పత్తుల ఆన్‌లైన్ అమ్మకాల ద్వారా 24 వందల కోట్ల డాలర్ల ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ఈ కంపెనీలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

"ఒక అభివృద్ధిచెందుతున్న" దేశంలో యంత్రాంగాలను, కృత్రిమ మేధోపరిజ్ఞానాన్ని, మెషీన్ లెర్నింగ్‌ను విస్తరింపచేయటానికి ఇది ఒక అవకాశం కాగా, 'ఈ-వాణిజ్య' పరిశ్రమలైన అమెజాన్, రిలయన్స్ వంటివి నిలకడగా రైతాంగ ఉత్పత్తులను సమీకరించటం కిరాణా వ్యాపారాన్ని దెబ్బతీసేందుకు తోడ్పడుతుంది. భారతీయులు వ్యయంచేసే సాంవత్సరిక చిల్లర కిరాణా ఖర్చు లక్షకోట్ల డాలర్లలో సగానికి పైగానే వుంటుంది". - ది.హిందూ-బిజినెస్ లైన్, 17-9-2021.

దీని ప్రకారం చిల్లర దుకాణరంగంలో వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించే చిన్న కిరాణా దుకాణదారులు, యజమానులు దివాళా తీయనున్నారు.

అదేవిధంగా భారీస్థాయిలో ఈ కంపెనీలు వ్యవసాయానికి, రైతాంగానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి, వాతావరణ పరిస్థితులకు అనువైన లాభదాయక పంటల సమాచారాన్ని అందించటం పేరున తమ దోపిడీని తీవ్రం చేయటంతోపాటు వ్యవసాయాన్ని తమ అదుపులో వుంచుకుంటాయి.

సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలు, కార్పొరేట్ సంస్థలు, గంపగుత్తగా వ్యవసాయ రంగాన్ని దోచుకునేందుకు కేంద్రప్రభుత్వం సాధ్యమైన అన్ని ప్రయత్నాలనూ చేస్తోంది. వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా వీటిని వ్యతిరేకించకుండా అమలుచేస్తున్నాయి. కనుక, రైతులు, కిరాణా వ్యాపారులు, ప్రజానీకమంతా కేంద్ర - రాష్ట్రప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక చర్యలను, విధానాలను అదేవిధంగా వ్యవసాయ రంగాన్ని దిగమింగేందుకు ప్రయత్నిస్తోన్న ఈ కంపెనీలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరముంది.

**(2024 జనవరి 'క్లాస్‌స్ట్రగుల్' నుండి అనువాదం)** ✸


**Read !** **Subscribe!!**




Organ of Central Committee of CPI (ML)

# కార్మికులను, వారి హక్కులను మొదలంటా కబళించే నాలుగు లేబర్ కోడ్‌లు

**అధికారమార్పిడి** జరిగిన ఏడు దశాబ్దాల తర్వాత పాలకులు నేడు భారతదేశం 'ఆజాదీకా అమృత్‌కాలం'లో వుందంటున్నారు. కేంద్రంలో పాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వాధినేత మోడీ, తాను ప్రకటించిన దానికి పూర్తి విరుద్ధంగా నడుచుకోవటంలో సిద్ధహస్తుడు. అదేవిధంగా చేసే చర్యలకు ఖచ్చితంగా భిన్నంగా మాట్లాడుతూ వస్తున్నాడు. ఇది అతని ఎత్తుగడ కావచ్చు. 'జై కిసాన్' నినాదమిస్తూనే, రైతాంగ, వ్యవసాయ కూలీల, కార్మికుల జీవితాలను కాలరాసే వ్యవసాయ చట్టాలను ముందుకు తేవడమే, దానికి రుజువు. ఏమైనా ఐక్య రైతాంగ ఉద్యమం ఆ నల్ల చట్టాలను వెనక్కు కొట్టగలిగింది. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్', 'నా ఖావూంగా…నా ఖానే దూంగా' వంటి మోడీ నినాదాలన్నీ ఘోరంగా విఫలమయ్యాయి.

అలాగే నాలుగు లేబర్‌కోడ్‌ల రూపకల్పన చేసే సమయంలో కూడా ప్రధాని మోడీ 'సత్యమేవ జయతే' తరహాలో 'శ్రమ యేవ జయతే' అనే నినాదమందుకుని, దానికి ఒక భారీ ప్రచారాన్ని కల్పించాడు. ఈ నాలుగు లేబర్‌కోడ్‌లు కార్మికులపట్ల ఎంతటి దుర్మార్గంగా వర్తిస్తాయో, అలాగే దేశ, విదేశీ కార్పొరేట్ల ప్రయోజనాలకు ఎంతగా అంకితమయ్యాయో స్పష్టం చేస్తున్నాయి.

శ్రమ సంబంధిత సబ్జెక్ట్‌గా పేర్కొన్న వివిధ చట్టాలు, న్యాయనిబంధనలన్నీ మన రాజ్యాంగం లోని ఉమ్మడి జాబితాలో వున్నాయి. అయితే కేంద్రప్రభుత్వం, 44 చట్టాలను రద్దుచేస్తూ, వాటి స్థానంలో 4 కోడ్‌లను తీసుకువచ్చింది. వాటిలో ఎంప్లాయీస్ కంపెన్‌సేషన్ యాక్టు 1928, ట్రేడ్ యూనియన్స్ చట్టం(1926), పేమెంట్ ఆఫ్ వేజెస్ (సవరణ)యాక్టు(2017)మొదలుగాగల 44 చట్టాలున్నాయి.

ఈ చట్టాలన్నీ సహజ క్రమంలో ముందు కొచ్చినవి కావు. ఎన్నో పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా, కార్మికులు వీటిని దక్కించుకున్నారు. ఆ విధంగా అనేక బలిదానాలు సాగించి, రక్తతర్పణలు చేస్తేగానీ, పాలకులు ఈ చట్టాలు చేయటానికి సిద్ధం కాలేదు. కార్మికుల హక్కులు, ప్రయోజనాలన్నీ ఈ చట్టాలతోనే ముడిపడి లేవు. ఈ చట్టాలలోని అనేక నిబంధనలు, పాలక వర్గానికి, యాజమాన్యాలకు ప్రయోజనం కల్పించేవిగా కూడా వుండటంతోపాటు, కార్మిక కష్టజీవులకు ఏదో మేరకు తోడ్పడేవిగా వున్నాయి. లేబర్ ట్రిబ్యునల్, లేబర్‌కోర్టులు లేబర్ కమిషన్ మొదలైనవన్నీ కార్మికులకు సులభతరం, సౌకర్యవంతమైనవేమీ కాదు. ఏమైనా, ఏవో కొన్ని అయినా, సానుకూల అంశాలు ఇమిడివుంటే, అది కార్మికుల నమ్మకాన్ని చూరగొనటంతోపాటు, కార్మికుల నడుమ విశ్వాసాన్ని ప్రోదిచేస్తుంది. పాలకులు, దోపిడీ ప్రభువులంతా కలిసి చట్టపరిధికి లోబడిన చట్రంలో కొనసాగుతున్నామంటూ తమ ప్రయోజనాలు కాపాడుకుంటున్నారు.

**ఇటువంటి 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా పునర్నిర్మించటానికి నేపథ్యాన్ని పరిశీలిద్దాం**

1991లో ప్రపంచీకరణ విధానాలను చేపట్టిన పాలకులు, సామ్రాజ్యవాద ద్రవ్య, వాణిజ్య సంస్థల త్రయం అయిన ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు, డబ్ల్యుటిఓల మార్గదర్శకత్వంలో మనదేశంలో పారిశ్రామిక విధానంలో మార్పు తీసుకున్నారు. ఫలితంగా దేశీయ, విదేశీ పెట్టుబడిదారుల శ్రమదోపిడీ అధికమైంది. శ్రామిక ప్రజానీకంపై సాగించే దోపిడీలో కొన్ని గుణాత్మక మార్పులు కూడా జరిగాయి. నిర్బంధ వ్యవస్థాగత సంస్కరణలను పాలకులు చేపట్టారు. వీటి లక్ష్యమేమంటే, పోరాటాలతో త్యాగాలతో సాధించుకున్న కార్మికుల హక్కులనన్నీ కాలరాయటమే. యాజమాన్యంతో సామూహికంగా బేరసారాలాడే అవకాశాన్ని క్రమక్రమంగా కత్తిరించివేశారు.

నూతన ఆర్థిక విధానాలలో భాగంగా భారత పాలకులు చేపట్టిన సరళీకరణ, ప్రైవేటీకరణ, గ్లోబలీకరణ విధానాలను, అధికారంలోవున్న పార్టీలు ఏవైనప్పటికీ, అమలు చేయటం క్రమక్రమంగా వేగం పెంచుతూ వచ్చాయి. బిజెపి ప్రభుత్వం చాలా మొరటుగా ఈ విధానాలను అమలుచేస్తోంది. వారి తక్షణ లక్ష్యం రైల్వేలు, బ్యాంకులు, ఎల్ఐసిలను ప్రైవేటుపరం చేయటం.

దేశవ్యాపితంగా 2000 సం॥నుండి ప్రత్యేక ఆర్థికమండళ్ళు – సెజ్‌లు – ప్రారంభమైన నాటి నుండి ప్రస్తుతం నిర్దిష్టరూపంలో ముందుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌ల అమలు ప్రారంభమైందని చెప్పవచ్చు. పశ్చిమబెంగాల్‌లో నాటి వామపక్ష సంఘటన ప్రభుత్వం కూడా దీనినే అనుసరించి, ఆ రాష్ట్రంలో అమలుచేసింది. దేశంలో ఉనికిలో వున్న చట్టాలేవీ సెజ్ ప్రాంతాలలో అమలు కావు. అవి మనదేశీయ భూభాగంలో వెలసిన విదేశీ ద్వీపాలుగా మారాయి. ఈ ద్వీపాలలో ఉద్యోగ భద్రత లేమి, వేతనాల కోత, పనిగంటల పెంపు, ఔట్‌సోర్సింగ్‌తోపాటు క్యాజువల్ కార్మికులను తమ చిత్తమొచ్చినపుడు తీసుకొని, తమకు అవసరం లేదనుకున్నపుడు తొలగించే (హైర్ అండ్ ఫైర్) వంటివన్నీ అమలులోకి వచ్చాయి. దీనితో, సామాజిక భద్రత కొరవడటం, జీవన ప్రమాణాలు పడిపోవటం తీవ్రమైంది. ఈ సామ్రాజ్యవాద అనుకూల విధానాల ఫలితంగా మన దేశంలో సంఘటితరంగం, పలు అసంఘటితరంగ యూనిట్లుగా మార్పుచెంది, విశాల కార్మిక ప్రజానీకానికి కనీస పని భద్రత కరవైంది.

బ్రిటిష్ కాలంలో 1881లో ఫ్యాక్టరీల చట్టం అమలులోకి వచ్చింది. 1884లో నారాయణ లోఖండే బొంబాయి జూట్‌మిల్ కార్మికులను మొదటగా కార్మిక యూనియన్‌లలోకి సంఘటితం చేశారు. ఈ యూనియన్ కాలంలో నిర్దిష్ట పనిగంటలు, అల్పాహార విరామం అరగంట, వారంలో ఒకరోజు శలవు మొదలైనవి అమలయ్యాయి. 1931లో ఫ్యాక్టరీ చట్టంలో మార్పులు చేస్తూ, అనేక ఆంక్షలను అందులో పొందుపరిచారు. వెనుకనుండి ల్యాంక్‌షైర్ జూట్‌మిల్ యజమానుల, బ్రిటన్ ప్రభుత్వాల వత్తిడి దీనికి కారణం.

1917లో రష్యాలో విజయవంతమైన విప్లవం, భారతదేశంపై కూడా తన ప్రభావాన్ని చూపింది. 1920లో ఐఎన్‌టియుసి ఏర్పడింది. ఇదే మొదటి దేశవ్యాపిత ట్రేడ్ యూనియన్. ఇది బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమానికి ఊపునిచ్చింది. 1926లో ట్రేడ్ యూనియన్ చట్టాన్ని అమలులోకి తేవటం ద్వారా నాటి పాలకులు సంఘటిత కార్మిక ఉద్యమాన్ని, దాని ప్రభావాన్ని కుదించాలని జూశారు.

మాజీ ప్రధాన న్యాయమూర్తి ప్రహ్లాద్ గజేంద్ర గడ్కర్ నాయకత్వంలో మొదటి లేబర్ కమిషన్ చేసిన సిఫార్సులలో అత్యంత ప్రాధాన్యతకల అంశాలున్నాయి. అవి:

(1) కార్మిక సంస్కరణల ఫలితంగా ఉత్పత్తి అయ్యే మిగులు ద్వారా కార్మికుల, ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు గ్యారంటీ ఇవ్వాలి. (2) యాంత్రిక, సాంకేతిక విజ్ఞానంతో పరిశ్రమలను ఉన్నతీ కరించిన ఫలితంగా సృష్టించబడే అదనపు విలువ ప్రాతిపదికన వేతన ప్రమాణాలను పెంచాలి; ఈ అదనపు విలువ పెంపు ఫలాలు సమాజానికి అందాలి(3) వేతన బోర్డు మొదలగు వాటిని సంస్కరించాలి.

1999లో రెండవ జాతీయ లేబర్ కమిషన్ ఏర్పడింది. బిజెపి నాయకుడు, నాటి కార్మికమంత్రి రవీంద్రవర్మ దీనికి అధ్యక్షుడు. బిఎమ్ఎస్, ఐఎన్టియుసి మినహా మిగతా అన్ని ట్రేడ్ యూనియన్లు దీనికి హాజరుకాకుండా బహిష్కరించాయి. ఈ వర్మ కమిషన్ 2002లో అందజేసిన తన నివేదికలో అన్ని కార్మిక సంబంధ చట్టాలను కూడా ఒకే "గొడుగు" క్రిందకు తేవాలని సూచించింది. అంతేతప్ప పేద, కార్మికవర్గ ప్రజానీకపు హక్కుల గురించిన గుర్తింపు, ప్రకటనవంటివేవీ ఇందులో లేవు.

రెండు దశాబ్దాల తదనంతరం, బిజెపి నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం నాలుగు లేబర్కోడ్ల పేరున, నూతన కార్మిక చట్టాలకు ఆమోదం తెల్పింది.

బ్రిటిష్ వలసపాలకుల నుండి అధికార మార్పిడి జరిగిన తర్వాత కాలంలో దేశంలో నిరంతరాయంగా రాజకీయ అనిశ్చితి, ధరల పెరుగుదల, ఆహారకొరత, నిరుద్యోగం వంటి సమస్యలతో మనదేశ ప్రజలు సతమతమవుతూ వస్తున్నారు. గత శతాబ్ది 50,60లలో ఈ సంక్షోభం తీవ్రమౌతూ 1970ల నాటికి స్పష్టంగా ముందుకొచ్చింది. 1975 నాటి అత్యయిక పరిస్థితిలో క్రూర నిర్బంధంతో ప్రజలు తీవ్రంగా ఆందోళన చెందారు. 1977 సంIIలో ఇందిరాగాంధీ ప్రభుత్వ పతనానంతరం అధికారంలోకి వచ్చిన జనతాపార్టీ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చటంలో విఫలమైంది. వీరి పాలనా కాలంలోనే యస్.భూతలింగం ఆధ్వర్యంలో కార్మిక పరిస్థితుల అధ్యయనానికి ఒక కమిటీని ఏర్పరిచారు. ఈ కమిటి కార్మికుల కనీస వేతనాలు, కరువుభత్యం, ఉద్యోగభద్రత, బోనస్, వేతనాలలో వ్యత్యాసాలు, సామాజిక భద్రతా అంశాలపై చాలా అహంకార భావనతో సూచనలు చేసింది. భారీ కార్మిక, ప్రజానిరసనల మధ్య జనతా ప్రభుత్వం, వారి వారస ప్రభుత్వాలేవీ వాటిని యథాతథంగా అమలు చేసేందుకు ధైర్యం చేయలేదు.

ప్రస్తుతం బిజెపి ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం కార్మికుల ప్రయోజనాలకు పూర్తి విరుద్ధంగా, పూర్తిగా యాజమాన్యాల పక్షాన అమలుచేసేందుకే ఈ కార్మిక కోడ్లను రూపొందించింది. కార్మికుల వర్గపోరాట చైతన్యాన్ని మొద్దుబార్చి వారి వర్గ ఐక్యతను విచ్ఛిన్నంచేసి, అంతిమంగా వారిని ఒంటరిని చేయటం వారి లక్ష్యం.

2020 సంIIనాటి గణాంకాల ప్రకారం, భారతదేశంలో మొత్తం ఉద్యోగులు, ఉపాధి పొందుతున్న వారిలో 41.19 శాతం వ్యవసాయ రంగం నుండి, 26.18 శాతం పారిశ్రామిక విభాగం నుండి, 32.33 శాతం సేవారంగం నుండి వున్నారని తెలుస్తోంది. మొత్తం ఉద్యోగులలో 94 శాతం పైగా అసంఘటిత రంగంలో వున్నారు. 2021లో మొత్తం శ్రామికుల సంఖ్య 50 కోట్ల 10 లక్షలు కాగా, అందులో 93.40 శాతం కార్మికులు ట్రేడ్ యూనియన్కు బయట వున్నారు. ఆనాడు నిరుద్యోగితా శాతం 6.1గా వుండి పరిస్థితి చాలా ఘోరంగా వుంది. విశాల నిరుద్యోగ యువజనులు ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం వేచివుండగా, వీరిమధ్య పోటీని అనుకూలంగా ఉపయోగించుకున్న యాజమాన్యాలు తక్కువ వేతనాలతో, అమానవీయ పరిస్థితుల నడుమ వారి శ్రమను దోపిడీ చేసేవారు. భారీ స్థాయిలోనున్న ఈ నిరుద్యోగులను చూపించి, యాజమాన్యాలు కార్మికుల ఉద్యమాలను అణగదొక్కటంలో చురుగ్గా వుండేవి.

## 1. వేతన కోడ్-2019

వేతన చెల్లింపుల చట్టం-1936, కనీస వేతన చట్టం-1948, బోనస్ చెల్లింపు చట్టం-1965, సమాన పారితోషిక చట్టం-1976 మొదలైన చట్టాలన్నిటినీ రద్దుచేసి ఈ వేతన కోడ్-2019 రూపొందించారు.

1957 జులైలో సిమ్లాలో జరిగిన 15వ భారత లేబర్ కమిషన్లో డాక్టర్ అయిక్రాయిడ్ సూత్రం ప్రకారం, తల ఒక్కొంటికి 2700 కేలరీలకు సరిపడిన ఆహారం, కుటుంబానికి 72 మీటర్ల గుడ్డ, ఇంకా విద్య, వైద్యం, నివాసం, విద్యుత్తు మొదలైన వాటితోపాటు అదనంగా 20శాతం ఇతర అవసరాలను కలిపి వేతనాన్ని నిర్ణయించాలని త్రైపాక్షిక సమావేశ నిర్ణయంగా ఆమోదించారు. దీనిని బిజెపి ప్రభుత్వం పూర్తిగా పక్కన పెడుతోంది. కార్మికుడిని ఒక్కడినే ఒక యూనిట్గా, భార్య లేదా భర్తను 0.8 యూనిట్గా, ఇద్దరు పిల్లలను 0.6 యూనిట్గా లెక్కగడ్తోంది. ఇక్కడ కార్మికుని తల్లిదండ్రులకు స్థానంలేదు. ఈవిధంగా రూపొందించిన 15వ లేబర్ కమిషన్ సిఫార్సులేమీ ఆదర్శనీయమైనవి కాదు. అయినా అనేక పోరాటాల ద్వారా, న్యాయపోరాటాల ద్వారా దీనిని కార్మికులు సాధించుకున్నారు. 44,45,46 లేబర్ కమిషన్లు కూడా ఈ నిర్ణయాల కనుగుణంగానే నడిచాయి.

బిజెపి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పరిచిన నిపుణుల కమిటీగా చెప్పబడేది-కార్మికునికి రోజుకు 178 రూ, నెలలో 26 రోజుల పనికి 4628 రూIIలను కనీస నెలసరి వేతనంగా వుండాలనే అపహాస్యమైన, దిగజారిన సిఫార్సు చేయటంతోపాటు, కార్మికుల పనిగంటల పెంపుకు సిఫార్సు చేసింది. ఈ నూతన వేతనకోడ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో 'కనీస వేతన' నిర్ణాయక కమిటీ ఏర్పాటు గురించి చెప్పింది. దీనిలో ప్రాథమికంగా యజమాని, ప్రభుత్వ ప్రతినిధులు, చివరగా కార్మికుల ప్రతినిధులు (యజమానులు ఎంపికచేసిన) అత్యల్ప స్థాయిలో వుంటారు.

### యజమానులను తమ బాధ్యతల నుండి మినహాయించటం

గత చట్టాల ప్రకారం యజమాని ఏదేని చట్టాన్ని ధిక్కరిస్తే, లక్ష రూIIజరిమానా లేదా 5 సంIIల కారాగార శిక్ష విధించే నిబంధనలుండేవి. ప్రస్తుత ఈ నూతన కోడ్లో కారాగార శిక్ష నిబంధనను ఎత్తివేశారు. మొదటిసారి ధిక్కరిస్తే హెచ్చరిస్తారు. యజమానులపై ఎలాంటి నేరాన్ని ఆపాదిస్తూ కేసు పెట్టటానికి దాదాపు ఈ కోడ్ ప్రకారం అవకాశమేలేదు.

గతంలో పారిశ్రామిక ప్రాంతాన్ని తనిఖీ చేసేందుకు కార్మిక తనిఖీ అధికారికి కొంతమేరకు స్వేచ్ఛ వుండేది. నేడు ఈ అవకాశాన్ని పూర్తిగా గుంజివేసుకున్నారు. యజమానికి ముందస్తుగా సలహాలు ఇవ్వటం, మొదటి అవకాశాన్ని తప్పనిసరిగా యజమానికి కల్పించటమే తమ కర్తవ్యంగా భావిస్తున్నారు. కనీస వేతనం చెల్లిస్తున్నామని యజమాని స్వయంగా పత్రం ఇవ్వాలని ఈ నూతనకోడ్ పేర్కొంటోంది.

గతంలో, ఏదేని కాంట్రాక్టర్, ఏ ఫ్యాక్టరీలోనైనా కొందరు కార్మికులను పనిలో నియమిస్తే ఆ కంపెనీని ప్రధాన యజమానిగా పరిగణించే వారు. ఇప్పుడు ఈ నూతన కోడ్ ప్రకారం, ఆ కంపెనీకి జవాబుదారీతనం లేకుండా తప్పించింది. కేంద్రప్రభుత్వ కోడ్ సంబంధిత అంశాలపై కార్మికులు, యాజమాన్యంతోపాటు 3వ వంతు ప్రత్యేక ఆహ్వానితులతో ఒక సలహా మండలిని ఏర్పరుస్తుంది. ఇలాంటి మండళ్ళను ప్రతి రాష్ట్రంలోనూ ఏర్పరుస్తారు. ఇందులో కార్మికులు ఎప్పుడూ మైనారిటీగానే వుంటారు. 8.33 శాతం బోనస్ను తప్పనిసరిగా చెల్లించాలనే గత కాలపు నిర్ణయం ఇకపై తప్పనిసరి కాదు.

### పనిగంటలు

ఇప్పుడు రోజుకు 8 గం॥ల చొప్పున 6 రోజుల పనివారంలో 48 గం॥లు శ్రామికులు శ్రమచేస్తున్నారు. పేరుకు 8 గంటల పని అయినా, ఇప్పటికే అంతకు మించిన పనిగంటలు అదనపు వేతనమేమీ లేకుండా కార్మికులు శ్రమిస్తున్నారు. ఐటి రంగంలో ఈ తరహా శ్రమదోపిడీ ఇప్పటికే ఎక్కువగా సాగుతోంది. ఈ సందర్భంలో ఇటీవల ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ ఉత్పాదకతను పెంచేందుకు '70 గంటల పని వారాన్ని' ప్రవేశ పెట్టాలని పేర్కొనటం గమనించదగింది. "సంబంధిత అధికార యంత్రాంగం" కోడ్‌లో పేర్కొన్న విధంగా 'నిజాయితీగా నమ్ముతూ' తీసుకున్న చర్యలను, నిర్ణయాలను న్యాయస్థానాలలో సవాలు చేసేందుకు కూడా వీలు లేదు.

## 2.పారిశ్రామిక సంబంధాల కోడ్

ట్రేడ్ యూనియన్ చట్టం - 1926, పారిశ్రామిక ఉపాధి (స్టాండింగ్ ఆర్డర్స్) చట్టం-1946, పారిశ్రామిక వివాదాల చట్టం-1947 మొదలైన వాటన్నిటిని పారిశ్రామిక సంబంధాల కోడ్‌గా 2020 సం॥లో 35వ చట్టంగా ముందుకు తెచ్చారు.

ఈ కోడ్ ప్రకారం స్థిర ఉద్యోగమనే దానికి కాలంచెల్లినట్లే. అన్ని ఉద్యోగాలూ తాత్కాలికం లేదా నిర్దిష్ట కాలానికి సంబంధించినవే! స్థిర ఉద్యోగుల స్థానాన్ని తాత్కాలిక, అనియత కార్మికుల ద్వారా అనేక ప్రాంతాలలో భర్తీచేస్తున్నారు కూడా. సీజనుల వారీగా పనులు వుండే ప్రాంతంలో నిర్దిష్ట కాలానికి సంబంధించిన ఉపాధిని ప్రవేశపెట్టారు. ఇది ఇప్పటికే అన్నిచోట్లా అనుసరిస్తున్నారు.

ఈ కోడ్ కూడా కాంట్రాక్టు కార్మికులను సంఘటిత పడేందుకు అనుమతించదు. ట్రేడ్ యూనియన్లలో చేరేందుకు అంగీకరించదు. కనుక, కాలక్రమంలో ట్రేడ్ యూనియన్లు అనేవి దుల్లిపోయి, యజమాని అనే వాడికి పనిగంటలు పెంచటానికి, ఎక్కువ పనిభారాన్ని మోపి, ఎక్కువ లాభార్జనకు స్వేచ్ఛ లభిస్తుంది.

సమ్మె అనేది కార్మికుల చేతిలో ప్రధాన ఆయుధంగా వుండేది. ఈ కోడ్ ద్వారా కార్మికుల సమ్మె హక్కును నిలిపి వేశారు. ఏ ఆందోళనలో నైనా 50శాతం కార్మికులు శలవుపై వెళితే అది సమ్మెగా పరిగణించటం జరుగుతుంది. కార్మికులు సమ్మె చేయతలపెడితే సమ్మె నోటీసుపై సెక్రటరీతోపాటు 5 గురు రిజిస్టర్డ్ ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు సంతకాలు చేయాలి. దీనిని యజమానికి, లేబర్ డిపార్టుమెంటుకు అందజేయాలి. సంప్రదింపుల సందర్భంలో సమ్మె పాటించరాదు. చర్చల ద్వారా వివాదం పరిష్కారం కాకపోతే, ఈ అంశాన్ని ట్రిబ్యునల్ లేదా కేంద్ర ట్రిబ్యునల్‌కు నివేదించాలి. అప్పుడు కూడా 60 రోజుల వరకూ సమ్మె చేయరాదు. నియామక వ్యక్తి ద్వారా చర్చల ప్రక్రియ జరిగితే, ఈ క్రమం ముగిసిన 60 రోజులలోపు సమ్మె చేపట్టరాదు. అలా సమ్మెలోకి వెళితే అది చట్ట విరుద్ధమౌతుంది.

గతంలో పారిశ్రామిక వివాద చట్టం ప్రకారం, ఏదైనా వివాదం తలెత్తితే, 3 సం॥ల కాల వ్యవధిలో వివాద పరిష్కారానికి వ్యాజ్యం కోరాలి. ఈ కాలవ్యవధిని ఈ కోడ్ 2 సం॥లకు తగ్గించింది. ఈ కోడ్ ప్రకారం కార్మిక న్యాయస్థానం, ట్రిబ్యునల్‌లలో న్యాయం కోరుతూ వ్యాజ్యాలు నడపటాన్ని రద్దుచేశారు.

గతంలో యాజమాన్యాలతో జరిగే చర్చలలో గుర్తింపు యూనియన్‌నే చర్చల ప్రతినిధిగా గుర్తించినా, అన్ని రిజిస్టర్డు యూనియన్‌లను చర్చలకు ఆహ్వానించేవారు. ఇప్పుడు, రిజిస్ట్రేషన్ కొరకు 100 మంది కార్మికులు, లేదా మొత్తం కార్మికుల్లో 10 శాతం మంది ఆమోదం తప్పనిసరి చేశారు. సభ్యత్వమే మొత్తం కార్మికుల్లో 10 శాతం కంటే తక్కువ వుంటే, ఇక చర్చలలో పాల్గొనే అవకాశమే లేదు.

ఇక, తొలగింపు లేదా మూసివేతల విషయంలో, గతంలో 300 లేదా అంతకు మించిన కార్మికులున్న పరిశ్రమలు ఈ నిర్ణయం ప్రకటించాలంటే, ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ఈ కోడ్‌లో ఈ సంఖ్యను 100కు కుదించారు. తొలగింపు లేదా మూసివేతల గాయం చేయటమే గాకుండా కొత్త నైపుణ్యాలను నేర్చుకోవటంద్వారా వేరే ఉద్యోగం చేయటానికి వీలుగా 'వర్కర్ రీ స్కిల్లింగ్ ఫండ్' అనే అందమైన పేరుతో 'పుండుపై కారం' చల్లారు.

తాత్కాలిక కార్మికులకు సామాజిక భద్రత, సంఘటితం అయ్యే అవకాశం వంటివి కనీసంగా వుండవు. స్థిర ఉద్యోగులపై విధించిన అనేకానేక నిబంధనలతో వారు ట్రేడ్ యూనియన్ నిర్వహించుకోవటం అసాధ్యంగా మారింది. బిజెపి నాయకత్వంలో కేంద్రప్రభుత్వంతోపాటుగా, అంతే తీవ్రతలో ఈ విధానాలను అనుసరిస్తున్న రాష్ట్రాల ప్రభుత్వాల దృక్పథమేమిటో స్పష్ట మౌతోంది.

## 3.సామాజిక భద్రతా కోడ్-2020

సామాజిక భద్రతకు సంబంధించి 1952 నుండి 1981 వరకు వున్న పలు చట్టాలను రద్దుచేసి వాని స్థానంలో 'సామాజిక భద్రతా కోడ్-2020'ని ముందుకు తెచ్చారు. కార్మికులు తమ సామాజిక భద్రత, సౌకర్యాలకోసం, హక్కులకోసం పోరాడి సాధించుకున్న దాదాపు అన్ని హక్కులనీ ఈ కోడ్ కబళించివేసింది.

సంఘటిత-అసంఘటిత, స్థిర-తాత్కాలిక, ప్రత్యక్ష-కాంట్రాక్టు కార్మికుల వృత్తిపరమైన, సామాజికమైన భద్రత గురించి ప్రభుత్వాలు గొప్పగా మాట్లాడుతున్నప్పటికీ, ఈ కోడ్ దీనికి పూర్తి విరుద్ధంగా వుంది. అసంఘటితరంగం లోని 40 కోట్లమంది కార్మికుల ప్రయోజనాల పరిరక్షణను నియత కార్మికుల భద్రతా పథకం నుండి మినహాయించారు. గిగ్ కార్మికులు, ప్లాట్‌ఫాం కార్మికులు, బట్వాడా కార్మికులు-వీరందరినీ 'వర్కింగ్ పార్టనర్' (పనిలో భాగస్వామి)గా పేర్కొన్నారు. ఈవిధంగా యజమానికి వీరిని కార్మికులుగా గుర్తించాల్సిన అవసరమేలేదు.

వేతనాల విషయంలో ప్రధాన యజమానికి జవాబుదారీతనం లేకుండా ఈ కోడ్ వారికి మినహాయింపు నిచ్చింది.

ఉద్యోగుల భవిష్యనిధి(ఇపిఎఫ్) అంశంలో -20 మంది కార్మికులు లేదా ఉద్యోగులు ఒక సంస్థలో పనిచేస్తుంటే, వారికి దీనిని వర్తింప జేయాల్సి వుంటుంది. దీనిని కనీసం 10 మందికి తగ్గించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తుండగా అది నెరవేరలేదు. యజమానులు 12 శాతం వాటా, కార్మికులు 12 శాతం వాటా ప్రతినెలా పిఎఫ్‌కు చెల్లించాలనే దానిని, ఈ కోడ్ యజమాని వాటాను 10 శాతానికి తగ్గించి వేసింది. యజమాని చెల్లించే 12 శాతంలో 8.33శాతం ఇపిఎకి బదిలీకాగా, పి.ఎఫ్.కు 3.67 శాతం చేరతాయి. ఈ కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత కార్మికుల ప్రయోజనం దెబ్బ తీస్తుందని ప్రత్యేకించి చెప్పుకోనవసరంలేదు.

### ఎంప్లాయిస్ స్టేట్ ఇన్స్యూరెన్స్(ఇఎస్ఐ)

ఇఎస్ఐలో యజమానులు దీనికింద తమ వాటాగా తప్పనిసరిగా 4.75 శాతం చెల్లించాల్సి వుండగా దానిని 3.25 శాతానికి, కార్మికుల వాటాను 1.75 శాతం నుండి 0.75 శాతానికి తగ్గించారు. ఫలితంగా కార్మికులకు ఈ పథకం క్రింద లభించే వైద్యసౌకర్యాలు ఇంకా క్షీణించి పోతాయి.

గ్రాట్యుటి సౌకర్యం పొందటానికి కార్మికుడు నిరంతరాయంగా ఐదు సం॥రాల కాలం ఒక సంస్థలో పనిచేసి వుండాలనేది నిబంధన. నిర్దిష్ట కాలపరిమితి కార్మికులైతే, వారి తొలగింపు సమయంలో నిష్పత్తి ప్రకారం లెక్కించి గ్రాట్యుటి అందిస్తారు.

భవన నిర్మాణ కార్మికులు, బీడీ కార్మికులు, గిగ్ కార్మికులు పూర్తిగా నిర్లక్ష్యం చేయబడ్డారు.

భవన నిర్మాణ కార్మికులకోసం సంక్షేమ బోర్డు ఏర్పరచాలని పేర్కొన్నా, గిగ్ కార్మికుల విషయంలో ప్రాణప్రమాదం, అనారోగ్యం, ప్రమాదం, ప్రసూతి సౌకర్యం, బిడ్డల హాస్టల్ వంటి అంశాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఒక నిధిని ఏర్పాటు చేసి ఆదుకుంటామని పేర్కొంటున్నారు. ఇవన్నీ ఆచరణలోకి రావనేది అందిరికీ తెల్సిందే.

## 4. పనిభద్రత, ఆరోగ్యం, పనిపరిస్థితుల కోడ్-2020

1951 నుండి 1986 నడుమ చేసిన దాదాపు 13 ప్రధాన కార్మిక చట్టాలను రద్దుచేసి ఈ కోడ్‌ను రూపొందించారు.

పనిస్వభావం, వాతావరణం ఫ్యాక్టరీ లేదా కర్మాగారం, గనులు, రేవులు, తోటలు, భవన నిర్మాణం, రవాణా మొదలుగాగల రంగాలు, విభాగాల లక్షణాలు ఏమైనప్పటికీ, వారందరికీ ఈ కోడ్ వర్తిస్తుందని చెబుతున్నారు. గతంలో పోరాడి సాధించుకున్న చట్టాలలోని కొరవలను పూర్తిచేసి వాటిని బలీయం చేయటానికి బదులుగా ఈ కోడ్‌ను ముందుకు తెచ్చారు.

ఒక ఫ్యాక్టరీ విద్యుత్ ఆధారంగా ఉత్పత్తి చేస్తున్నట్లయితే కనీసం 20మంది కార్మికులు, ఫ్యాక్టరీలో ఉత్పత్తికి విద్యుత్ అవసరం లేకుంటే కనీసం 40 మంది కార్మికులు వుంటే దానిని తయారీ యూనిట్‌గా పరిగణించి ఈ కోడ్ వర్తించటానికి అర్హమౌతుంది. ప్రస్తుత 50-70శాతం కార్మికులు/ఉద్యోగులు కాంట్రాక్టు ప్రాతిపదికపై పనిచేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఫలితంగా, ఉద్యోగభద్రత, పర్యావరణం, వైద్యం మొదలైనవి సంపూర్ణంగా నిర్లక్ష్యం చేయబడ్డాయి. ఒకవేళ 50 మందికంటే తక్కువమంది పనివారితో యజమాని తన ఉత్పత్తి చేసుకోగలిగితే, ఆ యూనిట్‌కు లైసెన్స్ కూడా తప్పనిసరి కాదు. అంటే మరో రూపంలో విచ్చలవిడి శ్రమదోపిడీ, లూటీకి లైసెన్స్ ఇవ్వడమే! 10 మంది కంటే తక్కువ వలస కార్మికులతో ఒకచోట పనిచేయిస్తుంటే, ఆ కార్మికుల వివరాలను కూడా నమోదు చేయాల్సిన అవసరంలేదు. గతంలో ఈ సంఖ్య 5గా వుండేది. వివిధ విభాగాలలో వృత్తి విరమణ, రాజీనామా సందర్భాలలో గతంలో ఇచ్చే 120 రోజులకు భిన్నంగా 30 రోజుల 'ఎర్నడ్ లీవ్' (ఆర్జిత శలవు)మొత్తమే వారికి లభిస్తుంది. కారణాలేమీ చూపకుండా కార్మికుడిని గతంలో తొలగిస్తే, 120 రోజుల వేతనం చెల్లించాల్సి వుండగా అది ఈ కోడ్‌లో 90 రోజుల వేతనానికి పరిమితం చేశారు.

## నాలుగు కోడ్‌ల ఉమ్మడి లక్ష్యాలు-కార్మికవర్గంపై దాని ప్రభావం

2023 జులై 1 నుండి దేశవ్యాపితంగా ఈ కోడ్‌లు అమలులోకి వస్తున్నట్లుగా ప్రకటించారు. కార్మికవర్గం గతంలో తమ అనేక వీరోచిత పోరాటాల ద్వారా భారత ప్రభుత్వ మెడలువంచి నిర్దిష్ట చట్టాలను అమలు చేయించు కున్నారు. గత కొంతకాలంగా, ఈ ప్రయత్నాలు బలహీనంగా సాగుతున్నాయి. అదే సమయంలో కార్మికవర్గాన్ని, ప్రజానీకాన్ని విభజించేందుకు మతతత్వ విషాన్ని వ్యాపింపచేస్తున్నారు. ఈ పరిస్థితులలో నయా ఉదారవాద నూతన ఆర్థిక విధానాలను 1991 నుండి మన దేశంలో ప్రవేశపెట్టి, ప్రపంచీకరణ పేరుతో వాటిని వేగిరపరిచి, మనదేశ మార్కెట్టును సామ్రాజ్య వాదుల ముందు బార్లా తెరిచారు. అంతేగాక, గతం నుండి అమలవుతూ వచ్చిన కార్మికుల, ఉద్యోగుల హక్కులన్నింటినీ అమలుచేయ నిరాకరిస్తున్నారు. పెట్టుబడిదారీ విధాన ప్రపంచవ్యాపిత సంక్షోభంలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ప్రధాన లక్ష్యం-కార్మికవర్గంపై అలవిమాలిన దోపిడీ పెనుభారాన్ని మోపటం ద్వారా ఈ సంక్షోభం నుండి గట్టెక్కడం.

ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం తమ నిరసన తెలుపుతోంది. ప్రస్తుత పాలకవర్గం అత్యంత అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ, మతతత్వాన్ని రుద్దుతూ, క్రూరమైన దాడులు సాగిస్తూ సామ్రాజ్యవాద, బడాపెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలను కాపాడుతోంది. మతతత్వాన్ని వ్యాప్తిచేసి, సరిహద్దులలో యుద్ధ తరహా వాతావరణాన్ని సృష్టించి, ఫాశిజం ప్రమాదాన్ని వాస్తవ రూపంలోకి మారుస్తున్నారు.

**కార్మికుల, ఉద్యోగుల హక్కులను కేవలం హరించివేయటమొక్కటే, ఈ నాలుగుకోడ్‌ల ప్రధాన దృష్టి కాదు; ప్రజాస్వామ్యాన్ని కాలరాచి వేస్తూ ఇంతకంటే మరింత పెద్దదిగా, లోతుగా రాజకీయార్థిక, సిద్ధాంతపరమైన లక్ష్యం దీని వెనుక వుంది.** ఈవిధంగా ఇది కార్మికుల, రైతుల, మధ్యతరగతి మరియు ఇతర ప్రజాస్వామిక ప్రజానీకమందరి పోరాటం. పరిమిత రూపంలో వున్న కనీస వెసులుబాట్లను, ప్రజాస్వామ్యాన్ని కూడా ధ్వంసం చేసే అడుగులే ఈ నూతన కోడ్‌లు. కనుక, ఫాశిజం ప్రమాదానికి వ్యతిరేకంగా కార్మికవర్గం తమ పోరాటాన్ని ముందుకు సాగించాలి. ప్రజా పోరాటాలకు వారు నాయకత్వం వహించాలి.

విస్తృత కార్మిక ప్రజానీకపు జీవన ప్రమాణాలు మరింతగా దిగజారిపోతున్నాయి. వారికి ఉపాధి అవకాశాలు తక్కువై ఆదాయ వనరులు కూడా తగ్గిపోతున్నాయి. సాంకేతిక నైపుణ్యాభివృద్ధిని కార్మికుల ప్రయోజనం కొరకు వినియోగించి వారి పనిగంటలను తగ్గించి, వారి జీవన ప్రమాణాలను పెంచి, వారికి సామాజిక భద్రతను కల్పించటానికి ఉపయోగించాల్సి వుండగా, అందుకు భిన్నంగా పెట్టుబడిదారీ వర్గం తమ సూపర్ లాభార్జనల కొరకే వినియోగిస్తోంది. పెట్టుబడిదారీవర్గం కార్మికుల జీవన ప్రమాణాలను ఎందుకు పెంచుతుంది?! అపరిమిత రిట్రెంచ్ మెంట్స్‌తో, ఎలాంటి ప్రతిఘటనా లేకుండా ఫ్యాక్టరీలను దాదాపు మూసివేసేందుకు యాజమాన్యాలకు అపరిమిత స్వేచ్ఛ లభించింది. కార్మికులు తమ పూర్వ గ్రామాలకు తిరిగి వెళ్ళి వ్యవసాయ పనులలోనో లేదా తమ మనుగడకు ఏమాత్రం తోడ్పాడునివ్వని చిన్నచిన్న కమతాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ కారణంగా కార్మికోద్యమం నగరాలు, పట్టణాలలో బలపడ లేకపోతోంది. మరోవైపున దేశ, విదేశీ పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసం పాలకులు భూములను గుంజుకునే చట్టాలను నిలువరించటంలో కార్మిక - రైతాంగ ఐక్య ఉద్యమాలు విజయం సాధించాయి. ఈ ఉదారవాద- ప్రైవేటీకరణ - గుత్తాధిపత్య యుగంలో సాగుతున్న దండయాత్రకు సమాధానంగా కేవలం న్యాయమైన, గౌరవప్రద వేతనాలకొరకు సాగించే స్వల్పకాల ఉద్యమాలు లేదా పనిగంటల తగ్గింపుకోసం సాగించే ఉద్యమాలు మాత్రమే సరిపోవు; అయితే, ఈ నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకోసం కార్మిక-రైతాంగ ఐక్య దీర్ఘకాల ప్రజా ప్రతిఘటన అవసరం. మనదేశంలో వ్యవసాయక విప్లవాన్ని ముందుకుగొని పోవటానికి కార్మికులకు ఒక ప్రత్యామ్నాయ జీవనాధారాన్ని, వ్యవసాయ-భూమి సంబంధాలలో వారి సమీకరణాన్ని గురించి ఆలోచించాలి.

**(2024 ఫిబ్రవరి 'క్లాస్‌స్ట్రగుల్'లో కామ్రేడ్ బినయ్‌రాయ్, సుజయ్‌రాయ్‌లు రాసిన వ్యాసానికి క్లుప్తంగా తెలుగు అనువాదమిది- సం)**


*Read !* *Subscribe!!*



**వర్గ్ సంఘర్ష్ కీ పుకార్**

*Hindi Organ of*
*Central Committee of CPI (ML)*

# ఫాసిస్టు పాలన దిశగా ప్రసార మాధ్యమాలపై పెరుగుతున్న బహుముఖ దాడులు

**భారతదేశంలో** ప్రచార ప్రసార మాధ్యమాలపై జరుగుతున్న దాడుల గురించి, మీడియా స్వేచ్ఛను హరించడం గురించి-ప్రజాస్వామిక శక్తుల నుండి ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రపంచ 'ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్'లో, 'రిపోర్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్' అందిస్తున్న వివరాల ప్రకారం భారతదేశ ప్రసార, ప్రచార మాధ్యమాల స్వేచ్ఛ యొక్క స్థానం క్రమంగా దిగజారి పోతున్నది. 2014లో 180 దేశాల జాబితాలో 140వ స్థానంలో ఉన్న భారతదేశం,2022 సం॥నికి 150వ స్థానానికి, 2023 సంవత్సరానికి 161వ స్థానానికి పడిపోయింది. 2014లో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం తమ విధానాలను విమర్శనాత్మకంగా విశ్లేషిస్తూ రాస్తున్న, మాట్లాడుతున్న, ప్రచారం చేస్తున్న, ప్రసారం చేస్తున్న, ప్రచురిస్తున్న ఆయా వ్యక్తులను, సంస్థలను లక్ష్యంగా చేసుకొని దాడులు సాగిస్తూ, వారిపై ఉపా, దేశద్రోహం మొదలగు చట్టాల కింద కేసులు నమోదు చేసి నిర్బంధిస్తూ, మీడియా స్వేచ్ఛను కాలరాచి వేస్తూ వస్తోంది.

## న్యూస్ క్లిక్‌పై దాడి

ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న 'న్యూస్ క్లిక్' అనే న్యూస్ వెబ్ పోర్టల్-వార్తలు, వ్యాఖ్యానాలను ప్రసారం చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా చైనా అనుకూల ప్రచారానికి గాను అమెరికాకు చెందిన నెవిల్లేరాయి సింగం అనే వ్యాపారవేత్త నిధులు సమకూరుస్తున్నాడని, అందులో భాగంగా న్యూస్‌క్లిక్‌కు నిధులు సమకూర్చాడని గతంలో న్యూయార్క్ టైమ్స్ పత్రిక రిపోర్టు చేసింది. ఆ రిపోర్టు ఆధారంగా న్యూస్‌క్లిక్‌పై భారత ప్రభుత్వం 2023 ఆగస్టు 15న ఒక కేసు నమోదు చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరియు ఢిల్లీ పోలీసులు న్యూస్ క్లిక్‌పై దాడులు సాగించారు. అక్టోబర్ మూడవ తేదీన న్యూస్ క్లిక్ ఆఫీసుపై, అందులో పని చేస్తున్న పాత్రికేయుల, ఉద్యోగుల ఇండ్లపై దాడి చేశారు. ఈ దర్యాప్తులో భాగంగా నంటూ పాత్రికేయుల లాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్స్, హార్డ్ డిస్క్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లాప్‌టాప్‌లలో, హార్డ్ డిస్క్‌లలో పాత్రికేయులు సేకరించుకున్న అనేక విషయాలు, సమాచారం ఉన్నాయి. న్యూస్ క్లిక్‌లో పనిచేస్తున్న సోహెల్ రష్మీ అనే చరిత్రకారుడు తను గత దశాబ్దకాలంగా సేకరించిన చరిత్రకు సంబంధించిన అనేక విషయాలు, పోలీసులు స్వాధీనం చేసుకున్న హార్డ్ డిస్క్‌లో ఉండిపోయాయని చెప్పాడు. దాడుల అనంతరం న్యూస్ క్లిక్ వ్యవస్థాపకుడు, సంపాదకుడు అయినా ప్రబీర్ పురకాయస్థను, ఆ సంస్థ మానవ వనరుల శాఖ అధిపతి అమిత్ చక్రవర్తిని-చైనా అనుకూల ప్రచారానికి నిధులు తీసుకుంటున్నారనే ఆరోపణపై ఉపా చట్టం కింద అరెస్టు చేశారు.

## బి బి సి పై వేధింపులు

2002లో నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో చేసిన మారణకాండను గూర్చి, ఆ తరువాత కాలంలో మోడీ పరిపాలన విధానాలను గురించి, ఇటీవల కాలంలో బిబిసి ఒక డాక్యుమెంటరీని రూపొందించి, ప్రసారం చేసి, మోడీ నిజస్వరూపాన్ని బహిర్గతం చేసింది. దాంతో బిబిసిపై కక్ష కట్టిన మోడీ ప్రభుత్వం, బీబీసీకి చెందిన ఢిల్లీ,బొంబాయి ఆఫీసులపై దాడులు సాగించింది. ఆ డాక్యుమెంటరీని ఇండియాలో ప్రసారం చేయకుండా నిషేధించింది. బి బి సి, దైనిక్ భాస్కర్ సంస్థలపై-ఆదాయపు పన్ను చట్టం క్రింద, ఎన్ డి టీవీ, న్యూస్ క్లిక్ సంస్థలపై అవినీతి డబ్బును చట్టబద్ధంగా మార్చే అక్రమాలకు పాల్పడ్డారనే (మనీ లాండరింగ్) చట్టం కింద కేసులు నమోదు చేసింది. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా, సోషల్ మీడియా సంస్థలన్నింటిని తన అదుపు ఆజ్ఞలలో పెట్టుకుని, తమ ప్రచార బాకాలుగా మార్చాలనుకుంటున్నది. అందుకోసం మీడియా సంస్థలపై తీవ్రమైన ఒత్తిడిని తెస్తోంది. ప్రతి సంస్థను లొంగదీసుకోవడానికి చేస్తున్న దాడులే ఇవి.

ఎంతోకొంత నిష్పాక్షికంగా వార్తలను ప్రసారం చేసే ఎన్ డి టీవీ ని మోడీ అనుకూల ఆదాని గ్రూపు కొనివేసింది. ప్రజా అనుకూల ధోరణి గల ప్రఖ్యాత పాత్రికేయుడు రమేష్ కుమార్ ఎన్డీటీవీలోనే పనిచేస్తున్నాడు. ఎన్‌డిటీవీని అదాని గ్రూప్ కొనివేసిన వెంటనే ఆయన తన ఉద్యోగానికి రాజీనామా సమర్పించాడు. ఆ సందర్భంగా ఆయన ఒక బహిరంగ లేఖ రాస్తూ "భారత జర్నలిజంలో స్వర్ణ యుగం అనబడేదేదీ లేదు. కానీ పరిస్థితి ఇవాళ ఉన్నంత ఘోరంగా మున్నెన్నడూ లేదు. జర్నలిజంలోని ప్రతి ఒక్క మంచి అంశాన్ని వేగంగా ధ్వంసం చేస్తున్నారు. ఇది ఊహించినదే, కానీ ఇవాళ వాస్తవంగా నడుస్తున్నది జర్నలిజంలో చీకటి యుగం. దేశంలో లెక్కలేనన్ని వార్తా సంస్థలు ఉన్నాయి, కానీ అన్నిటికన్నీ నీతి తప్పి ఉన్నాయి. మన ప్రచార మాధ్యమాల పర్యావరణమే కూలిపోయి ధ్వంసం అయిపోయి ఉన్నది" అని వాపోయారు.

## విలేఖరులపై పెరిగిన భౌతిక దాడులు

స్వతంత్ర జర్నలిస్టులపైన, రచయితలపైన కూడా దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. 2010లో ఒక సంస్థ కాశ్మీర్‌పై నిర్వహించిన సదస్సులో మాట్లాడినందుకుగాను ప్రఖ్యాత రచయిత్రి, సామాజిక కార్యకర్త అరుంధతిరాయ్‌పై ఇప్పుడు కేసు నమోదు చేశారు. అరుంధతి రాయ్ మోడీ ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శిస్తూ మాట్లాడటం, వ్రాస్తూ ఉండడమే దీనికి అసలు కారణం. ఈ విధంగా దర్యాప్తు సంస్థలకు పూర్తి అధికారాల నిచ్చి పాత్రికేయుల పైకి ఉసిగొలుపుతున్నారు.

వివిధ అంతర్జాతీయ సంస్థలు భారత దేశంలో పత్రికా స్వాతంత్ర్యాన్ని అధ్యయనం చేసి, రిపోర్టులు తయారుచేసి, పత్రికా స్వాతంత్ర్యాన్ని ఉల్లంఘించిన సంఘటనలను నమోదు చేశాయి. "ఇంటర్నేషనల్ ప్రెస్ ఇన్‌స్టిట్యూట్" అనే సంస్థ ఇచ్చిన సమాచారం ప్రకారం, 2022 ఏప్రిల్ నుండి సెప్టెంబర్‌ల మధ్య ఆరు నెలల కాలంలో భారతదేశంలో పత్రికా స్వాతంత్ర్యాన్ని ఉల్లంఘించిన 83 సంఘటనలు జరిగాయి. 'వాచ్ ద స్టేట్' సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం 2019 మే నుండి 2021 ఆగస్టు వరకు పాత్రికేయులపై 256 సార్లు దాడులు జరిగాయి. 'రైట్స్ అండ్ రిస్క్స్ ఎనాలసిస్ గ్రూప్' అనే సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం 2022లో 194 మంది పాత్రికేయులపై దాడులు జరిగాయి. అంతేగాక ఎక్కువసార్లు ఇంటర్నెట్‌ని, వివిధ ఛానళ్లను నిషేధించడం, పాత్రికేయులపై కేసులు పెట్టడం, హత్యలు గావించడం మొదలగు సంఘటనలు జరిగాయి. పాత్రికేయులపై దాడులకు పాల్పడిన వారిలో ప్రధానంగా ప్రభుత్వేతర సంస్థలు, నేరస్తులు, సాయిధ గ్రూపులు ఉన్నాయి.

ప్రసార మాధ్యమాలు హిందూ జాతీయ వాదానికి అనుకూలంగా పనిచేయాలని ప్రభుత్వం నుండి తీవ్ర ఒత్తిడి పెరిగిందని, బిజెపి పాలిత రాష్ట్రాలు, జమ్మూకాశ్మీర్, ఢిల్లీలలో పోలీసులు ఎక్కువగా హక్కుల ఉల్లంఘనలకు పాల్పడ్డారని, పోలీసులు కేంద్ర హోం శాఖతో ప్రత్యక్షంగా సంబంధం కలిగి ఉన్నారని ఈ నివేదికలు పేర్కొన్నాయి. కోవిడ్-19 కాలంలో పాత్రికేయులు వార్తా ప్రచురణకు ముందస్తుగా ప్రభుత్వ అనుమతిని పొందాల్సి వచ్చిందని, వాస్తవాలను రిపోర్ట్ చేయడానికి కూడా అవకాశం లేకుండా చేశారని,పుకారులను ప్రచారం చేస్తున్నారంటూ

పాత్రికేయులను వేధించారని ఈ నివేదికలలో తెలిపారు. పాత్రికేయులలో కొందరిపై ఊపా కేసులను బనాయించి జైళ్లలో నిర్బంధించారని, మరి కొంతమందిని జర్నలిజంలో వారికి లభించిన ప్రతిష్ఠాత్మక అవార్డులను విదేశాలకు వెళ్లి స్వీకరించకుండా అడ్డుకున్నారని తెలిపారు. హత్రాస్ అత్యాచారం కేసును విచారించడానికి వెళ్లిన సిద్దిక్ కప్పన్ రెండు సంవత్సరాలకు పైగా ఊపా కేసులో జైల్లో మగ్గాడు. ఇప్పటికీ అతనిపై ఆ కేసు అలాగే ఉంది. బీహార్ రాష్ట్రం–బెగుసరాయి జిల్లా, సుకో గ్రామంలో సుభాష్ కుమార్ మహతో అనే పాత్రికేయుడ్ని అక్రమ ఇసుక తవ్వకాల లోగుట్టు రిపోర్టు చేసినందుకు గాను అతని ఇంటి సమీపంలోనే కాల్చి చంపేశారు. మహారాష్ట్ర–రత్నగిరి జిల్లాలో అక్రమ రిఫైనరీల నిర్మాణం గూర్చి బహిర్గతం చేసినందుకుగాను శశికాంత్ వారేశ్ అనే పాత్రికేయుడుని కారుతో గుద్దించి చంపేశారు.

"ద్వేషపూరితంగా, విమర్శనాత్మకంగా" వార్తలను రాస్తున్నదంటు వనెస్సా డాగ్ నాక్ అనే ఫ్రెంచ్ మహిళా జర్నలిస్టును, అధికారులు బెదిరింపులకు గురి చేయడమే కాక దేశం నుండి బహిష్కరిస్తామని హెచ్చరించడంతో ఆమె తానే ఇండియాను వదిలి వెళతానని ప్రకటించింది. గత 23 సంవత్సరాలుగా ఆమె ఇండియా నుండి పలు ప్రముఖ అంతర్జాతీయ పత్రికలకు కాంట్రిబ్యూటర్‌గా వ్యవహరిస్తున్నారు. జాతీయ ప్రయోజనాలకు ఆమె సాగిస్తున్న రచనలు హానికరంగా ఉన్నాయని దేశీయాంగ శాఖ ఆమెకు అందజేసిన నోటీసులో పేర్కొనడం, పత్రికా స్వేచ్ఛను తమ చిత్తానుసారం కాలరాసే ప్రభుత్వ విధానాలను వెల్లడిజేస్తోంది.

సినిమా థియేటర్లో జాతీయ గీతం వచ్చే టప్పుడు నిలబడలేదని, ఫేస్‌బుక్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్టూన్ పోస్టు చేశారనే చిన్న చిన్న విషయాలపై కూడా ఊపా చట్టం క్రింద, దేశ ద్రోహ చట్టం క్రింద(సుప్రీంకోర్టు ఈ సెక్షన్ క్రింద కేసులు నమోదు చేయవద్దని తీర్పునిచ్చినప్పటికీ) కేసులు నమోదు చేస్తూ ఉన్నారు. ఇది ఇలా ఉండగా భారతదేశంలో జరుగుతున్న నేరాలను నమోదు చేసే జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) 2014 తర్వాత కాలంలో పాత్రికేయులపై జరిగిన దాడులకు సంబంధించిన గణాంకాలను నమోదు చేయడమే నిలిపివేసింది.

## పత్రికా స్వేచ్ఛపై చట్టపరంగా పెరిగిన దాడులు

2023 లో కేంద్ర ప్రభుత్వం 1867నాటి 'ప్రెస్ రిజిస్ట్రేషన్' చట్టానికి సవరణ తెచ్చింది. జన విశ్వాస్(అమెండ్మెంట్ అండ్ ప్రొవిజన్స్), ప్రెస్ అండ్ పిరియాడికల్స్ రిజిస్ట్రేషన్ చట్టం–2023ను, 2023 సెప్టెంబర్ ఒకటవ తేదీ నుండి అమలులోకి తెచ్చింది. దీనితో ప్రెస్ రిజిస్ట్రార్ అధికారాలను మరింత విస్తరించింది. ఒకప్పుడు కేవలం పత్రికల ప్రచురణలకు అనుమతులు మాత్రమే ఇచ్చే పరిస్థితి నుంచి, పత్రికల ప్రచురణలను సస్పెండ్ చేయడం, అవసరమైతే పత్రికల రిజిస్ట్రేషన్‌లను రద్దుచేసే అధికారాల వరకు రిజిస్ట్రార్‌కు కట్టబెట్టింది. ప్రెస్ రిజిస్ట్రార్ తన అధికారాలను సిబిఐ, ఇ డి లాంటి విచారణ సంస్థలకు బదిలీచేసే విధంగాను, లేదా చట్ట వ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొన్న వారి పేరిట ఉన్న ప్రెస్ రిజిస్ట్రేషన్‌లను రద్దుచేసే అధికారాలు కల్పించటం, పత్రిక కార్యాలయాల్లో ప్రవేశించి కోరిన సమాచారాన్ని అధికార యంత్రాంగం రాబట్టుకునే అధికారాన్ని చట్టబద్ధం చేయడం వంటి ప్రమాదకర చట్ట సవరణలు ఉన్నాయి. భవిష్యత్తులో దీని కోరలకు మరింత పదును పెట్టే అవకాశం ఉంది.

2023 డిసెంబర్లో కేంద్ర ప్రభుత్వం 'భారత్ పోస్ట్ ఆఫీస్ యాక్ట్ –1898'కి మరో ప్రమాదకరమైన సవరణ చేసింది. దీని ప్రకారం నిర్దిష్టంగా నిర్వచించని 'అత్యవసర పరిస్థితులలో' పౌరులకు వచ్చిన ఉత్తరాలను తెరిచే హక్కు, వాటిని అందజేయకుండా ఆపే హక్కులను "నిర్ణయించిన" అధికారులకు దఖలు పరుస్తూ ఈ చట్ట సవరణ జరిగింది. దీనికి విధి విధానాలను చట్టంలో పేర్కొనలేదు. ఈ విధంగా పౌరుల గోప్యతకు భంగం కలిగించిన అధికారులను శిక్షించే వీలు లేకుండా ఈ చట్ట సవరణ చేశారు. ఇప్పటికే 2023 అక్టోబర్ నెలలో ప్రసిద్ధ సెల్ ఫోన్ కంపెనీ యాపిల్, భారత్‌లోని అనేకమంది ప్రముఖ రాజకీయ నాయకుల, విలేకరుల ఖాతాలపై ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే తమ సంస్థల ద్వారా దాడులు జరిగాయని పేర్కొంది. ఇజ్రాయిల్ సహకారంతో కేంద్ర ప్రభుత్వం పొందిన పెగాసెస్ సాఫ్ట్ వేర్‌ను–ఫోన్లు, లాప్ టాప్ లలో చొరపెట్టి అక్రమ కేసులు పెట్టిన సంగతి భీమా కోరేగావ్ కేసులో బయటపడింది కూడా.

భారతదేశంలోని ప్రచార, ప్రసార, పత్రిక స్వేచ్ఛలు ఎంత దారుణంగా ఉన్నాయో పై విషయాలు స్పష్టం చేస్తున్నాయి. హిందూ మతతత్వాన్ని పెంచి పోషిస్తూ మత ఉద్రేకాల మాటున సంపన్నులకు, విదేశీ సామ్రాజ్య వాదులకు, దేశీయ దళారులకు, కార్పొరేట్లకు భౌతిక మానవ శ్రమ వనరులను బిజెపి ప్రభుత్వం అప్పనంగా కట్టబెడుతోంది. దానిని ప్రశ్నించే ప్రతి గొంతును నులమాలని చూస్తున్నది. పైన పేర్కొన్నవన్నీ దానికి ఉదాహరణలే. అందుకోసం అసత్యాలను, అర్థసత్యాలను, వక్రీకరణలను ప్రచారం చేస్తూ ప్రజల మధ్య దూరాన్ని, వైషమ్యాలను పెంచుతూ రాజకీయ లబ్ధిని సాధించి, తమ మతతత్వ, సామ్రాజ్యవాద అనుకూల, ఫాసిస్టు ఎజెండాను ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నది. ఇలాంటి మోడీ ప్రభుత్వ నిరంకుశ విధానాలను అడ్డుకోవడానికి అందరూ ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది. ★

---

**(21వ పేజీ నుండి)**

ఏమాత్రం పరిగణలోకి తీసుకోవటంలేదు. దేశ వ్యవహారాలపై నియమించబడిన పార్లమెంటరీ స్థాయీసంఘం బిఎన్ఎస్‌లోని 106(2)సెక్షన్‌ను పునఃపరిశీలించాలని చేసిన సిఫార్సును కూడా ప్రభుత్వం పరిగణలోకి తీసుకోలేదు. బిజెపి పాక్షికత్వంతో కార్మికవర్గానికి వ్యతిరేకంగా ఈ సందర్భంలో డ్రైవర్లకు వ్యతిరేకంగా తిరుగులేని దురభిమానాన్ని ప్రదర్శించింది.

ట్రక్కు డ్రైవర్లు, బస్‌డ్రైవర్లు, అన్ని ట్యాంకర్ల డ్రైవర్లందరూ నిరసన ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించి, రాజస్థాన్, మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకాశ్మీర్, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల లోని పలు ప్రాంతాల్లో రహదార్లను దిగ్బంధించిన తర్వాత కూడా, అఖిలభారత రవాణా సంస్థల నాయకత్వం, ఈ నూతన నిబంధనలకు వ్యతిరేకంగా తమ నిరసన తెల్పిన తర్వాత కూడా, ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్టు కాంగ్రెస్ (ఏఐఎమ్‌టిసి) దేశ వ్యవహారాల మంత్రిత్వ శాఖను కలిసి చర్చించిన తర్వాత కూడా, ప్రభుత్వం బిఎన్ఎస్‌లోని సెక్షన్లు 106(1), 106(2)లను రద్దుచేసేందుకు సూచనాత్మకంగా కూడా వ్యవహరించకుండా, తన వర్గ స్వభావాన్ని రుజువుచేసుకుంది.

మోటారు వాహన డ్రైవర్ల భవిష్యత్తు మరింత అగాధంలోకి కుంగిపోతుండగా, సాంప్రదాయ కార్మికోద్యమం నిరాసక్త ప్రేక్షకుని వలె నిలిచి, ఈ అంశాన్ని చేపట్టేందుకు సిద్ధం కాకపోవటం–కార్మికుల సమస్యలపై పోరాడి వాటిని పరిరక్షించేందుకు ముందుకురాని దాని అశక్త పరిస్థితిని తన కర్తవ్యాన్ని రద్దుచేసు కోవటాన్ని తెలుపుతోంది. డ్రైవర్ల ఈ అంశాన్ని చేపట్టే కర్తవ్యాన్ని కార్మికవర్గ ఉద్యమం భుజాలపై ఎత్తుకొని, ప్రధాని మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వ క్రూరమైన కార్మిక వ్యతిరేక దృక్పథాన్ని, విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉద్యమించాలి.

**(2024 ఫిబ్రవరి 'క్లాస్‌స్ట్రగుల్' నుండి అనువాదం)** ★

# భారతీయ న్యాయసంహిత(బిఎన్ఎస్)ద్వారా మోటారు వాహన డ్రైవర్లపై అదనపు నేరభారాన్ని మోపుతున్న బిజెపి

**మన** దేశంలో బ్రిటిష్ వలసకాలం నాటినుండి రోడ్డు ప్రమాదాలకు వాస్తవ కారణా లేమిటనే దానితో సంబంధం లేకుండా రోడ్డు ప్రమాదాలకు వాహనాల డ్రైవర్లనే బాధ్యులుగా చూపుతూ, వారి దుందుడుకు, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగానే ఈ ప్రమాదాలన్నీ చోటుచేసు కుంటున్నట్లు చూపుతున్నారు. రోడ్డు ప్రమాదాల పట్ల ఈ విధమైన అవాస్తవిక, అశాస్త్రీయ దృష్టితో, డ్రైవర్లకు జైలుశిక్షలు విధించటం, జరిమానాలు విధించటం లేదా రెండింటితోనూ శిక్షించటం జరుగుతూవస్తోంది. ప్రత్యేకించి భారీ మోటారు వాహనాల డ్రైవర్లు దుర్బలశ్రేణిగా వుండి రహదార్ల వినియోగదారులకు, పోలీసులకు సులభతరమైన లక్ష్యంగా వున్నారు. భారీ మోటారు వాహన డ్రైవర్లను దోషులుగా భావిస్తున్నారు. నిర్దిష్ట మోటారు వాహన డ్రైవరు దుందుడుకుగా, నిర్లక్ష్యంగా ఏవిధంగా వాహనాన్ని నడిపాడో తేల్చవలసిన బాధ్యత పోలీసులపై వున్నప్పటికీ, దీనిని రుజువుపరచకుండానే, విచక్షణారహితంగా భారీ మోటారు వాహన డ్రైవర్లను బాధితులుగా చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలలో చిక్కుకున్న వాహనాల స్థితిగతులను, రోడ్డు ప్రమాద కారణాలను నిర్ణయించటంలో కీలకపాత్ర పోషించాల్సిన మోటారు వాహన తనిఖీ అధికారులు కూడా, వారి పాత్రను సక్రమంగా పోషించకుండా, రోడ్డు ప్రమాదంలో చిక్కుకున్న వాహనాలను కనీసం తనిఖీ కూడా చేయకుండానే, ఈ ప్రమాదానికి యాంత్రిక సంబంధ వైఫల్యమే కారణాలు కావన్నట్లుగా సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. పోలీసుల, మోటారు రవాణాశాఖల ఈ యాంత్రిక, యధాలాప దృక్పధం కారణంగా, తరచుగా ఈ వాహనాల ప్రమాదాలలో చిక్కుకున్న డ్రైవర్లు, బాధితులుగా మిగులుతున్నారు. పైగా తమ కేసులను కోర్టులలో వాదించుకోవటానికి, నైపుణ్యంగల న్యాయవాదులను ఏర్పరుచు కోవటానికి వారి పేదరికం, అశక్తత, ఆర్థిక స్థోమత సహకరించకపోవటం వారిని మరింత దుర్బలురను చేస్తోంది.

వాస్తవానికి, ఈ ప్రమాదాలన్నింటిలోనూ వాహన డ్రైవర్ల దుడుకు డ్రైవింగ్ మాత్రమే కారణం కాదు. రహదారుల నిర్మాణంలో అపసవ్యతలు, రహదార్ల దుస్థితి, అననుకూల వాతావరణ పరిస్థితులు, రహదారుల వర్గీకరణలోపం, ట్రాఫిక్ నియమ నిబంధనలను ప్రమాదాలలో చిక్కుకున్న పాదచారులు, సైకిల్ వాహకులు, ఇతర చిన్న వాహన డ్రైవర్లు పాటించకపోవటం, యాంత్రిక వైఫల్యం, మద్యం సేవించిన స్థితి, మానసికస్థితి సరిగా లేకపోవటం వంటి పరిస్థితులలో ప్రమాదాల బారినపడటం వంటివన్నీ పరిశీలన చేయాల్సి వుంది. ఈ మొత్తం పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండానే, చాలా తరచుగా భారీ మోటారు వాహన డ్రైవర్లను చాలా తేలిగ్గా నిందార్హులుగా నిలుపుతున్నారు.

ప్రభుత్వ ఆధ్వర్యంలోని రాష్ట్ర రోడ్డురవాణా కార్పొరేషన్లు లేదా అర్థ-ప్రభుత్వ రవాణా కార్పొరేషన్ల యాజమాన్యాలు కూడా, ప్రమాదాలలో చిక్కుకున్న వాహన డ్రైవరు ఏవిధంగానూ ఈ ప్రమాదానికి జవాబుదారీ కాకపోయినప్పటికీ, ఈ ప్రమాదం జరగటానికి దారితీసిన పరిస్థితులు, చుట్టూతా వున్న పరిణామాలు ఏవీ అతను అదుపుచేయ గలిగినవిగా లేకపోయినప్పటికీ - అతనిని ఉద్యోగం నుండి తొలగించటంతో సహా వారికి భారీశిక్షలు విధిస్తూ అన్యాయంగా వ్యవహ రిస్తున్నాయి. ఈ విధంగా యాజమాన్యం అస్పష్టమైన, సాధారణీకరించిన 'వి12' ఇంజనుగా చెప్పబడే దానిని కనుగొని, డ్రైవరు వైపునుండి ముందుగా గమనించలేకపోవటం లోపమనే దానితో, ఆయా సంస్థల బస్ డ్రైవర్లను అంతర్గత లేదా శాఖాపర విచారణలనబడే వాటిని నిర్వహించి శిక్షించటమనేది - అపహాస్యమేగాక, న్యాయసూత్రాలను, సహజ న్యాయాన్ని ఉల్లం ఘించటమే; అంతేగాక, డ్రైవర్లపై అక్రమంగా, దురభిప్రాయంతో వ్యవహరించటమే! దుందుడుకు, నిర్లక్ష్య డ్రైవింగ్ చేస్తున్నట్లు ఏలాంటి ఫోరెన్సిక్ సాక్ష్యం లేదా అవసరమైన శాస్త్రీయ దర్యాప్తు లేకుండానే 1988 నాటి మోటారు వాహన చట్టం, మోటారు వాహనాల (డ్రైవింగ్) నియంత్రణలు-2017 ప్రకారం ప్రమాదాలలో చిక్కుకున్న డ్రైవర్లు చాలాతరచుగా బలిపశు వులవుతూ అన్యాయంగా శిక్షించబడుతున్నారు.

మోటారు వాహన డ్రైవర్లు ఎదుర్కొంటున్న అన్యాయమైన పరిస్థితులు, అననుకూల నేపధ్యంలో, ప్రభుత్వం సంబంధిత చట్టాలలో సవరణలు చేయటం ద్వారా తాము బాధితులుగా మారటాన్ని తొలగించి, తమ పరిస్థితులను మెరుగు చేస్తుందని మోటారు వాహన డ్రైవర్లు ఆశిస్తూ వున్నారు. కాలం చెల్లిన, వలసవాద ఐపిసిని ఇప్పటి పరిస్థితులకు తగినట్లుగా మార్పుచేసి, వాటిని క్రోడీకరిస్తామని బిజెపి ప్రభుత్వం ప్రకటించినప్పుడు, ఈ నూతన శిక్షాస్మృతి ప్రమాదాల సందర్భంగా తమ 'నేరపూరిత జవాబుదారీతనాన్ని' న్యాయబద్ధంగా పరిష్కరిస్తుందని, 'దుందుడుకు లేదా నిర్లక్ష్య' డ్రైవింగ్, దండనీయ మానవహత్య లాగా కాకుండా, బడాపారిశ్రామిక వ్యవస్థల యాజమాన్యంతో సమానంగా వ్యవహరిస్తుందని భావించారు. భారీ పారిశ్రామిక యాజమాన్యాల పనిప్రదేశాలలో తయారీ కార్యక్రమాల నిర్వహణలో వారి నిర్లక్ష్యం కారణంగా చోటు చేసుకునే భయంకర ప్రమాదాలు, కార్మికులతో పాటు పౌరులను కూడా బలిగొన్నప్పటికీ, అక్కడ శిక్షలను చాలా పెద్దస్థాయిలో తగ్గించి వేశారు; వారిని కనీసం న్యాయస్థానాలలో విచారణ కూడా చేయటంలేదు.

అయితే, బిజెపి ప్రభుత్వం తన కార్మిక, ప్రజావ్యతిరేక దోపిడీవర్గ స్వభావానికి కట్టుబడి భారతీయ న్యాయసంహిత (బిఎన్ఎస్) అనే అమలుచేయటానికి సిద్ధంగా వున్న 'స్మృతి'లో డ్రైవర్లపై అదనపు నేరపూరిత జవాబుదారీతనాన్ని మోపటమేగాక, ప్రమాదాలకు సంబంధించిన శిక్షా విధానాలను మరింత కఠినతరంగా, అన్యాయంగా మార్చివేసింది. ఈ నూతన కోడ్‌లోని 106వ సెక్షను ప్రకారం-గతంలోనున్న 2 సం॥ల శిక్షను ఐదు సంవత్సరాలకు; ప్రమాదాల సందర్భంగా రిపోర్టు చేయని డ్రైవర్లకు పది సం॥రాల వరకు కారాగార శిక్ష, 10 లక్షల రూ॥ల భారీ మొత్తంలో జరిమానా లేదా ఈ రెంటినీ విధించే విధంగా కఠినతరం చేసింది.

వాస్తవమేమంటే, ప్రమాదం జరిగిన సమయంలో డ్రైవరు దాడిని ఎదుర్కోవలసిన స్థితిలో వుండి ఆత్మరక్షణకోసం, అక్కడ నుండి తప్పించుకొని పారిపోవటంతో సంబంధిత అధికారులకు సమాచారం అందించేందుకు ఏవిధమైన అవకాశం వుండదనే అంశాన్ని, అధికార యంత్రాంగం ఆలోచించటంలేదు. అరకొరగా వేతనాలు మాత్రమే అందుకొంటూ అంత పెద్దమొత్తంలో జరిమానాలను కట్టలేని డ్రైవర్లపై కఠినాతి కఠినమైన శిక్షలు విధించాలని నిర్ణయించే సమయంలో వారి దయనీయ స్థితిని

**(తరువాయి 20వ పేజీలో)**

సంస్మరించుకుందాం

# దక్షిణ భారత దేశంలో కమ్యూనిజం పథకర్త కా॥సింగారవేలు

కొమరయ్య

**దక్షిణ** భారతదేశంలో మొదటి కమ్యూనిస్టుగా కమ్యూనిజం స్థాపకునిగా కా॥సింగారవేలును పరిగణిస్తారు. ఆయన తన జీవితకాలంలో సాగించిన ముమ్మరమైన కార్యక్రమాలు, కృషి-కార్మికవర్గ రాజకీయాలలోనూ, కమ్యూనిస్టు విప్లవ కృషిలోనూ నిమగ్నమై వున్న వారందరికీ నిరంతర స్ఫూర్తిదాయకంగా వుంటుంది. ఆయన కార్మికవర్గ పోరాటాలలో, కాంగ్రెస్ పార్టీలో, ఆత్మగౌరవ ఉద్యమంలో, పౌర సంబంధ విషయాలతోపాటు తన కార్యక్రమాల అన్ని పార్శ్వాలలోనూ కమ్యూనిస్టు భావాల ముద్రపడే విధంగా కృషిని సాగించటం ప్రత్యేకించి ప్రాధాన్యత కలిగిన విషయం.

1860, ఫిబ్రవరి 18న మద్రాసులోని ఓ సంపన్న మత్స్యకార కుటుంబంలో సింగారవేలు జన్మించారు. ఆయన తన డిగ్రీని, న్యాయవాద విద్యను పూర్తిచేసి, మద్రాసు హైకోర్టు న్యాయవాదిగా తన జీవితాన్ని ప్రారంభించారు.

ఆయన న్యాయవాది కాకమునుపు, 1902లో తన కుటుంబ వ్యాపార పనులలో భాగంగా ఆయన ఇంగ్లండు సందర్శించి, 6 నెలల పైగా కాలం అక్కడే గడిపారు. ఆయన లండన్‌లో వున్న కాలంలో ప్రపంచ బుద్ధిస్టుల మహాసభకు హాజరయ్యారు. బుద్ధిజమ్ పట్ల సింగారవేలు ఆసక్తి, ఇంకా విదేశాల పర్యటనలు -హిందువులలో హిందూ సమాజంలో సాంప్రదాయ భావ ప్రచారకుల మూఢభావాలను ప్రశ్నించటానికి అవకాశం కల్పించాయి.

కాంగ్రెస్ అతివాద నాయకులుగా పేరు గాంచిన వారిలో ఒకరైన తమిళ కవి సుబ్రమణ్య భారతితో సింగారవేలుకు సంబంధాలున్నాయి. వీరంతా బాలగంగాధర తిలక్ అనుయాయులుగా వుంటూ, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మరింత సమరశీల ఉద్యమాలు సాగించాలనే ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహిస్తారు. వీరు 1905లో రష్యాలో జరిగిన విప్లవ వార్తలతో స్ఫూర్తిని పొందారు. ఈ సమూహంతోపాటుగా 1907లో జరిగిన అఖిలభారత జాతీయ కాంగ్రెస్‌యొక్క సూరత్ మహాసభకు సింగారవేలు హాజరయ్యారు.

1914లో సామ్రాజ్యవాద ప్రపంచయుద్ధం బ్రద్దలవటం, ప్రజానీకపు సమస్యలను తీవ్రం చేసింది. కనుక, సహజంగానే సింగారవేలు సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనటం ప్రారంభించి, భారత కార్మిక వర్గపు స్థితిగతులను మెరుగుచేసేందుకు పోరాడారు. మత్స్యకారుల కాలనీలో ప్లేగువ్యాధి వ్యాపించిన పరిస్థితులలో ప్లేగు వ్యతిరేక ప్రచార ఏర్పాట్లలో సహకరించటంతోపాటు, తన స్వంత ఇంటిలోనే సామూహిక వంటలను నిర్వహించారు. 1917 నుండి, తదనంతర కాలంలో ప్లేగు విపత్తును ఎదుర్కోవటంలో, రక్షణ, ఉపశమన చర్యలు చేపట్టటంలో ఆయన ముందు వరుసలో నిలిచారు.

దేశ జాతీయోద్యమంలో సింగారవేలు క్రియాశీలకంగా రూపొందారు. జలియన్ వాలాబాగ్ హత్యాకాండ తదనంతరం, గాంధీ ఇచ్చిన జాతీయోద్యమ పిలుపుతో మద్రాసు నగరంలో వలంటీర్ల దళానికి ఆయన నాయకునిగా ముందుకొచ్చి, జాతీయ గీతాలు ఆలపిస్తూ సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదాలు చేస్తూ మద్రాసు నగరంలోని అనేక ప్రాంతాలలో ప్రదర్శనలకు నాయకత్వం వహించారు.

ఆ సమయంలో ఆయన అఖిలభారత కాంగ్రెస్ కమిటి సభ్యులవటంతోపాటు తమిళనాడులో అత్యంత ముఖ్యమైన కాంగ్రెస్ నాయకులలో ఒకరుగా ముందుకొచ్చారు. 1922లో జరిగిన గయ కాంగ్రెస్ సభలకు ఒక ప్రతినిధిగా సింగారవేలు హాజరయ్యారు.

ఈ సమయానికి, సింగారవేలు మార్క్సిజానికి, విజయవంతమైన అక్టోబర్ సోషలిస్టు విప్లవానికి, మహా నాయకుడు లెనిన్‌కు గొప్ప ఆరాధకునిగా, అనుయాయునిగా రూపొందారు. 1922 డిసెంబర్‌లో 'గయ'లో జరిగిన కాంగ్రెస్ మహాసభల సందర్భంగా ఆయన ఎస్.ఏ. డాంగేను కలిసి, ఆయనతో సంబంధాలలో వున్నారు. ఎమ్.ఎన్.రాయ్ సింగారవేలుతో ఉత్తరప్రత్యుత్తరాలు జరిపేవారు. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ తరఫున అబానీ ముఖర్జీ మద్రాసు రెండు పర్యాయాలు వచ్చి, ఆయనతో సంబంధాలను స్థిరపరుచుకున్నట్లుగా చెబుతారు.

1923లో సింగారవేలు 'హిందూస్థాన్ లేబర్ కిసాన్ పార్టీ'ని స్థాపించి, మద్రాసు నగరంలో దేశంలోనే తొలిసారిగా 'మేడే' సభను నిర్వహించారు. 'లేబర్ కిసాన్ గెజిట్' అనే ఆంగ్ల, పక్ష పత్రికను, 'తోఝిలాలన్' (కార్మికుడు) అనే తమిళ పత్రికను ఆయన ప్రచురించారు.

కాన్పూరు బోల్షివిక్ కుట్రకేసులో ఒక నిందితునిగా 1924లో ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసింది. ఆ సమయంలో ఐదు నెలల కాలం తీవ్ర అనారోగ్యంతో వుండటంతో, ఆయనపై కేసును కొనసాగించుండా, దాని నుండి తొలగించారు.

1925 సం॥లో కాన్పూరులో జరిగిన మొదటి కమ్యూనిస్టు మహాసభకు సింగారవేలు అధ్యక్షత వహించారు.

1925 నుండి మద్రాసు మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిలర్‌గా వుంటూ, కమ్యూనిస్టు నాయకుడైన సకలత్‌వాలా 1927లో మద్రాసును సందర్శించిన సందర్భంగా మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆయన ప్రసంగించే విధంగా చేశారు.

సింగారవేలు నాయకత్వంలో లేబర్‌కిసాన్ పార్టీ 1924 జనవరిలో లెనిన్ మరణించిన సందర్భంగా తన కార్యాలయ ప్రాంగణంలో ఎర్రజెండాను అవనతంచేసి నివాళులర్పించింది. లేబర్ కిసాన్ గెజిట్ పత్రికలో లెనిన్‌కు జోహార్లర్పించారు.

డిసెంబర్ 1922 నాటి గయలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో, భారత జాతీయ కాంగ్రెస్, అప్పటికే సింగారవేలు కార్మికుల సమస్యలపై క్రియాశీలంగా, ఆసక్తిగా వుంటూ పోరాడు తుండటంతో ఏఐటియుసికి సహాయమందించ వలసిన ఆరుగురు సభ్యులలో ఒకరిగా ఆయనను నియమించింది. 1922 నుండి తదనంతర కాలంలో, మద్రాసులోని బి&సి మిల్స్ కార్మికుల పోరాటాలలో సింగారవేలు పాల్గొన్నారు; కార్మికులను, వారి యూనియన్లకు సంఘటితం చేయటంలో ఆయన ముందు వరసలోనున్నారు. 1926 నుండీ ఆయన ప్రత్యక్షంగా, చురుగ్గా కార్మికవర్గ పోరాటాలలో పాల్గొన్నారు. 1927లో ఖరగ్‌పూర్, బెంగాల్, నాగపూర్ రైల్వే సమ్మెలో, ఈస్టిండియా రైల్వేలో జరిగిన లోకోవర్క్ షాపు సమ్మెలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. ఆయన దక్షిణభారత రైల్వే కార్మికులను సంఘటితంచేసి 1928లో వారి చారిత్రాత్మక సమ్మెకు నాయకత్వం వహించారు. దక్షిణభారత రైల్వే కార్మికుల యూనియన్‌లోని ఇతర నాయకులతోపాటు సింగారవేలుపై పోలీసులు కుట్రకేసు బనాయించి, ఆయనను 10 సం॥లు కఠిన కారాగారశిక్షకు గురిచేశారు.

1927 ఆగస్టులో అమెరికాకు చెందిన శాంకో-వాంజెట్టిలపై బనాయించిన కేసులో వారికి ఉరిశిక్ష విధించటాన్ని నిరసిస్తూ

సింగారవేలు ఒక సభ నిర్వహించారు. 1928లో సైమన్ కమిషన్ మద్రాసు వచ్చిన సందర్భంలో, సింగారవేలు ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏకంగా ఒక నల్ల చీరను తన ఇంటిమేడపై ఎత్తుగా ఎగురవేశారు. సైమన్ కమిషన్ బీచ్ ప్రాంతంగుండా వెళ్ళినపుడు ఒక భారీ నల్లవస్త్రం తన ఇంటిపై ఎగురుతూ వారికి కన్పించేలా చేశారు.

1922లో బి&సి కంపెనీ యాజమాన్యం కంపెనీలో దీర్ఘకాలం సాగిన కార్మికుల సమ్మె సందర్భంగా కార్మికవర్గ శ్రేణులలోని నిర్దిష్ట భాగంలో విభజన సృష్టించగా, సింగారవేలు సరిగ్గా ప్రతిస్పందించి, సామర్థ్యానికి మూలం కార్మికుల నడుమ ఐక్యతేనని నొక్కిచెపుతూ "సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి, కార్మికవర్గాన్ని బలహీనపరిచేందుకు హిందూ కులాలకు, ఆది ద్రావిడులకు నడుమ యజమానులు విభజనలు సృష్టిస్తున్నారని" చెప్పి, వారి వర్గఐక్యతను దెబ్బతీసే, కుల ప్రాతిపదికపై విభజనలవంటి వాటిపై కార్మికులు పోరాటం జరపాలని హెచ్చరించారు.

1930 ఆగస్టులో సింగారవేలు జైలు నుండి విడుదలయ్యారు. అప్పటికే ఆయన 70 ఏళ్ళ వయస్సులో వున్నారు. ఈ సమయంలో, ఇ.వి. రామస్వామి ప్రారంభించిన ఆత్మగౌరవ ఉద్యమం పెద్దసంఖ్యలో కార్మికులను ఆకర్షించింది. ఇ.వి. రామస్వామి సింగారవేలు స్నేహితుడు. 1928 నాటి దక్షిణభారత రైల్వే కార్మికుల సమ్మెకు, అలాగే సింగారవేలు నాయకత్వంలో కార్మికులు సాగించిన అనేక ఆందోళనలకు మద్దతు నందించారు. ఈ ఆత్మగౌరవ ఉద్యమంద్వారా శ్రామిక ప్రజానీకపు విముక్తి గ్యారంటీ, అన్ని సామాజిక అసమానతల రద్దు, కుల, సామాజిక అణచివేత, ఆధిపత్యాల భయాలనేవి, అందరికీ సమానమైన హక్కులు కలిగి వుండే ఒక విశాల ప్రపంచంలోని అనేకమంది కార్మికుల కనులు తెరిపించటంలో సింగారవేలు ఒక ముఖ్యమైన పాత్ర నిర్వహించారు.

'కుడి అరసు' పత్రికలలో వ్యాసాలు రాయటం ద్వారా, వివిధ ఆత్మగౌరవ ఉద్యమ శాఖలు నిర్వహించే సభలద్వారా, మతంయొక్క పట్టునుండి, మూఢనమ్మకాలనుండి బయటపడి జాతిపరమైన అపోహలను అధిగమించి సోషలిస్టు విప్లవం విజయవంతమైన రష్యాను ఉదా హరణగా ముందుంచి మార్క్సిజం మౌలిక అవగాహనలను ఆయన వివరించేవారు. ఆత్మగౌరవ ఉద్యమ వేదికలపై నుండి ప్రసంగాల ద్వారా, పత్రికలలో వ్యాసాలద్వారా సింగారవేలు బోధించే సోషలిస్టు సిద్ధాంతాల వ్యాఖ్యానాలతో విద్యావంతమైన ఆత్మగౌరవ ఉద్యమంలోని మరింత అభ్యుదయ యువశక్తులు, చివరకు తమకు తాముగా ఆత్మగౌరవ సమధర్మ పార్టీగా ఏర్పడ్డారు. దక్షిణభారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ పరిణామాలలో ఆయన చేసిన ఒక ముఖ్యమైన తోడ్పాటు ఇది. సింగారవేలు, తమ సామాజిక సంస్కరణకోసం, మతానికి, కులానికి అస్పృశ్యతకు, ప్రస్తుత వ్యవస్థలోని ఇతర దుర్లక్షణాలకు వ్యతిరేకంగా సాగించే పోరాటం– అక్టోబర్ విప్లవాన్ని, సోవియట్ యూనియన్‌ను అర్థంచేసుకోకుంటే, వాటి ప్రయోజనాన్ని సాధించ లేవని ఆయన నొక్కి చెప్పేవారు. రాజకీయ అధికారం, వ్యక్తిగత ఆస్థిని విశ్వసించే పెట్టుబడిదారుల చేతుల్లో వున్నంతకాలం ప్రజానీకపు పేదరికం తొలగిపోదని పేర్కొంటూ వ్యక్తిగత ఆస్థి కొనసాగినంతకాలం, సోషలిజం స్థాపితంకాదనేది స్పష్టమేనని ఆయన నొక్కి వక్కాణించారు.

సింగారవేలు తన 60 సం॥ల వయస్సులో, 1922లో 'గయ' కాంగ్రెస్ సభలకు హాజరై, 'గౌరవప్రదమైన' జాతీయవాదం నుండి ప్రభుత్వ నేరారోపణకు, దేశ బహిష్కరణకు అవకాశం వుందనే భయంతో యువశక్తులు ధైర్యం కోల్పోయినా, తనను తాను కమ్యూనిస్టుగా బాహాటంగా ప్రకటించుకున్నారు.

1922 డిసెంబర్‌లో కాన్పూరులో జరిగిన భారత మొదటి కమ్యూనిస్టు మహాసభలో ఆయన చేసిన ప్రసంగంలో విస్తారంగా కమ్యూనిజం సూత్రాలను, కార్ల్‌మార్క్స్ సిద్ధాంతాలను దేశంలోని ప్రతి కమ్యూనిస్టు అర్థంచేసుకోవలసిన అవసరాన్ని గురించి వివరించారు. ఆ మహాసభలో ఆయన తన ముగింపు ఉపన్యాసంలో ప్రత్యేకించి కుల, మత విభేధాల గురించి హెచ్చరించి, భారత దేశంలో కమ్యూనిస్టులు సాగించే కృషి, కమ్యూనిస్టు సూత్రాలను, కార్యక్రమాన్ని అమలు చేయటానికి దోహదపడుతుందని, అందరికీ ఒక సౌభాగ్యవంతమైన భవిష్యత్తును అందిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.

గొప్ప తమిళకవి సుబ్రమణ్యభారతికి సింగారవేలు ఒక సన్నిహిత మిత్రుడు. రష్యా విప్లవాన్ని కొనియాడిన తొలి వ్యక్తులలో సుబ్రమణ్య భారతి ఒకరు. అంతేగాక, ఆ విప్లవ నాయకులకు, అక్కడ నిర్మాణంగావించబడిన నూతన సమాజానికి సమర్థకునిగా స్థిరంగా నిలిచినవారు కూడా.

సింగారవేలు శిష్యులనేకమందిలో ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు పి.సుందరయ్య ఒకరు.

లెనిన్ స్థాపించిన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ నుండి 1919లో ఎమ్ఎన్‌రాయ్ బయటకొచ్చిన తర్వాత భారతదేశానికి తిరిగి వచ్చి 1936లో మద్రాసు వెళ్ళి తన అభిప్రాయాని కనుగుణంగా సింగారవేలును మలచి, తను నిర్మాణం చేయబోయే నూతన పార్టీకి సింగారవేలు మద్దతు కూడగట్టాలని భావించి నపుడు, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ పట్ల, మార్క్సిజం మౌలిక విషయాలపట్ల తన నిబద్ధతను ఆయన నిక్కచ్చిగా చాటి చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ పట్ల సింగారవేలు విశ్వాసం, ఎమ్ఎన్‌రాయ్ తప్పుడు భావాలకు చోటు నివ్వలేదు.

సింగారవేలు నిరంతర అధ్యయనం సాగించటంతోపాటు, సారవంతమైన రచనలు కూడా చేశారు. ఆయన తన వద్ద అరుదైన, విలువైన పుస్తకాలను సమకూర్చుకున్నారు. ఆయన గ్రంథాలయంలో దాదాపు పదివేల పుస్తకాలున్నాయి. ఆయన తన విలువైన గ్రంథాలయాన్ని తమిళనాడు సిపిఐ శాఖకు వీలునామా రాసి వెళ్ళారు. ఆయన బహు భాషాకోవిదుడు కూడా. ఆయనకు తమిళం, ఇంగ్లీషు, హిందీ, ఉర్దు, జర్మన్, ఫ్రెంచ్ భాషలు తెలుసు.

సింగారవేలు కమ్యూనిస్టు పార్టీ పత్రిక అయిన 'జనశక్తి'కి తమిళనాడు నుండి తమిళ భాషలో వ్యాసాలను రాసేవారు. కమ్యూనిజం లక్ష్య సాధనకోసం పోరాడిన గొప్ప యోధుడాయన.

1946 ఫిబ్రవరి 11న ఆయన మరణించారు. కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్మికులు ఏకరూప ఎర్రని దుస్తులతో ఆయన మృతదేహంవద్ద నిలచి ఆ గొప్ప నాయకునికి విప్లవ జోహార్లర్పించారు.

జాతీయోద్యమంలో కమ్యూనిస్టు భావాల అభివృద్ధికి సింగారవేలు అందించిన తోడ్పాటు, ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో సహచర కార్మికులు, నాయకులపై ఆయన ఆలోచనా ధోరణి కలిగించిన ప్రభావం పేర్కొనదగినవి. ఆయన అందించిన తోడ్పాటు వాస్తవానికి ఇంకా విస్తృతమైనది.

దక్షిణ భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ పథకర్తలలో సింగారవేలు అగ్రగణ్యుడు. భారత దేశంలో విప్లవ విజయానికి నిజాయితీగా కృషి సాగిస్తున్న కమ్యూనిస్టులందరకూ, కమ్యూనిస్టుగా ఆయన జీవిత కాలం సాగించిన కార్యక్రమాలు నమూనాగా నిలుస్తాయి.

'జనశక్తి' కా॥సింగారవేలు 78వ వర్ధంతి సందర్భంగా ఆయనను జ్ఞప్తిచేసుకుంటూ అత్యంత గౌరవంతో ఆయనకు అరుణాంజలి ఘటిస్తోంది. కామ్రేడ్ సింగారవేలుకు విప్లవ జోహార్లు.

**(2024 ఫిబ్రవరి 'క్లాస్‌స్ట్రగుల్' నుండి అనువాదం)** ✸

# సహజవాయువుపై ఆధిపత్యం చెలాయిస్తున్న సామ్రాజ్యవాద బహుళజాతి, బడా కంపెనీలు

(ఈ సంవత్సరం జనవరి 7న కాకినాడకు దగ్గరలో సముద్ర గర్భం నుండి ముడిచమురు ఉత్పత్తి ప్రారంభమైంది. కృష్ణ-గోదావరి బేసిన్‌లో సహజ వాయువుతో పాటు చమురు ఉత్పత్తి విలువ లక్షల కోట్ల రూపాయలకు మించి ఉంటుందని అంచనా. అయితే ఈ సంపదనంతా రాష్ట్రాల హద్దులు దాటించి ఇతర రాష్ట్రాలకు ముఖ్యంగా గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్‌లోని బడా పారిశ్రామిక వర్గాల అవసరాలకు తరలించి వేస్తున్నారు. కృష్ణ-గోదావరి క్షేత్రం నుండి ఉత్పత్తి అయ్యే సహజవాయువులో ఆంధ్రప్రదేశ్ అవసరాలకు కేవలం 1.2 శాతం మాత్రమే కేటాయిస్తున్నారు. వాస్తవానికి సహజ న్యాయ సూత్రాల ప్రకారమే కాకుండా రాజ్యాంగ సూత్రాల ప్రకారం కూడా ఏ రాష్ట్రంలో వెలికి తీసే సంపదను ఆ రాష్ట్ర ప్రయోజనాలకు, ఆ రాష్ట్ర అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యతలో వినియోగించాలి. దీనికి భిన్నంగా కేంద్రంలో,రాష్ట్రంలో అధికారంలో ఉన్న పాలకులు - బడా, బహుళ జాతి కంపెనీలు మన రాష్ట్రంలోని సంపదను తేరగా తరలించుకుపోవడానికి అనుమతులు అన్నింటిని అందిస్తూ తాము ఏ వర్గ ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నారో చాటుకుంటున్నారు.

గతంలో, 2009లోనే ప్రైవేటు గుత్తాధిపత్యానికి బాటలు వేస్తూ నూతన అన్వేషణ లైసెన్స్ విధానాలతో (ఎన్ఇఎల్‌పి) పాలకులు సహజవాయువును కెఇర్న్ ఎనర్జీ, రిలయన్స్ వంటి సంస్థలకు కట్టబెడుతున్న నేపథ్యంలో 'కృష్ణా-గోదావరి బేసిన్‌లో సహజ వాయువు వివాదం-ప్రజాప్రయోజనాలను తాకట్టు పెట్టిన పాలకులు' శీర్షికన 'జనశక్తి' 2009 ఆగస్టులో ఒక వ్యాసాన్ని ప్రచురించింది. తదనంతర కాలంలో పరిణామాలను 2010 జూన్, 2012 ఆగస్టు సంచికలలో ప్రచురించింది. నేటి పరిణామాల నేపథ్యాన్ని అర్థంచేసుకునేందుకు ఉపయోగకరంగా ఉంటుందని 2012 ఆగస్టు సంచిక లోని ఈ వ్యాఖ్యానాన్ని పునర్ ముద్రిస్తున్నాం. - సంపాదకులు)

**మహారాష్ట్రలోని** రత్నగిరి విద్యుత్తు ప్లాంటుకు గ్యాస్‌ను సరఫరా చేసిన తర్వాతే మిగతా ప్లాంట్లకు సరఫరా చేయాలని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల మంత్రిత్వశాఖ 2012 జూలై 31వ తేదీన ఆదేశాలు ఇవ్వటంతో మన రాష్ట్రంలో ఆందోళన ప్రారంభమైంది. ముందు మన రాష్ట్రంలోని విద్యుత్తు ప్లాంట్లకు గ్యాస్‌ను సరఫరా చేసిన తర్వాతే రత్నగిరి ప్లాంట్‌కు సరఫరా చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వానికి లేఖలు వ్రాస్తే, రాష్ట్రంలోని అఖిల పక్ష పార్టీలు గ్యాస్ అక్రమ తరలింపుపై ఆందోళనా కార్యక్రమం ప్రకటించాయి. చివరికి రత్నగిరి ప్లాంటుకు కెజి డి-6 నుండి గ్యాస్ తరలింపును ఆపివేయమని ప్రధానమంత్రి ఆదేశించటంతో ప్రస్తుతానికి రత్నగిరికి సరఫరా ఆగింది. 'తీగ లాగితే డొంకంతా కదిలిన'ట్లు రత్నగిరి ప్లాంట్‌కు గ్యాస్‌ను సరఫరా చేయమనటంతో కృష్ణా, గోదావరి బేసిన్‌లో అపారంగా లభిస్తున్న గ్యాస్ సంపద ఎలా వినియోగించాలన్న ప్రశ్న ముందుకు వచ్చింది.

మనకు సహజసిద్ధంగా అపారంగా లభిస్తున్న సహజ సంపదలుగా వున్న బొగ్గు, ఇనుము, బాక్సైట్ తదితర ఖనిజ వనరులతో పాటు భూగర్భంలో లభించే సహజవాయువును కూడా ప్రజాప్రయోజనాలకు ఉపయోగించాలి. ఈ విషయాన్ని రాజ్యాంగంలో కూడా స్పష్టంగా పేర్కొన్నారు. అయితే ఇందుకు విరుద్ధంగా మన పాలకులు - ప్రజాప్రయోజనాలకు బదులు సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారీ వర్గాల ప్రయోజనాలకు సేవజేసే విధానాలు రూపొందిస్తున్నారు. 1990ల తర్వాత నూతన ఆర్థికవిధానాలను అమలుపరిచే పేరుతో ప్రైవేటీకరణ-సరళీకరణ-ప్రపంచీకరణ విధానాలను అన్ని రంగాల్లో అమలు పరిచే దానిలో భాగంగా భూగర్భంలో లభించే సహజ వనరులను ప్రైవేటీకరించటం ప్రారంభించింది. అంతవరకు ఇంధన వాయువుని ప్రభుత్వరంగ సంస్థలైన ఓఎన్‌జిసి (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్) ఉత్పత్తి చేస్తూవుండగా, మరో ప్రభుత్వ రంగ సంస్థ అయిన గెయిల్ (గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా) రవాణా, సరఫరా బాధ్యతలు చూసేది. కేంద్ర ప్రభుత్వమే సహజవాయువును వినియోగించుకుని ఎరువుల తయారీ, విద్యుదుత్పత్తి, రవాణా తదితర రంగాలకు ప్రాధాన్యతా క్రమాన్ని నిర్ణయించి, గ్యాసును కేటాయించటంతోపాటు గ్యాసు ధరను కూడా నిర్ణయించేది. ప్రైవేటీకరణ విధానాలను అమలు పరిచే దానిలో భాగంగా ఏ రంగానికి ఎంత గ్యాసు ఇవ్వాలో అన్న ఒక్క అధికారాన్ని మాత్రమే వుంచుకొని పెట్రోలియం, గ్యాస్ నిక్షేపాల అన్వేషణ, వెలికితీత, రవాణా, అమ్మకం లాంటి కార్యకలాపాలన్నిటినీ పాలకులు ప్రైవేటీకరించారు. 1995లో దీనికి సంబంధించిన విధివిధానాలను ఆమోదించి 1997లో నూతన వెలికితీత, లైసెన్సింగ్ పాలసీ (నెల్ప్-న్యూ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ లైసెన్సింగ్ పాలసీ)ని ప్రవేశపెట్టారు. దీనితో ఈ రంగంలో ప్రైవేటీకరణ పేరుతో విదేశీ పెట్టుబడులకు గేట్లు బార్లా తెరిచారు. ఈ విధానంలో మరొక ముఖ్య అధికారాన్ని ప్రైవేట్ శక్తులకు కట్టబెట్టింది. అదేమిటంటే, తన వాటాగా వచ్చిన గ్యాస్ ధరను నిర్ణయించుకొనే అధికారాన్ని, ఎవరికి అమ్ముకోవాలనే హక్కులను వారికే ధారాదత్తం చేసింది. నెల్ప్ విధానాన్ని ఆసరాచేసుకొని రిలయన్స్ సంస్థ ఇంధన వాయువులో 78 శాతం వెలికి తీసే 'స్థాయి'కి పెరిగిపోయింది. కెజి డి-6 బావిలో గ్యాసు పడటంతో తాను పెట్టిన పెట్టుబడి ఖర్చు లాభాలతో తిరిగి వచ్చే విధంగా గ్యాసు ధర నిర్ణయించాలని రిలయన్సు కంపెనీ తప్పుడు లెక్కలతో వాదించగా ఒక్క యంయంబిటియు (మిలియన్ మెట్రిక్ బ్రిటిష్ థర్మల్ యూనిట్) ధరను 4.33 డాలర్లు పెంచాలని కోరితే, ఆనాడు ప్రణబ్ ముఖర్జీ ఛైర్మన్‌గా వున్న ఎనిమిది మంది మంత్రులతో కూడిన సాధికారిక మంత్రుల కమిటి రిలయన్స్ వాదనను అంగీకరించి 4.20 డాలర్లుగా నిర్ణయించిందంటే కేంద్రప్రభుత్వం ఎవరి చేతిలో కీలుబొమ్మగా వుందో తేలిగ్గా అర్థంచేసుకోవచ్చు. ప్రైవేటీకరణకు ముందు ఇంధన వాయువు యంయంబిటియు ధర 1.50 నుండి 2.00 డాలర్లకు మించిలేదు. గ్యాసు పైపులైను వేసి యూనిటు 3 డాలర్లకు భారత్‌కు సరఫరా చేస్తానని ఇరాన్ ఆనాడు ప్రతిపాదించింది. కాగా అమెరికా వత్తిడికి లొంగి భారత ప్రభుత్వం తిరస్కరించింది. అంతేగాక ఇంధన వాయువు వెలికితీత, అమ్మకాల్లో ఆధిపత్యంలోవున్న రిలయన్స్ సంస్థ తాజాగా, అనుకొన్న విధంగా గ్యాస్ ఉత్పత్తి జరగడం లేదనే పేరుతో తన పెట్టుబడి వ్యయానికి అనుగుణంగా ఒక యూనిటుకు 9 డాలర్ల ధర నిర్ణయించాలని ఇప్పుడు మళ్లీ వాదిస్తోంది. ధరను పెంచి సొమ్ముచేసుకోవాలని చూస్తున్నది. మరోవైపు బ్రిటిష్ పెట్రోలియం కంపెనీ, రిలయన్స్‌లో ఎక్కువ వాటాలను కొనుగోలు చేసి గ్యాసును దిగుమతి చేసుకుంటే అయ్యే ధరకు సమానంగా యూనిటుకు 12 డాలర్లుగా ధర నిర్ణయించాలని వాదిస్తున్నది. 3 డాలర్లకు సరఫరా చేస్తానన్న ఇరాన్ ప్రతిపాదనను తిరస్కరించిన భారత ప్రభుత్వం అమెరికా కంపెనీల నుండి 9 డాలర్లకు దిగుమతి చేసుకుంటున్నది. ఈ భారమంతా ప్రజలపైనే పడుతుంది. ఈ రేటు పెట్టిన గ్యాసుతో విద్యుదుత్పత్తి చేస్తే యూనిటు 9 రూ॥లు అవుతుంది. దీనికి పంపిణీ, రవాణా ఛార్జీలు అదనం. దీనితో జరిగే →

సంస్మరించుకుందాం

**2024 మార్చి 16-కా॥ఎం.ఆర్ 11వ వర్ధంతి**

# నిబద్ధ కమ్యూనిస్టు, రైతుకూలీపోరాటయోధుడు కామ్రేడ్ మానం రామారావుకు నివాళి



**గుంటూరుజిల్లా** బాపట్ల తాలూకా నర్సాయపాలెం గ్రామంలో జన్మించిన కామ్రేడ్ మానం రామారావు-నిబద్ధతగల కమ్యూనిస్టుగా, రైతుకూలీ పోరాటయోధునిగా, కమ్యూనిస్టు విప్లవకారునిగా, సిపిఐ(ఎం-ఎల్) నాయకునిగా బాధ్యతలు నిర్వహించారు. ఉద్యమ జీవితంలో నిర్బంధం, అరెస్టులు, జైలుజీవితం, రహస్యజీవితంవంటి క్లిష్టపరిస్థితులనన్నీ ఆయన ధైర్యంగా ఎదుర్కొన్నారు. పార్టీ, రైతుకూలీ ఉద్యమ నిర్మాణాలలో క్రియాశీలపాత్ర నిర్వహించారు. తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు సంస్థాపకుల్లో ఒకరుగా ఎమ్మార్ విస్తృతకృషి సాగించారు. విప్లవ కమ్యూనిస్టుల పక్షపత్రిక 'జనశక్తి' సంపాదకుని హోదాలో బాధ్యత వహించారు. నిరంతర ఆందోళనాకారునిగా ప్రజలకు నాయకత్వం వహించటంతోపాటు ఎమర్జన్సీ తదనంతరకాలంలో ప్రజాఉద్యమాలపై - ముఖ్యంగా కొండమొదలు గిరిజనోద్యమంపై ప్రభుత్వ పోలీసుల హత్యాకాండ, అణచివేతలను ఎలుగెత్తి ఖండించటంలో, వారి పోరాటధృతి సడలకుండా ధైర్యాన్ని అందించటంలో; గుంటూరుజిల్లా కొండమోడు తదితర ఆందోళనోద్యమాలకు కొండంత అండగా కామ్రేడ్ ఎంఆర్ ముందు నిలిచారు. దాదాపు 7 దశాబ్దాల తన కమ్యూనిస్టు ఉద్యమ రాజకీయ జీవితంలో మార్క్సిజం - లెనినిజం - మావో ఆలోచనావిధానంపట్ల అచంచల విశ్వాసంతో, కమ్యూనిస్టు క్రమశిక్షణతో, నిబద్ధతగల కామ్రేడ్‌గా ఆయన జీవించారు. ఒక మధ్యతరగతి రైతుగా కమ్యూనిస్టు పార్టీలో ప్రవేశించి, వ్యక్తిగత ఆస్థులు పెంచుకోకుండా, మిగుల్చుకోకుండా ఆదర్శంగా నిలిచారు. పార్టీ, రైతుకూలీ ఉద్యమ నిర్మాణంలోని కార్యకర్తలు కా॥ ఎంఆర్‌లోని విశిష్ట లక్షణాలను స్ఫూర్తిదాయకంగా తీసుకొని కృషిసాగించటమే ఆయనకు అర్పించే సరైన నివాళి. ✸

→ యూరియా ఉత్పత్తి ధర 50శాతం పెరుగుతుంది. ఈ విధంగా ఇంధన వాయువును సామ్రాజ్యవాదుల, రిలయన్స్ లాంటి బహుళ జాతి, బడా కార్పొరేటు కంపెనీల ఆధిపత్యం కొనసాగినంతకాలం దేశ ప్రయోజనాలు కాపాడబడవు అని తేటతెల్లం అవుతున్నది.

మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 297 ప్రకారం మనదేశ సరిహద్దుల మధ్యనున్న భూమి, సముద్ర గర్భంలో వుండే ఖనిజాలు కేంద్ర ప్రభుత్వానికే చెందుతాయి. అయితే ఈ ఆస్తిని దేశ ప్రయోజనాలను తీర్చే విధంగా, ప్రజలందరికీ సమానంగా లబ్ధి అందే విధంగా కేంద్రప్రభుత్వం వినియోగించాలి. ప్రైవేటీకరణ విధానాలను చేపట్టినందున ఈ విధానానికి మంగళం పాడారు. అలానే మన ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే ప్రాఫిట్ గ్యాస్‌లో 50శాతం స్థానిక అవసరాలు తీర్చాలని 12వ ఆర్థిక సంఘం చేసిన సిఫార్సులను కూడా గంగలో కలిపారు. కావున మనకు కెజీ బేసిన్‌లో అపారంగ దొరుకుతున్న సహజవాయువు రిలయన్స్‌లాంటి ప్రైవేట్ రక్కసి కోరల్లో చిక్కుకొనిపోయింది. దాన్నుంచి మన సహజ వాయువును రక్షించుకోవటానికీ, ప్రజాప్రయోజనాలు ఈడేరటానికి కావలసిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలి.

మన్యం ప్రాంత భూములు, వనరులు ప్రైవేటు శక్తులకివ్వరాదన్న సుప్రింకోర్టు సమతా కేసులో ఇచ్చిన తీర్పును కాలరాచి, ప్రభుత్వమే బాక్సైటును వెలికి తీస్తుందంటూ విదేశీకంపెనీ జిందాల్‌కు కట్టబెట్టింది. బాక్సైటు నుండి అల్యూమినా తయారుచేసి, దాని నుండి వచ్చే పర్యావరణ, ప్రజాజీవన నష్టాలన్నీ మనపై మోపి, దానిని యూరపు తీసుకువెళ్లి, అక్కడ దాని నుండి అల్యూమినియం అతి తక్కువ ఖర్చుతో తయారుచేసి, అధిక ధరకు తిరిగి మనకే అమ్ముతారు. ఇనుప ఖనిజాన్ని గాలి జనార్ధనరెడ్డికి కట్టబెట్టి వేల కోట్ల రూపాయల అక్రమార్జనకు పాల్పడ్డాడంటూ ఇపుడు గగ్గోలు పెడుతున్న ప్రభుత్వం, తానే అక్కడ ఉక్కు మిల్లును పెట్టివుంటే, దాదాపు 30వేలమందికి ఉద్యోగాలు రావటంతో పాటు అనేక అనుబంధ పరిశ్రమలు ఏర్పడేవి. గాలి అక్రమార్జనలకు నాలుగురెట్ల లాభాలు ఆ ఉక్కు మిల్లుకు వచ్చి వుండేవి. కాగా దాదాపు 100గ్రామాలను నివాస యోగ్యం కాకుండా చేసి ప్రజలు నిర్వాసితులయ్యే స్థితి కలిగించింది. బొగ్గు గనుల ప్రైవేటీకరణ చేపట్టి గనులలో 60 శాతాన్ని బడా బూర్జువాలకు కేటాయించింది. ఐదేళ్ల తర్వాత కూడా వీటిలో 75శాతం మంది అసలు గనుల తవ్వకాలే ప్రారంభించలేదని ప్రభుత్వమే ప్రకటించింది. మనకున్న బొగ్గు నిక్షేపాలను వినియోగించు కోకుండా చేసిన బడా బూర్జువా వర్గాలు అధికధర పెట్టి ఆస్ట్రేలియా తదితర దేశాలనుండి దిగుమతి చేసుకొని ఆ భారాన్ని ప్రజలపై మోపుతున్నారు. పైపెచ్చు ప్రభుత్వసంస్థ కోల్ ఇండియా ఆఫ్రికాలో బొగ్గుగనులను లీజుకు తీసుకునే విధంగా దేశంలో బొగ్గుగనులు దానికి లేకుండా చేశారు. అంతర్జాతీయ మార్కెట్టు రేటుతో సంబంధం లేకుండా ఒప్పందంలో పేర్కొన్న రేటుకే ఇరాన్ చమురును సరఫరా చేస్తున్నది. మన చమురు దిగుమతుల్లో 40శాతం ఇరాన్ నుండే వస్తున్నది. అమెరికా ఒత్తిడికి లొంగి భారత ప్రభుత్వం ఇరాన్ నుండి చమురు దిగుమతులు తగ్గించివేసి అధిక ధరలకు సౌదీ అరేబియా (అంటే అమెరికా ఆయిలు కంపెనీల నుండి) కొంటున్నది.

దేశసహజ వనరులను దేశప్రయోజనాలూ, ప్రజా అవసరాలూ ఈడేర్చే విధంగా వినియో గించకుండా సామ్రాజ్యవాదులకూ, బడా బూర్జువాలకూ ఇబ్బడి ముబ్బడిగా లాభాలు చేకూర్చేవిధంగా భారత ప్రభుత్వం వ్యవహ రిస్తున్నది. సహజ వనరులను దుర్వినియోగ పర్చటంతోపాటుగా ప్రజలకు అందుబాటులో లేకుండా చేస్తున్నది. గ్యాసు కొరత ఏర్పడటానికి మూలకారణమిదే. కాగా, ఆ కొరతనే ఎలా పంచుకోవాలన్న దాని చుట్టూ వివాదాన్నిరేపి ప్రాంతీయ దురభిమానాలను రెచ్చగొడుతున్నారు.

ఇంధన వాయువు నిరాఘాటంగా సరఫరా అవుతుందన్న పేరుతో రాష్ట్రంలో 25 ప్రైవేట్ విద్యుతు ప్లాంట్లకు అనుమతులిస్తే, ధరను పెంచుకోవటానికి రిలయన్స్ సంస్థ గ్యాసు కొరతను సృష్టించింది. ఫలితంగా విద్యుత్తు ప్లాంటులు పనిచేయకుండా నిలిచిపోవడానికి కారకులెవరు? ఇంధన వాయువును ప్రైవేట్ పరంచేసిన దుష్ఫలితం కాదా! అధిక వర్షాలు, వరదలు ఫలితంగా వందల టియంసీల నీరు సముద్రంపాలు కావటం చూస్తున్నాము. సమగ్ర నీటివనరుల రక్షణ విధానం చేపట్టితే అటు విద్యుత్తు కొరత లేకుండా, ఇటు సాగునీటి కొరత లేకుండా చేయవచ్చుకదా! అటువంటి ప్రజా ప్రయోజనాలతో కూడిన సమగ్రవిధానం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేనందున గ్యాస్ కొరతను, విద్యుత్ కొరతను, సాగునీటి కొరతను రాష్ట్రం తీవ్రంగా ఎదుర్కొంటున్నది. కావున మన సహజ సంపదలను పరాయి వాళ్లకు కట్టబెడుతున్న పాలకులపై, వాటిపై పట్టుబిగిస్తున్న సామ్రాజ్యవాద, బహుళజాతి కంపెనీల దోపిడీ విధానాలపై సమరశంఖం పూరించడమే నేడు ప్రజల ముందున్న కర్తవ్యం. ✸

# సిపిఐ (ఎం-ఎల్) కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ లెనిన్‌కు నివాళులు

**తొట్టతొలి** సోషలిస్టు రాజ్య నిర్మాత, మహత్తర అక్టోబర్ విప్లవ నాయకుడు, మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి (21- 1-24)సందర్భంగా **సిపిఐ (ఎంఎల్) కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 26వ తేదీ** సాయంత్రం ఐదు గంటలకు స్థానిక లెనిన్ సెంటర్లోని లెనిన్ విగ్రహం ఎదుట 'లెనినిజం చిరస్థాయి అగుగాక' అని నినదిస్తూ బహిరంగ సభ స్ఫూర్తిదాయకంగా జరిగింది.

తొలుత **సిపిఐ(ఎంఎల్) కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ అరవింద్ సిన్హా**తో పాటు కామ్రేడ్స్ గుర్రం విజయకుమార్, పీకే షాహీ, సింహాద్రి ఝాన్సీ, ఇతర నాయకులు కామ్రేడ్ లెనిన్ చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులు అర్పించారు.

**కామ్రేడ్ గుర్రం విజయకుమార్** అధ్యక్షోపన్యాసం చేస్తూ మార్క్సిజానికి కాలం చెల్లిందనే వాదనలను ఖండించారు. లెనిన్ బోధించిన వర్గ పోరాటాల దారిలో ముందుకు సాగుదామని ఆయన పిలుపునిస్తూ కామ్రేడ్ లెనిన్‌కు నివాళులర్పించారు.

**కామ్రేడ్ అరవింద్ సిన్హా (బీహార్)** మాట్లాడుతూ ప్రపంచంలో తొలి సోషలిస్టు విప్లవానికి నాయకత్వం వహించిన కామ్రేడ్ లెనిన్ పట్ల మన గౌరవాన్ని తెలియజేసేందుకు ఇక్కడ సమావేశమయ్యామన్నారు. కామ్రేడ్ లెనిన్ ఈనాటి పరిస్థితిని చూడగలిగితే మన పట్ల తీవ్ర ఆగ్రహాన్ని ప్రదర్శించేవారని ఆయన చెప్పారు. పార్లమెంటరీ విధానాల ద్వారా కొన్ని హక్కులు సాధించుకోగలుగుతామేమో గాని పెట్టుబడిదారీ విధానాన్ని ధ్వంసం చేసి సోషలిజం స్థాపన అసాధ్యమన్న లెనిన్ వివరణను గుర్తు చేశారు. కామ్రేడ్ లెనిన్ నాయకత్వంలో విజయవంతమైన సోషలిస్టు విప్లవం, తదనంతరం కామ్రేడ్ స్టాలిన్ నాయకత్వంలో అద్భుత విజయాలను సాధించడం ప్రపంచం చూసిందన్నారు.

కామ్రేడ్ మావో నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ, జపాన్ సామ్రాజ్యవాదాన్ని ఓడించి సామ్యవాదాన్ని నెలకొల్పిందన్నారు. రష్యాలో కృశ్చేవ్ ముందుకు తెచ్చిన మూడు శాంతి సూత్రాలపై మహోపాధ్యాయులు తీవ్రమైన సిద్ధాంత పోరాటం సాగించి మార్క్సిజాన్ని పరిరక్షించారన్నారు.




**ప్రసంగిస్తున్న కా॥ అరవింద్‌సిన్హా; వేదికపై కామ్రేడ్స్ ఎస్.ఝాన్సీ, విజయకుమార్, పి.కె.షాహి**

మనదేశంలో నూతన ప్రజాస్వామికాన్ని స్థాపించాలంటే మనం తిరిగి లెనిన్ బోధనల వద్దకు వెళ్లాలన్నారు. సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాలన్నింటా ఫాసిజాన్ని పెంచి పోషిస్తోందని, పెట్టుబడిదారీ విధానం ఒక వ్యవస్థగా విఫలమైందని అన్నారు. యువజనులంతా ఈరోజు మార్క్స్, లెనిన్ బోధనలను అధ్యయనం చేయాలని, వారి జీవితాల్లోని ఆదర్శాలను స్వీకరించాలని, యువతలో విభేదాలను సృష్టించే పాలకుల కుట్రలను వమ్ము చేయాలని, ప్రజా పోరాటాలను ముందుకు తీసుకువెళ్లాలంటూ కామ్రేడ్ అరవింద్ సిన్హా తన ప్రసంగం ముగించారు.

**కామ్రేడ్ పీకే షాహి (ఢిల్లీ)**ప్రసంగిస్తూ 'ఈ ప్రపంచాన్ని నిర్వచించటం కాదు, మార్చాలి' అన్న కామ్రేడ్ మార్క్స్ పిలుపును గుర్తు చేశారు. లెనిన్ ఆ విధంగా ప్రపంచ గతిని మార్చే సోవియట్ విప్లవాన్ని విజయవంతం చేశాడన్నారు. 1947 తర్వాత నుండి మన దేశ పాలకులు రష్యా ప్రభావాన్ని తప్పక గుర్తించాల్సి వచ్చిందని, అందుకే వారు సోషలిజాన్ని వల్లె వేస్తూ వచ్చారు కానీ ఆచరణలో సంపదల కేంద్రీకరణను సాగించారని చెప్పారు. ఈనాడు ప్రజలు ఎదుర్కొంటున్న ఆకలి, పేదరికం, గిట్టుబాటు ధరలు వంటి అంశాలను గురించి పాలకులు మాట్లాడడం లేదని, దేశంలో పీడిత ప్రజానీకం తమ సమస్యలపై ఉద్యమాలలోకి కదులు తున్నారని చెప్పారు. భారత విప్లవ కమ్యూనిస్టు శక్తులు ఏకమై ప్రజలను నడిపిస్తారనే ఆశాభావం వ్యక్తం చేస్తూ కామ్రేడ్ షాహి తన ఉపన్యాసం ముగించారు.

**కామ్రేడ్ సింహాద్రి ఝాన్సీ** మాట్లాడుతూ సామ్రాజ్యవాదం ఆధారపడే యుద్ధాలు, అవినీతి, సంక్షోభాలకు వ్యతిరేకంగా రైతాంగ మైత్రితో పోరాటం సాగించి సామ్రాజ్యవాదాన్ని ఓడించాలన్నారు. దీనికి ఆయా దేశాల శ్రామిక, పీడిత ప్రజానీకం సంఘటితమై పోరాడటం తప్ప, దగ్గర మార్గం మరొకటి లేదన్నారు. లెనినిజాన్ని మన దేశ పరిస్థితులకు అన్వయించుకోవాలన్నారు. మన దేశంలో అర్ధవలస - అర్ధఫ్యూడల్ సమాజాన్ని కూల్చివేసి నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారా సామ్యవాదాన్ని సాధించుకోవాలన్నారు. కమ్యూనిజానికి కాలం చెల్లలేదని, దోపిడీ పీడనలు ఉన్నంతవరకు కమ్యూనిజం ఉండి తీరుతుందని, ఇది ఓ నిరంతర క్రమమని, మార్క్సిస్టు మహోపాధ్యాయులు మన ముందుంచిన బోధనలను, ఆచరణలను అన్వయించుకుంటూ ముందుకు సాగాలని, ప్రజలను విద్యావంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు

**కామ్రేడ్ గుర్రం విజయ్‌కుమార్** తన ముగింపు ఉపన్యాసంలో భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం అనేక పాయలుగా చీలి ఉందని, దీనికి మూలమైన సిద్ధాంత, రాజకీయ విభేదాలు రాజకీయ కార్యాచరణ ప్రాతిపదికన పరిష్కారం కావాలన్నారు. భారతదేశంలో బూర్జువావర్గం ప్రజాతంత్ర కర్తవ్యాలను నిర్వహించ జాలదని తేటతెల్లమైందన్నారు. శాంతియుత విప్లవం, అంటే పార్లమెంటులో మెజారిటీ సాధించడమే లక్ష్యంగా ఆంతరంగిక సంఘర్షణ, చర్చలు సాగుతున్నాయిగానీ, ప్రజాతంత్ర కర్తవ్యాలను ఎలా పరిపూర్తి చేయాలనే దానిపై కాదన్నారు. భూమిపై అదుపు ➡

# పంజాబ్, హర్యానా రైతాంగంపై మోడీ ప్రభుత్వ అమానుష నిర్బంధకాండను నిరసించండి

# పోలీసు కాల్పులలో రైతు ప్రాణం బలిగొన్న క్రూర మారణకాండను ఖండించండి

**పంజాబ్,** హర్యానా, ఉత్తర భారత రైతాంగం మరోసారి తమ పంట పొలాలను వదిలిపెట్టి వీధుల్లోకి రావలసి వచ్చింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కోసం, రైతు రుణాల మాఫీ కోసం, ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలమైన తర్వాత, ఫిబ్రవరి 13న ముందుగా ప్రకటించిన విధంగా 'చలో ఢిల్లీ'కి రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. వేలాది మంది రైతాంగం పంజాబ్ నుండి హర్యానా సరిహద్దు వద్దకు చేరుకోగానే హర్యానాలోని బిజెపి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో నిరాయుధులై, శాంతియుతంగా ఢిల్లీ చేరాలని బయలుదేరిన రైతాంగాన్ని అడ్డుకోవడానికి, అసలు ఢిల్లీ గడప తొక్కకుండా చేయడానికి, కాంక్రీట్ దిమ్మలు, ఇనపకంచెలతో, భారత-పాకిస్తాన్ సరిహద్దులను మూసేసిన విధంగా మూసివేసి ఉంచారు. హర్యానా సరిహద్దులకు చేరుకున్న రైతాంగంపై శంభూ వద్ద, కసునూరు వద్ద రెండు సరిహద్దు ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలు, హర్యానా రాష్ట్ర పోలీసులు మోహరించి రైతులపై దాడులు చేశారు. డ్రోన్ల సహాయంతో రైతాంగంపై భాష్పవాయు తూటాలు ప్రయోగించారు. నీళ్ళ ట్యాంకులతో రైతులపై విరుచుకుపడ్డారు. వందలాదిగా రైతాంగం, విలేఖరులు ఈ అమానుష దాడుల్లో గాయాల పాలయ్యారు.

సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వాన 2021లో దాదాపు 18 నెలలపాటు రైతాంగం పోరాడారు. 700 మంది ప్రాణత్యాగం చేశారు. ఫలితంగా మూడు నల్ల చట్టాలను రద్దు చేస్తున్నట్టు మోడీ ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో ప్రకటించింది. పంటల మద్దతు ధరల అంశమై ఉన్నత స్థాయి కమిటీని నియమించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. కానీ పంటల కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. నాటి ఆందోళనలో రైతులపై పెట్టిన అక్రమ కేసులనూ, ముఖ్యంగా లఖింపూర్ ఖేరి వంటి చోట్ల రైతులపై కార్లను తోలిన బిజెపి నాయకుల దౌర్జన్యాలను వ్యతిరేకించినందుకు రైతులపై పెట్టిన కేసులను ఇంకా రద్దు చేయలేదు.



ఢిల్లీ సరిహద్దుల్లో రైతాంగంపై బిజెపి ప్రభుత్వ దమనకాండ

పైపెచ్చు మూడు నల్ల చట్టాలను దొడ్డిదారిన మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్నది. రైతాంగ ఉద్యమ తదనంతరం కూడా గిట్టుబాటు ధరలు లభించక రైతులు, కౌలు రైతులూ బలవన్మరణాలకు పాల్పడుతూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆహార ఉత్పత్తి క్రమాన్ని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరించడానికి, విదేశీ స్వదేశీ దళారీలపరం చేయడానికి చర్యలు తీసుకుంటూనే ఉంది. సెంట్రల్ వేర్‌హౌస్ గోడౌన్లను ఆదానీలకు అప్పగిస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో రైతాంగం మరో పర్యాయం వీధుల్లోకి రావడం తప్ప మరో మార్గం లేకపోయింది.

స్వామినాథన్‌కు 'భారతరత్న' అవార్డు ఇచ్చింది, ఎన్నికల ఓట్ల కోసం తప్ప - ఆ స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సులను అమలుచేయడం కోసం కాదని, బిజెపి పాలకులు పంజాబ్, హర్యానా రైతులపై ఎత్తిన లాఠీలతో నిరూపించారు.

**రైతులపై యుద్ధం ప్రకటించిన బిజెపి ప్రభుత్వం-ఫిబ్రవరి 21న హర్యానా సరిహద్దుల్లోని ఖనోరి వద్ద 21 ఏళ్ళ రైతు బిడ్డ శుభ్ కిరణ్ సింగ్‌ను అమానుషంగా కాల్చి చంపింది.** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, హర్యానా రాష్ట్రంలోని డబల్ ఇంజన్ ప్రభుత్వాలు సాగిస్తున్న డబల్ అమానుషత్వానికి నిదర్శనం ఈ దారుణం. చలో ఢిల్లీ కార్యక్రమానికి కదిలిన వేలాది మంది రైతులను హర్యానా సరిహద్దుల్లో నిలిపివేసి, రైతులపైనే యుద్ధాన్ని ప్రకటించిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరులో ఇది మరొక ఉదాహరణ. మరోపక్క రోడ్లపై మేకులు కొడుతూ, డ్రోన్లతో టియర్ గ్యాస్ తూటాలు విడుస్తూ, రబ్బర్ బుల్లెట్లతో కాలుస్తూ, శబ్ద, జల యంత్రాలతో రైతులపైనే ప్రభుత్వం యుద్ధం సాగిస్తున్నది.

ఈ అమానుష అణిచివేతను, నిర్బంధ కాండను తీవ్రంగా ఖండించమని, గిట్టుబాటు ధరలకు చట్టబద్ధత కోసం, రైతు రుణాల మాఫీ కోసం, విద్యుత్ చట్టాల సవరణ కోసం రద్దు కోసం ఉద్యమించాలని రైతాంగాన్ని, యావత్ ప్రజానీకం కోరుతున్నాము.

**ఎస్ ఝాన్సీ, అధ్యక్షులు**
**రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)**
**(ఏ ఐ కె ఎం కె ఎస్ అనుబంధం)**

---

→ గురించిన రూపాలు మారినా, భూమి పేదల హక్కుగా అందలేదని గుర్తు చేశారు. గత కాలంలో కమ్యూనిస్టులు సాగించిన తీరులో వర్గ పోరాటాలు నిర్మించాలని, లెనినిజం మనల్ని ఆదేశిస్తుందన్నారు. మతోన్మాద ఫాసిజం, దానికి నాయకుడైన మోడీ, ఈనాడు దోపిడీ పాలకులకు అవసరమయ్యాడని, హిందూ వాదానికి సంబంధించి కాంగ్రెస్, బిజెపిలు రెండూ బొమ్మ బొరుసులేనని, మతతత్వం పెరగకుండా నిరోధించే చర్యలను కాంగ్రెస్ ఏనాడూ చేపట్టలేదని ఆయన గుర్తు చేశారు.

కమ్యూనిస్టులు స్వతంత్ర భూమికపై నిలబడితే మాత్రమే కార్మిక వర్గాన్ని నడిపించ గలరని అదే ఫాసిజాన్ని ఎదుర్కొనే మార్గమని, సామాజిక విప్లవ కర్తవ్యంతో పాటు ఈ కర్తవ్యాన్ని కూడా చేపట్టాలని, ఒక ఐక్య కార్యాచరణ వేదికలోకి రావలసిన పరిస్థితులు మన ముందు ఉన్నాయని తెలియజేస్తూ ఆయన సభను ముగించారు.

ప్రజా కళాకారులు, ప్రజానాట్యమండలి కళాకారులు అమరులపై, దేశ- ప్రజల సమస్యలపై పోరాడిన పాటలు ఆకట్టుకున్నాయి. అంర్జాతీయ శ్రామికగీతంతో సభ ముగిసింది. ★

Janasakti (Communist Revolutionaries' Monthly) RNI No. 8315/63 VJ-077/2022-24
No.of pages : 28 Date of publication : 1st & 2nd of Every Month Posting date : 5th or 6th of Every Month

# మతతత్వ, ఫాసిస్టు బిజెపిని, దాని మిత్రపక్షాలను ఓడించటానికి ఎన్నికలలో ఓటు వేయండి!

# సామ్రాజ్యవాదులకు సేవ చేస్తున్న పాలకవర్గాల ప్రజా వ్యతిరేక విధానాలను తిరస్కరించండి!

# ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి నూతన ప్రజాస్వామ్యం కోసం, సోషలిజం కోసం ఐక్యం కండి! పోరాడండి!!

**గత** పది సంవత్సరాల బిజెపి ప్రభుత్వ విధానాల ఫలితంగా భారతప్రజల జీవితాలు సంక్షుభితంగా మారాయి. జాతీయాదాయం కుదించుకుపోయింది. అప్పులపై అప్పులతో పరిపాలన సాగిస్తున్న ప్రభుత్వం అప్పుల ఊబిలో కూరుకుపోయి ప్రజలపై అప్పుల భారాన్ని మోపింది. నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతూ ఆకాశాన్ని తాకుతున్నది. యువత పెరుగుతూనే వుంది. పారిశ్రామిక రంగం కుదేలవుతూ వుంది. ప్రభుత్వరంగాన్ని బడాబూర్జువా సామ్రాజ్యవాద దళారీలకు కట్టబెడుతోంది. విద్య, వైద్య రంగాలను ప్రైవేటీకరిస్తూ వుంది. వ్యవసాయంపై ఆధారపడి బ్రతుకుతున్న గ్రామీణ పేద రైతాంగం బ్రతుకులు, వలస బ్రతుకులయ్యాయి. పాత భూస్వామ్య దోపిడీ వ్యవస్థలు ఒక పార్శ్వంలో అమలు జరుపుతూనే, నూతన భూస్వామ్య ప్రభువుల చేతులలో భూమి కేంద్రీకృతం అవుతూ వుంది. సెజ్‌లు, కార్పోరేట్ కంపెనీలకు వేల, లక్షల ఎకరాలు కేటాయించి రైతులను భూమిహీనులుగా మారుస్తున్నది. అడవులలోని ఖనిజ సంపదను అంబానీ, అదానీలకు, విదేశీ సామ్రాజ్యవాదులకు దోచిపెట్టటానికి బూనుకొని, అటవీ సంరక్షణ పేరుతో ఆదివాసీ ప్రజల హక్కులను కాలరాస్తున్నది.

బిజెపి పాలన-సాగునీరు, వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అన్నీ స్వతంత్ర సామాజిక బాధ్యత నుంచి లాగివేసింది. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు కొన్నిసార్లు అమ్ముకునే వ్యవసాయదారుడిని, కొన్నిసార్లు కొనుక్కొనే వినియోగదారుణ్ణి సంక్షోభ స్థితిలోకి నెడుతున్నది. చేనేతవృత్తిదారులు మాస్టర్ వీవర్ల బందీలుగానే కాదు; కార్పోరేట్ పెట్టుబడి విషపు కోరలకు బలవుతూనే వున్నారు.

సర్వమత సమానత్వం, సర్వ ధర్మాలను పరస్పరం గౌరవించుకొనే లౌకికతత్వాన్ని కాలరాచి మతతత్వం, ఒకే మత ఆధిక్యత అత్యంత నిరంకుశత్వంగా ప్రజలపై రుద్దబడుతూ వుంది. హిందూమత సామ్రాజ్యాన్ని నెలకొల్పబోతున్నామనీ హిందూత్వ ఫాసిస్టు భావజాలంతో ఉన్మాదాన్ని పెంచుతున్నది. నిచ్చెనమెట్ల కుల సాంప్రదాయలను పరిరక్షించే పాత్రను పెంచుతున్నది. వివిధ భాషల, వివిధ జాతుల మధ్య భాషాభేదాలు, ప్రాంతీయ విద్వేషాలను పెంచుతూ అభివృద్ధి పేరుతో, సాంప్రదాయం పేరుతో అభివృద్ధి నిరోధకత్వాన్ని, మౌఢ్యాన్ని పెంచుతూ వుంది. అర్ధఫ్యూడల్, పెట్టుబడిదారీ సంస్కృతులను సమ్మిళిత రూపంలో బాల్యం నుంచే నూరిపోయాలనే పథకాలను తయారు చేసింది. పాత సాంప్రదాయాన్ని ప్రశ్నించినా, ఎదుర్కొన్నా హింసా ప్రవృత్తితో దాడులు చేస్తున్నది. ప్రజాస్వామిక సంస్కృతిని నిరాకరిస్తూ అణచివేయచూస్తున్నది.

బిజెపి- రాజకీయ రంగంలో బూర్జువావర్గం రూపొందించిన రాజ్యాంగ సూత్రాలను తమకనుకూలంగా మార్చుకొంటున్నది. భారత రిపబ్లిక్ స్థానంలో నిరంకుశ యూనిటరీ పద్ధతిని రుద్దటానికి విశ్వప్రయత్నం చేస్తున్నది. తమ అడుగుజాడలలో నడవని రాష్ట్రాల పట్ల వివక్షాపూర్వకంగా వ్యవహరిస్తున్నది. రాష్ట్రాల మధ్య, రాష్ట్రాలలోని వివిధ తెగల మధ్య చిచ్చు రేపుతూ వున్నది. పథకాల పేర్లతో ప్రజలను నియంత్రించ జూస్తున్నది. ఓటు బ్యాంకులుగానే గాక ప్రజాజీవన ప్రాంతాలను, కులాలను ఓట్ల మార్కెట్లుగా అభివృద్ధి చేస్తున్నది. ఓటు హక్కును అభాసుపాలు చేస్తున్నది.

బిజెపి బూర్జువావర్గ ఆధిపత్య, పెట్టుబడిదారీ కుళ్లు సంస్కృతిని, రాజకీయాలలో బాహాటంగా అమలు జరుపుకొంటున్నది. ఓటర్లను కొనడంనుంచి, ఎంఎల్‌ఎలను, ఎంపీలను, మంత్రులను గూడ కొనుగోలు చేస్తూ వుంది. బూర్జువానీతి, బూర్జువా ధర్మాలను గూడ బదాబదలు చేస్తూ వుంది. అహింసా సిద్ధాంతాలు వల్లించే ఈ పార్టీ ప్రైవేటు బలగాలను పోషిస్తూ టెర్రర్ రాజకీయాలను ఒక రాజకీయ విధానంగా మార్చింది. ప్రపంచంలో రెండు భావజాలాలు కొనసాగుతూ వున్నాయి. అభివృద్ధికర భావజాలాన్ని తుడిచిపెట్టి పెట్టుబడిదారీ, మతతత్వ భావాలను నెలకొల్ప చూస్తున్నది. నిజమైన ఫాసిస్టు ధోరణి ఇదే.

బిజెపి, దాని సంఘ పరివారం పైన పేర్కొన్న ధోరణులను నల్లేరుపై బండిలా దొర్లించజూస్తున్నది. ఎవడూ నోరెత్తరాదు, చెప్పినట్లు వినండి అనే ధోరణితో ఫాసిస్టు పోకడలకు గట్టి పునాదులు వేయబూనుకొన్నది. ప్రజలు ఈ ఫాసిస్టు పాలనకు స్వస్తి పలకవలసిందే. దీనిని ఓడించండి. ఇంత మాత్రమే ఈ సంక్లిష్ట సంక్షుభిత రాజకీయ పరిస్థితులలో మేము ప్రజలకు చెప్పదలచుకొన్నాం. బిజెపి, దాని ఫాసిస్టు పోకడలకు అడ్డుకట్ట వేయడానికి ఎన్నికల ప్రక్రియ ఒక పరిమిత మార్గమే. అయినా ఈ సందర్భంలో గూడ ప్రజా నిరసనను, ఆగ్రహాన్ని వెల్లడించవచ్చు.

కమ్యూనిస్టు శక్తులు, అభ్యుదయవాదులు, విప్లవకర శక్తులు తమ భూమికను విస్తృత పరచుకోవాలి, దృఢపరచుకోవాలి. అప్పుడే అభివృద్ధి నిరోధక, ఫాసిస్టు-రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక విధానాలను ఓడించ గలుగుతారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రాతిపదికను రూపొందించు కోగలుగుతారు.

**విప్లవ, ప్రజాతంత్ర శక్తుల ఐక్యత వర్ధిల్లాలి**

- **సమగ్ర భూ సంస్కరణలు అమలు జరపాలి!!**
- **సహజ వనరుల, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ ప్రక్రియను ఆపాలి!!**
- **వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో ఉత్పత్తి - సమన్వయ పూరితంగా, ప్రణాళికాబద్ధంగా అమలు జరగాలి!!**

**28-2-2024**

**కేంద్రకమిటీ**
**సిపిఐ (ఎం-ఎల్)**

Printed, Published and Owned by S. Seshamma
32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
Printed at SVR Offset Printers & Binders, D.No. 24-29-128B, Garimallavari Street, Gulabithota, Vijayawada-3
Editor : S. Seshamma, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010